thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 72 | కరీంనగర్ శుక్రవారం, 23 మే 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.




హైదరాబాద్: నగరంలోని శిల్పారామంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందడి చేశారు. అక్కడ కలియ తిరుగుతూ వివిధ స్టాళ్లను పరిశీలించారు. విక్రయిస్తున్న పలు వస్తువుల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శిల్పారామం వద్ద పలువురు కళాకారులు, చిన్నారులు సంప్రదాయ రీతిలో వారికి స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు సుందరీమణులు మంత్రముగ్ధులయ్యారు.




హైదరాబాద్: తెలంగాణలో రైల్వేల అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట, కరీంనగర్, వరంగల్‌లో అత్యాధునికంగా తీర్చిదిద్దిన అమృత్ భారత్ స్టేషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బేగంపేట రైల్వే స్టేషన్‌లో మహిళలే పని చేయబోతున్నారని తెలిపారు. దేశంలో 1,300 రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ప్రమాదాలు జరగకుండా కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చినట్లు తెలిపారు. "తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. రూ.80 వేల కోట్ల పనులకు సంబంధించి ప్రణాళికలు చేస్తున్నాం. దసరా రోజు కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తాం. ఎంఎంటీఎస్ రెండో ఫేజ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. యాదగిరిగుట్టకు కూడా ఎంఎంటీఎస్ పనులు ప్రారంభిస్తాం" అని కిషన్‌రెడ్డి తెలిపారు.



## కొండగట్టులో హనుమాన్ జయంతి వేడుకలు.. పోటెత్తిన భక్తులు

జగిత్యాల: హనుమాన్ జయంతి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టుకు భక్తులు భారీగా తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు వర్షంలోనూ కాలినడకన చేరుకుంటున్నారు. ఆంజనేయస్వామి మాలధారులు దీక్షా విరమణ చేస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజామున కొండగట్టులో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. క్యూలైన్లను కలెక్టర్ పరిశీలించారు.




అమెరికా అత్యంత శక్తిమంతమైన ఖండాంతర అణు క్షిపణి మినిట్‌మ్యాన్-3ను పరీక్షించింది. ఓ పక్క అధ్యక్షుడు ట్రంప్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ గోల్డెన్‌డోమ్ నిర్మిస్తున్నట్లు ప్రకటించిన వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం విశేషం. కాలిఫోర్నియాలోని వాన్డెన్‌బెర్గ్ స్పేస్ బేస్‌లో ఈ పరీక్ష జరిగింది. ఈ క్షిపణి గంటకు 15,000 మైళ్ల వేగంతో.. 4,200 కిలోమీటర్లు ప్రయాణించింది. చివరికి మార్షల్ ఐల్యాండ్స్‌లోని అమెరికా స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్‌కు చెందిన బాలిస్టిక్ డిఫెన్స్ టెస్ట్ ప్రదేశానికి చేరింది. ఈ పరీక్షపై అమెరికా గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ జనరల్ థామస్ బుస్సెరీ ఓ ప్రకటన విడుదల చేశారు. "ఈ ఐసీబీఎం పరీక్ష అమెరికా సన్నద్ధతకు, శక్తికి చిహ్నం" అని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలకు.. ఈ పరీక్షకు ఎటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. రొటీన్‌లో భాగంగానే ఇది జరిగిందని చెప్పారు. మినిట్‌మ్యాన్-3లో అత్యంత శక్తిమంతమైన మార్క్-21 రీఎంట్రీ వెహికల్ ఉంటుంది. దీనిలో న్యూక్లియర్ పేలోడ్‌ను అమర్చవచ్చు. గతంలో పలుమార్లు దీని శక్తి సామర్థ్యాలను అమెరికా పరీక్షించింది. గతేడాది నవంబర్‌లో ట్రంప్ విజయానికి ముందు కూడా ఒకసారి పరీక్షించారు. వాస్తవానికి మినిట్‌మ్యాన్ క్షిపణి 1970ల నాటిది. దీనిని సెంటెనిల్ సిస్టమ్‌తో భర్తీ చేయాలని అమెరికా భావిస్తోంది. కానీ, మినిట్‌మ్యాన్-3 మాత్రం అమెరికా వాయుసేన అత్యంత నమ్మకమైన క్షిపణిగా భావిస్తోంది. భవిష్యత్తులో అమెరికా గగనతలంలోకి ఏ క్షిపణీ ప్రవేశించకుండా, ఏ అణ్వాయుధమూ సమీపించకుండా 'గోల్డెన్ డోమ్' అనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థ నిర్మించేందుకు అగ్రరాజ్యం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలో కీలక ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్' తరహాలో అమెరికా కోసం 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థను ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవస్థ నిర్మాణానికి 175 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.15 లక్షల కోట్లు) ఖర్చవుతుందని పేర్కొన్నారు. దీంతో అమెరికా ఇక అంతరిక్షంలోనూ ఆయుధాలను మోహరించనుంది. యూఎస్ స్పేస్ ఫోర్స్ జనరల్ మైఖేల్ గుట్లీన్ ఈ 'గోల్డెన్ డోమ్' నిర్మాణాన్ని పర్యవేక్షిస్తారని ట్రంప్ తెలిపారు. ఇది తన పదవీ కాలం ముగిసేలోపు పూర్తవుతుందని ట్రంప్ చెప్పారు.




చురకలు



# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ



ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు. అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022–23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు – మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# ఉపయోగం వెన్నంటే ఉపద్రవం!



గోదావరిఖని : కర్ణాటక రాష్ట్రంలోని హోటళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఇడ్లీల తయారీకి ప్లాస్టిక్ వినియోగిస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. 250 నమూనాలు సేకరించి పరీక్షలు జరిపారు. 52 నమూనాల్లో క్యాన్సర్ కారకాలను గుర్తించి హోటళ్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిషేధించింది. 120 మైక్రాన్‌ల కన్నా ఎక్కువ మందం ఉన్న వాటినే అనుమతిస్తున్నారు. ఈ నిబంధనలు ఉమ్మడి జిల్లాలో అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ సంచుల వినియోగం అధికంగా ఉంది. మార్కెట్‌కు వెళ్తే వెంట వస్త్ర సంచులు తీసుకెళ్లాలన్న ఆలోచన జనంలో ఉండటం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఇటు ఆరోగ్యానికి అటు పర్యావరణానికి పెనుముప్పుగా మారుతుందన్న కనీస స్పృహ కరవైంది. అధికారులు అప్పుడప్పుడు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా జరిమానాలు విధిస్తున్నారు. అయినా పూర్తి స్థాయి నియంత్రణ సాధ్యపడటం లేదు. సాధారణ వస్తువులతోపాటు ఇటీవల కాలంలో వేడి పదార్థాలను కూడా ప్లాస్టిక్ సంచుల్లోనే ప్యాకింగ్ చేసి తీసుకెళ్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నా జనం పెడచెవిన పెడుతున్నారు. ఎటైనా వెళ్లినప్పుడు ప్రత్యేకంగా సంచి తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదన్న ఒక్క కారణంతో ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలక సంఘాల పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు అడపాదడపా తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాని నియంత్రణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకోవడం లేదు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అధికారులు సిబ్బంది కొరత కారణంగా మొక్కుబడిగా తనిఖీలు చేపడుతున్నారు. నగర, పురపాలక సంఘాలతోపాటు గ్రామ పంచాయతీల్లో కూడా ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలి. కాని దీనిపై ప్రత్యేక పర్యవేక్షణకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో నియంత్రణ సాధ్యమవడం లేదు.

**పర్యావరణానికి విపత్తు**

ప్లాస్టిక్ కవర్లలో వేడి ఆహార పదార్థాలు తీసుకెళ్లడం వల్ల రసాయనిక చర్య జరిగి హానికరమైన కణాలు తయారవుతాయి.

మైక్రో ప్లాస్టిక్‌లోని రసాయనాలు శరీరంలోని కణాలను దెబ్బతీస్తాయి. హార్మోన్ల అసమతుల్యతకు కారణమవుతాయి.

మురుగు కాలువల్లో ప్రవాహానికి ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడి వర్షాలు పడినప్పుడు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతాయి

చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిని పశువులు, వన్య ప్రాణుల ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు కలిసిపోవడం వల్ల భూసారం తగ్గిపోతోంది. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకకుండా అడ్డుపడుతుంది. ఫలితంగా భూగర్భ జలాలు పడిపోతాయి. ఇలా చేసి చూద్దాం..ప్రతి ఒక్కరూ వస్తువులు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే సమయంలో వస్త్ర సంచులు తీసుకెళ్లాలి.ఆహార పదార్థాలను తెచ్చుకోవడానికి స్టీల్ డబ్బాలు ఉపయోగించాలి. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 750 మంది మహిళల్లో, 400 మంది పురుషుల్లో క్యాన్సర్ లక్షణాలను గుర్తిస్తున్నారు.

క్యాన్సర్ ముప్పు ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. ప్లాస్టిక్ తయారు చేసేందుకు వినియోగించే రసాయనాలు మనం తెచ్చుకునే ఆహార పదార్థాల్లోకి చేరతాయి. వాటిని భుజించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. జీవక్రియ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎంత తగ్గించగలిగితే అంత మేలు. –డా.అశోక్‌కుమార్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

# నిధులు వస్తేనే జాతర నిండుగా!



ధర్మపురి: ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలపై నిధుల ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నెల 10 నుంచి 13 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివస్తారు. కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. రెండేళ్ల నుంచి ఉత్సవాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం లేదు. భారాస ప్రభుత్వం హయాంలో నాలుగేళ్ల కిందట సుమారు రూ.50 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడినా విడుదల మాత్రం కాలేదు. వసతుల కల్పనపై సమన్వయ సమావేశంలో చర్చిస్తున్నా.. నిధులు కేటాయించడం లేదు.

**పెండింగ్‌లో రూ.15 లక్షలు**

రెండేళ్లుగా దేవస్థానంలో జాతర ఏర్పాట్ల బిల్లులను అధికారులు చెల్లించడం లేదని గుత్తేదార్లు, అదనపు కార్మికులు వాపోతున్నారు. అదనపు పారిశుద్ధ్య కార్మికులకు, బ్లీచింగ్ పౌడర్, విద్యుత్తు గుత్తేదార్లకు ఇంతవరకు మున్సిపల్ నుంచి ఒక్క రూపాయి రాలేదు. సుమారుగా రూ.15 లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. బకాయిలు చెల్లించాలంటూ బాధితులు పురపాలక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. బకాయిలు చెల్లిస్తేనే జాతరకు ఏర్పాట్లు చేస్తామని గుత్తేదార్లు అంటున్నారు. అలాగే అదనపు కార్మికులను సుమారుగా 100 మందిని తాత్కాలిక పద్ధతిలో తీసుకుంటున్నారు.

గోదావరి ఎగువ ప్రాంతంలో సత్యవతి, బ్రహ్మగుండాల వద్ద లోతు ఉండటంతో భక్తులు స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇక్కడ ప్రమాదం తెలిపేలా బోర్డులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలి. సంతోషీమాతా, మంగళిగడ్డ ప్రాంతంలో దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేయాలి. దేవస్థానంలో తాగునీటికి కటకట ఏర్పడుతోంది. క్యూలైన్ల వద్ద తాగునీటి వసతులు కల్పించాల్సి ఉంది. పుర అధికారులు ప్రతి వాహనానికి రూ.50 వసూలు చేస్తున్నారే తప్ప పార్కింగ్ స్థలంపై దృష్టి సారించడం లేదు. మరుగుదొడ్ల నిర్మాణం రెండు నెలలుగా నత్తనడకన సాగుతున్నాయి. రాయపట్నం నుంచి కరీంనగర్‌కు ప్రత్యేక బస్సులు నడిపించాలి. ధర్మపురి పట్టణంలో అంతర్గత రహదార్లు అధ్వానంగా మారాయి.

# అతివలకు అండ

మెదక్: పని ప్రదేశంలో వేధింపులకు గురయ్యే అతివలకు 'మహిళా సాధికారత కేంద్రం' బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వ శాఖల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ(ఐసీసీ)ల ఏర్పాటుకు కసరత్తు మొదలైంది. పలు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ రంగంలో కమిటీలు ఏర్పాటవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు ఆయా శాఖల్లో ఐసీసీలు ఏర్పాటు కాగా, మిగిలిన వాటిల్లో పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం–2013 ప్రకారం శారీరక సంబంధం, లైంగిక ప్రయోజనాలను కాంక్షిస్తూ అభ్యర్థించడం, లైంగికపరమైన వ్యాఖ్యలు, అశ్లీల చిత్రాలను చూపుతూ అసభ్య ప్రవర్తనకు పాల్పడటం నేరంగా పరిగణిస్తారు.

**జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ...**

జిల్లా స్థాయిలో స్థానిక ఫిర్యాదుల కమిటీ(ఎస్‌సీసీ) పని చేయనుంది. ఇందులో కనీసం ఐదుగురు ఉంటారు. సభ్యుల్లో జిల్లా అధికారిణులు, న్యాయవాది, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, మహిళా ఉద్యోగులు భాగస్వాములు కానున్నారు. ఇది వరకు కమిటీ ఉండగా, ప్రతి మూడేళ్లకు ఒకసారి మార్పు చేయాల్సి ఉండడంతో కొత్త కమిటీ ఏర్పాటుకానుంది.

**ఫిర్యాదు ఎలా అంటే...**

లైంగికపరమైన వేధింపులకు గురైతే ఐసీసీకి ఫిర్యాదు చేస్తే గోప్యంగా విచారణ చేస్తారు. పరిష్కారం కాకుంటే ఎల్‌సీసీ వరకు వెళ్లొచ్చు. సంఘటన జరిగిన మూడు నెలల్లోపు ఫిర్యాదు చేయొచ్చు. మరికొన్ని సందర్భాల్లో అదనపు కాల పరిమితిని పరిగణనలోకి తీసుకుంటారు. విచారణ పూర్తయిన తరువాత నివేదికను ఇరుపక్షాలకు చేరవేయాలి.

**నోడల్ అధికారులుగా తహసీల్దార్లు...**

వేధింపులకు సంబంధించి మహిళలు మండల స్థాయిలో తహసీల్దార్ల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తహసీల్దార్లను నోడల్ అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల జీవో విడుదల చేసింది. కేసులు వచ్చినా మహిళా



సాధికారత కేంద్రం దృష్టికి తీసుకురావాలి.

**అన్ని సంస్థల్లోనూ అమలు**

ప్రైవేటు, ప్రభుత్వ, ఇతర సంస్థలు సహా అన్ని ప్రదేశాల్లో 10 లేదా అంతకుమించి ఉద్యోగులున్న చోట కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. జిల్లాలో 12 ప్రభుత్వ శాఖల్లో, 31 కంపెనీలు, ఆరు షాపింగ్ మాల్స్‌లలో ఐసీసీ కమిటీలు ఏర్పాటయ్యాయి. సీనియర్ ఉద్యోగి ప్రిసైడింగ్ అధికారిగా, మిగిలిన వారు సభ్యులుగా ఉంటారు. అవసరం మేర స్వచ్ఛంద సంస్థలు, నాయకత్వ లక్షణాలు కలిగిన మహిళలను తీసుకుంటారు. వీరు ప్రతి ఏడాది నివేదికను మహిళా సాధికారత కేంద్రంలో అందజేయాలి.

**ఉపేక్షించవద్దు**

ప్రస్తుతం ప్రభుత్వ శాఖల్లో ఐసీసీల ఏర్పాటుపై దృష్టి సారించాం. రానున్న రోజుల్లో పని ప్రదేశాల్లో ఏర్పాటు చేయిస్తాం. జిల్లా స్థాయిలో ఎల్‌సీసీ ఏర్పాటు చేస్తాం. వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 181, 100కు ఫోన్ చేయాలి. సంతోషి, జిల్లా సమన్వయకర్త, మహిళా సాధికారత కేంద్రం

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజుల యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైర్‌ను ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకుని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనిగిరిగుట్ట టెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్నం భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్నాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ.6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ.4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది.టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.


టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాల కోసం వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి



అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, డంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్‌లో మట్టిని గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతీ అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.

# సాగునీటి అవసరాలకు ఎల్లంపల్లి జలాలు

ధర్మారం : శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం నీటిని జిల్లా సాగు అవసరాలకు వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. స్థానిక సాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి జలాలను వినియోగించుకోవడం ఇదే మొదటిసారి. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవతో ఎల్లంపల్లి నీటిని వరద కాలువలోకి చేర్చి.. అక్కడి నుంచి పంటపొలాలకు తరలించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ ఆదేశాలతో శనివారం ఉయదం 8 గంటలకు నందిమేడారం పంపుహౌస్‌లో ఒక మోటారును ఆన్‌చేసి నందిమేడారం జలాశయంలోకి 3,150 క్యూసెక్కులను తరలిస్తున్నారు. రాత్రి 8 గంటలకు రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంపుహౌస్‌లోనూ ఒక మోటారును ఆన్‌చేసి 3,150 క్యూసెక్కుల చొప్పున వరద కాలువలోకి ఎత్తిపోస్తున్నారు. వరద కాలువ నుంచి మధ్యమానేరు జలాశయం వైపునకు జలాలు వెళ్లకుండా గేట్లను మూసివేసి కాలువలో నిలువ చేస్తున్నారు. వరదకాలువకు మల్యాల మండలం ర్యాలపల్లి వద్ద నున్న లింక్ కాలువ ద్వారా ఈ జలాలను కాకతీయ కాలువలోకి చేర్చి పెద్దపల్లి జిల్లాలోని పంట పొలాలకు మళ్లిస్తున్నారు.



**ప్రభుత్వ చర్యలతో మేలు**

ఎస్సారెస్పీ నుంచి చొప్పదండి మండలం రేవెళ్ల వరకు కాకతీయ కాలువలో కనీసం 3,300 క్యూసెక్కుల ప్రవాహం ఉంటేనే పెద్దపల్లి, మంథని నియోజకవర్గాలకు సాగునీరందుతుంది కానీ.. కేవలం 2,200 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. ఎస్సారెస్పీ అధికారులు ఇదివరకే ప్రకటించిన వారబంధీ షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 2 వరకు చివరి తడి అందించాల్సి ఉంది. కాకతీయ కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో చివరి వరకూ అందించలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పొలాలు ఎండుతాయనే ఆలోచనతో ప్రత్యామ్నాయంగా ఉన్న ఎల్లంపల్లి జలాశయం నుంచి అర టీఎంసీ తరలింపునకు చర్యలు తీసుకున్నారు. ఎల్లంపల్లిలో 10.03 టీఎంసీల నీటి నిలువ ఉంది. సోమవారం ఉదయం 8 గంటలకు నంది, గాయత్రి పంపుహౌస్‌లలో మోటార్లను నిలిపివేయనున్నారు. ధర్మారం, వెల్గటూరు మండలాల తాగునీటి అవసరాల కోసం జూన్ 30 వరకూ సరిపడేలా 228 మీటర్ల నీటిమట్టం ఉండేలా నిలువ ఉంచనున్నట్లు నీటిపారుదలశాఖ డీఈఈ విష్ణుప్రసాద్ తెలిపారు.

# ఉత్సవ ఏర్పాట్లలో జాప్యం

మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో మరో రెండు వారాల్లో నిర్వహించనున్న హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాల ఏర్పాట్లు ఇప్పటికీ పూర్తికాలేదు. ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 4 లక్షల వరకు దీక్షాపరులు తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో తడికల పందిళ్ల నిర్మాణం వేయాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు పూర్తికాలేదు. ఆలయం ముందుభాగంలో పందిళ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ వెనక భాగంలో పందిళ్లు, క్యూలైన్ నిర్మాణం ప్రారంభించలేదు. దీక్షాపరులు మాలవిరమణ చేసే కల్యాణకట్ట భవనం ముందు గతేడాది ఏర్పాటు చేసిన బారికేడ్లు, దీక్షాపరులు వేచిఉండేందుకు కంపార్ట్‌మెంట్లు సరిచేయలేదు. ఏప్రిల్ 11 నుంచి 13 వరకు నిర్వహించే చిన్న జయంతి ఉత్సవాలను హనుమత్ విజయోత్సవంగా వర్ధిస్తారని ఆలయ స్థానాచార్యులు కపిందర్ తెలిపారు. ఏటా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజున ఈ ఉత్సవాలు నిర్వహిస్తారని, వీటి తర్వాత 41 రోజులకు హనుమాన్



పెద్ద జయంతిని అధికారికంగా నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీగా వస్తోంది.

**భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు**

హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు, దీక్షాపరులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయిస్తాం. మిషన్ భగీరథ పైపులైను ద్వారా కొండపై నీటి వసతి కల్పించడంతోపాటు భక్తుల కోసం దాదాపు 150 వరకు తాత్కాలిక మరుగుదొడ్లు, అదనంగా 14 ప్రసాద విక్రయ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. మూడు రోజులపాటు అన్నదానం నిర్వహిస్తాం. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్ల నిర్మాణానికి సంబంధించి టెండర్లలో జాప్యం కారణంగా పనులు పూర్తికాలేదు. పుష్కరిణిలో ఎప్పటికప్పుడు శుభ్రమైన నీటిని నింపడంతోపాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉత్సవాలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.శ్రీకాంతరావు, ఈవో

# సాంకేతిక లోపం.. పనులు తాత్సారం

సంగారెడ్డి : సాంకేతిక లోపంతో ఎల్ఆర్ఎస్ పనులు ముందుకు సాగడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. అంతర్జాలంలో డబ్బులు చెల్లించేందుకు వెళితే వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదంటున్నారు. అతికష్టంపై రుసుం చెల్లించినా వారం రోజులైనా ప్రొసీడింగ్ కాపీ రాకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడువు తేదీ దగ్గర పడడంతో అందరూ ఒకేసారి వస్తుండడంతో అంతర్జాలంలో సాంకేతిక లోపం ఏర్పడుతోందని అధికారులు చెబుతున్నారు. ఈనెల 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ గడువు ముగుస్తుండడంతో పరిస్థితి ఏంటని డబ్బులు చెల్లించిన వారు ఆందోళన చెందుతున్నారు. **వారం రోజులుగా సర్వర్ డౌన్** జిల్లాలోని 8 పురపాలికల్లో ఎల్ఎర్ఎస్‌కు సంబంధించి వారం రోజులుగా సర్వర్ డౌన్ అవుతోంది. ఈనెల 31లోపు రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది. త్వరలో గడువు ముగుస్తుండడం.. సర్వర్ పనిచేయకపోవడంతో అధికారులకు ఇబ్బందిగా మారింది. ఫీజు చెల్లించినా ప్రొసీడింగ్ కాపీ ఎందుకు రావడం లేదని దరఖాస్తుదారులు పురపాలికలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను నిలదీస్తున్నారు. సాంకేతిక లోపంతో పనిచేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నా ఎవరూ వినడం లేదని ఆవేదన చెందుతున్నారు. 8 పురపాలికల్లో 7వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎల్1 రూపంలోనూ దరఖాస్తులు ... ది ఎల్ఎర్ఎస్ రుసుం చెల్లించకుండానే వెనుదిరిగి వెళుతున్నారు.

**- కోయిల్ కార్ రామ్ దయానంద్**

# యాసంగి ప్రణాళిక కరవు



సిరిసిల్ల : వానాకాలంలో వర్షాలు.. వరదలకు మధ్యమానేరు నిండుకుండలా మారింది. ఇంకేం.. జిల్లాలో రెండు పంటలకు సాగునీటికి ఢోకా లేదనుకున్నారు రైతులంతా. ప్యాకేజీ-9 పరిధిలో మల్కపేట జలాశయం నుంచి నీరొస్తుందని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల రైతులు ఆశలు పెట్టుకున్నారు. తీరా నీటివిడుదల సమయానికి ఈ ప్యాకేజీకి యాసంగి ప్రణాళిక లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో యాసంగిలో రికార్డు స్థాయిలో 1,76,500 ఎకరాల్లో వరి సాగు చేయగా కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోనే సుమారు 60వేల ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉంది. ఆయకట్టుకు నీరివ్వాలంటే వానాకాలం సీజన్ చివరిలోనే వివరాలు ఈఎన్‌సీకి పంపాలి. నవంబరులో ప్రాజెక్టులవారీగా ఉన్నతాధికారుల సమావేశంలో నీటి కేటాయింపులు నిర్ణయిస్తారు. వర్షాకాలం మధ్యమానేరుకు వచ్చే వరదనీటిని మల్కపేటకు, అక్కడి నుంచి మైసమ్మ, సింగసముద్రం జలాశయాల్లో నిల్వచేసుకోవాలి. కాగా ముందస్తు ప్రణాళికలేక నీటిని నిల్వచేయలేదు. తర్వాతకూడా ఆయకట్టుకు నీటి విడుదలపై ఉన్నతాధికారులకూ నివేదిక పంపలేదు. ఇప్పుడు పంట ఎండుతుంటే.. రైతులు మొరపెట్టుకుంటే ఇంజినీర్లు కదిలారు. మల్కపేటలోని ఒక టీఎంసీ నీరు కాల్వలో నాలుగు కిలోమీటర్లకే చేరింది. సింగసముద్రం చేరాలంటే 1.5 టీఎంసీలు ఉండాలి.

ప్యాకేజీ-9లో ఆయకట్టుకు నీరిచ్చే మేజర్, మైనర్ కాల్వల భూసేకరణ జరగక పనులు నిలిచిపోయాయి. దీంతో అధికారులు ఆయకట్టును అధికారికంగా నిర్ణయించలేదు. ఇదే విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లడంలో ఇంజినీర్లు జాప్యం చేశారు. మధ్యమానేరులో ప్రస్తుతం 19.89 టీఎంసీల నీరుంది. ఇక్కడి నుంచి 2 టీఎంసీల నీటిని మల్కపేటకు తరలించి... అక్కడి నుంచి మైసమ్మ చెరువు, సింగసముద్రంకు తరలించాలి. దీంతో కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లో గొలుసుకట్టు చెరువులను నింపవచ్చు. దీనివల్ల 35 గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు తీరతాయి.

**నీరు లేక నెర్రెలు**

మల్కపేట జలాశయం నుంచి నీటిని తరలిస్తారని ఏడు ఎకరాల్లో వరి సాగుచేశా. మైసమ్మచెరువులో నీరు అడుగంటింది. బోరుబావుల ద్వారా సరిపడా నీరందక 1.20 ఎకరాల్లో భూమి నెర్రెలు బారింది. ఇప్పటికీ మా చుట్టుపక్కల అయిదు గ్రామాల్లో నాలుగు వందల ఎకరాల్లో ఇదే పరిస్థితి. నీటి విడుదలలో జాప్యం జరిగితే మరింత నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

**గుగులోతు పెంటయ్య, దేవునిగుట్ట తండా**

రెండు టీఎంసీలు నింపాలి

నాకున్న అయిదెకరాల్లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశాను. మార్చిలో పంట పొట్టదశకు వస్తుంది. నీటి వినియోగం ఎక్కువ. భూగర్భజలాలు ఒక్కసారిగా పడిపోతాయి. జలాశయంలో రెండు టీఎంసీల నీరు నిల్వ ఉంటే పక్కనే ఉన్న ఆరు గ్రామాలకు మేలు జరుగుతుంది.వంగపల్లి మల్లేశం, నిజామాబాద్

అనుమతులు రావాలి

రైతుల సమస్య మా దృష్టికి వచ్చింది. ఈ విషయం ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లాం అక్కడి నుంచి అనుమతులు వస్తే మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి ఆయకట్టుకు విడుదల చేస్తాం. ఇందుకోసం పంపుహౌజ్‌ను సిద్ధం చేస్తున్నాం. కిశోర్, 9వ ప్యాకేజీ ఈఈ

# ప్రభుత్వ భూముల్లో అసైన్డ్‌దారుల హల్‌చల్





హైదరాబాద్ : ప్రభుత్వం తమకు కేటాయించిన భూములను రవాణాశాఖకు ఇవ్వడంపై దుండిగల్‌కు చెందిన అసైన్డ్‌దారులు ఆందోళన చేపట్టారు. రూ.2 వేల కోట్ల విలువైన 50 ఎకరాల భూములపై హక్కులున్నాయంటూ హల్‌చల్ చేస్తున్నారు. వాటిని స్వాధీనం చేసుకునేందుకు మేడ్చల్ జిల్లా ప్రాంతీయ రవాణా కార్యాలయ అధికారులు పనులను కొద్దిరోజుల నుంచి అడ్డుకుంటున్నారు.

బాహ్యవలయ రహదారి ఎగ్జిట్-5కు సమీపంలో ఈ భూములు ఉండడం.. నర్సాపూర్ రహదారికి 2 కిలోమీటర్ల దూరం కావడంతో ప్రాంతీయ రవాణా కార్యాలయం ఏర్పాటు చేస్తే మేడ్చల్ జిల్లా మొత్తానికి అందుబాటులో ఉంటుందని భావించిన ప్రభుత్వం నాలుగు నెలల క్రితం యాభై ఎకరాలు ఇచ్చింది. కొన్ని రోజుల క్రితం రవాణాశాఖ అధికారులు అక్కడికి వెళ్లి మట్టి చదును చేయడం, చెత్తను తొలగించి శుభ్రం చేస్తుంటే అసైన్డ్‌దారులు అడ్డుకున్నారు. రవాణాశాఖ అధికారులు అక్రమంగా భూముల్లోకి చొరబడిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేసి తాత్కాలికంగా పనులను నిలిపివేశారు.

**సాగు కోసం ఇచ్చారంటూ వాదన..** దుండిగల్ మండలంలోని సర్వే నంబర్ 454లో 365.17 ఎకరాల సర్కార్‌భూములున్నాయి. వాటిలో యాభై ఎకరాలకుపైగా భూములను దుండిగల్ పరిసర ప్రాంతాల్లోని రైతులకు దశాబ్దాల క్రితం ప్రభుత్వం కేటాయించింది. రైతులు వర్షాలు కురిసినప్పుడే పంటలు వేసేవారు. ఇరవైఏళ్ల క్రితం సర్వే నంబర్ 253లో 67ఎకరాలను అవుటర్ కోసం హెచ్ఎండీఏ తీసుకోవడంతో వారు సాగు చేయడంమానేశారు. కొన్ని నెలల క్రితం రెవెన్యూ అధికారులు ఈ భూములను నిషేధిత జాబితాలోకి మార్చారు. దీంతో రైతులు నిరసన వ్యక్తంచేస్తున్నారు.

# పరీక్షలు ఉచితం.. నిర్ధారణలో వేగం



పెద్దపల్లి :తెలంగాణ(టీ) డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో అత్యాధునిక యంత్రాలతో ఉచిత పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి రక్త నమూనాలు సేకరించి ప్రత్యేక వాహనాల్లో జిల్లాకేంద్రంలోని టీ డయాగ్నొస్టిక్ సెంటర్లకు తరలిస్తున్నారు. ఉచిత సేవలపై అవగాహన కల్పిస్తే మరింత ఎక్కువ మంది వినియోగించుకొనే అవకాశం ఉంది.

**134 రకాల పరీక్షలు**

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీ డయాగ్నొస్టిక్ కేంద్రాల్లో 134 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాలల్లో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేయగా పెద్దపల్లిలో ఏడాదిన్నర కిందట అందుబాటులోకి వచ్చాయి. బయోకెమిస్ట్రీ విభాగంలో కాలేయం, మూత్రపిండాలు, గుండె వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, యూరిక్ ఆసిడ్, జీర్ణక్రియ, విటమిన్స్ లోపంతో గుర్తించే పరీక్షలు, థైరాయిడ్, మధుమేహం.. పాథాలజీలో రక్తహీనత, తలసేమియా, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్స్, టీబీ, క్యాన్సర్.. మైక్రో బయోలజీలో టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**రాష్ట్రంలోనే వేగంగా పెద్దపల్లిలో..** టీ డయాగ్నొస్టిక్ కేంద్రం నిర్వహణలో పెద్దపల్లి ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లా, గోదావరిఖని సార్వజనిత ఆసుపత్రుల్లో సేకరించిన నమూనాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి తీసుకొస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రత్యేక వాహనాల్లో త్వరగా చేరుకొనేలా కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షిస్తున్నారు. రోజుకు మూడు షిప్టుల్లో టెక్నీషియన్లు, సిబ్బంది పని చేస్తుండగా రాష్ట్రంలోనే అత్యంత వేగంగా ఆరు గంటల్లోనే ఫలితాలు వెల్లడిస్తున్నారు.

**నిత్యం ఆరు వేలకు పైగా..**

ఉమ్మడి జిల్లాలో 67 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 498 ఉప కేంద్రాలు, 309 పల్లె దవాఖానాలు, 15 బస్తీ దవాఖానాలు, 15 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులున్నాయి. వీటి పరిధిలో ప్రతి రోజూ ఆరు వేలకు పైగా నమూనాలు సేకరిస్తున్నారు.

ప్రత్యేక వాహనాల్లో నమూనాలు

ప్రాథమిక, ఆసుపత్రుల నుంచి ప్రత్యేక వాహనాల్లో రక్త నమూనాలు తరలిస్తున్నారు.

శాంపిళ్లను ప్రత్యేకమైన శీతలీకరణ డబ్బాల్లో భద్రపరుస్తూ దాదాపు రెండు గంటలు పాడవకుండా చూస్తున్నారు.

రోగుల ఆధార్, ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తూ ఫలితాలను సంక్షిప్త సందేశాల రూపంలో పంపిస్తున్నారు.

రోగులు ఆసుపత్రులకు వెళ్తే రాతపూర్వక నివేదికలు కూడా ఇస్తున్నారు.

ఉచిత పరీక్షలపై అవగాహన లేక చాలా మంది ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి నష్టపోతున్నారు.

ప్రభుత్వ సేవలను వినియోగించుకుంటే ఒక్కో రోగికి కనీసం రూ.5 వేల వరకు ఖర్చు తగ్గుతుంది.

ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు డయాగ్నొస్టిక్ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి.

రూ.4 వేల భారం తగ్గింది

గుండె సంబంధ సమస్య, కీళ్లు, మెడ నొప్పులతో బాధ పడుతూ ఆరోగ్య కేంద్రానికి వెళ్లా. టీ డయాగ్నొస్టిక్ కేంద్రంలో ఎనిమిది రకాల పరీక్షలు చేసుకున్నా. ఇవే పరీక్షలకు ప్రైవేటులో రూ.4 వేల ఖర్చవుతుందని చెప్పారు.

రాజేశ్వరి, గోదావరిఖని

రాత్రి 11 గంటల వరకు విధులుజిల్లాలో ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానిస్తూ నాలుగు మార్గాల్లో వాహనాలు సమకూర్చి నమూనాలు తరలిస్తున్నాం. డయాగ్నొస్టిక్ కేంద్రంలో మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించాం. రాత్రి 11 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు.ప్రసన్నకుమారి, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

# మత్తు వదిలిస్తున్నారు!

సిరిసిల్ల: మద్యం తాగడం వ్యసనంగా మారి చాలామంది జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.. గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలవుతున్నవారూ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్నారు.. నాలుగు జిల్లాల్లో నెలకు రూ.200 కోట్ల మద్యం వ్యాపారం సాగుతుండటం.. ఏటా 20వేలకు పైగా డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతుండటం మద్యానికి బానిసలవుతున్న తీరును తెలియజేస్తోంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో 2024 ఏప్రిల్‌లో డీ-అడిక్షన్ కేంద్రాలను ప్రారంభించడంతో ఉచితంగా సేవలు అందుతుండగా, ప్రత్యేకంగా సిబ్బందిని నియమించకపోవడం లోటుగా ఉంది. దీంతోపాటు ఈ కేంద్రాలపై ప్రచారం లేకపోవడంతోనూ కొంతమంది ఎక్కువ డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాల్లోని ప్రైవేటు డీ అడిక్షన్ కేంద్రాలకు వెళ్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ (ఎన్ఏపీడీడీఆర్) పథకంలో డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నాలుగు ఆసుపత్రుల్లోనూ ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) విభాగం సైకియాట్రిస్టులే సేవలను అందిస్తున్నారు. ఎక్కడా ప్రత్యేకంగా విభాగం లేదు. ఈ చికిత్సలకు ప్రతి ఆసుపత్రిలో ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటు చేశారు. మద్యానికి బానిసలైన వారు సిరిసిల్లలో నెలకు సగటున 140, రామగుండంలో 120 మంది వస్తున్నారు. జగిత్యాల, కరీంనగర్ ఆసుపత్రుల్లో అందించే చికిత్సలను ఎన్‌సీడీలోని మానసిక విభాగంలో కలుపుతున్నారు. ఓపీకి వచ్చినవారిలో 30శాతం మంది మద్యం బానిసలు ఉంటున్నారని ఆ విభాగం అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో నెలకు సగటున 500ల మంది వరకు సేవలు పొందుతున్నట్లు అంచనా

సిరిసిల్లలో 40 ఏళ్ల వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. చేసే పనిలో శ్రద్ధ లేకుండా పోవడంతో పనికి పిలిచేవారు తగ్గిపోయారు. ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. కాలనీలో జరిగిన అవగాహన సదస్సులో డీ-అడిక్షన్ కేంద్రం గురించి తెలుసుకున్న కుటుంబసభ్యులు సిరిసిల్ల కేంద్రానికి తీసుకెళ్లగా నెల రోజుల్లో సాధారణ స్థితికి చేరి పని చేసుకుంటున్నాడు.కరీంనగర్‌లో ఓ యువకుడికి మద్యంతోపాటు గంజాయి అలవాటైంది. కళాశాలకు దుమ్మాకొట్టడం, మిత్రులతో కలిసి మద్యం, గంజాయి తాగడం వ్యసనంగా మారింది. ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఒకసారి పోలీసులకు పట్టుబట్టాడు. కుటుంబ సభ్యులకు జనరల్ ఆస్పత్రిలో డీ అడిక్షన్ కేంద్రం ఉన్న విషయం తెలియక హైదరాబాద్‌లోని ప్రైవేటు కేంద్రానికి తీసుకెళ్లారు. చికిత్సకు రూ.వేలల్లో ఖర్చవుతోందని అతని కుటుంబం వాపోతోంది.

డీ అడిక్షన్ కేంద్రాలకు వచ్చే బాధితులకు తొలుత వైద్య పరీక్షలు చేస్తారు. హిమోగ్లోబిన్ శాతం, కాలేయం, మూత్రపిండాల పనితీరు, మానసిక స్థితులను పరిశీలిస్తారు. తీవ్రతను బట్టి మందులు ఇస్తారు. బాధితులు, కుటుంబ సభ్యులకు మద్యపానంతో వచ్చే దుష్పరిణామాలు వివరించడంతోపాటు ఆ వ్యసనాల నుంచి విముక్తి కల్పించేలా కౌన్సెలింగ్ ఇస్తారు. బాధితుని ఆరోగ్య పరిస్థితిని బట్టి అలవాటు మానడానికి 1 నుంచి 3 నెలల సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందించే ఈ చికిత్స ప్రైవేటులో అయితే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. చికిత్సకు వచ్చేవారిలోనూ కొందరు మధ్యలోనే వెళ్లిపోతున్నారు. ఇక గంజాయి, కల్తీ కల్లు, ఇతర మత్తు పదార్థాలు తీసుకునేవారిని ఈ కేంద్రాలకు తీసుకు రావడం చాలా తక్కువ అని సిబ్బంది చెబుతున్నారు. డీ-అడిక్షన్ కేంద్రాల్లో నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల ప్రకారం ఇద్దరు సైకియాట్రిస్టు ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సు, అటెండర్లు ఉండాలి. కాగా జనరల్ ఆస్పత్రుల్లోని కేంద్రాలకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. నాలుగు జిల్లాల్లోని జనరల్ ఆస్పత్రి ఎన్‌సీడీ విభాగాల్లో ఒక సైకియాట్రిస్టు, ఇద్దరు నర్సులు, ఒక అటెండరు చొప్పున ఉండగా వారే డీ అడిక్షన్ కేంద్రానికి వచ్చేవారికి సేవలు అందిస్తున్నారు.

# నిషేధం.. కాగితాలకే పరిమితం

రాయికల్ : పల్లెల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా ఏది కొన్నా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంలో క్షేత్రస్థాయిలో కఠిన వైఖరి అవలంభించకపోవడంతో మానవ జీవితంలో నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు సవాలు విసురుతోంది. వినియోగించడం సరికాదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించే అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కావడంతో ప్లాస్టిక్ భూతం కరాళ నృత్యం చేస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు ఒక్కో ఇంటి నుంచి సుమారు 10 ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయి. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్త సేకరిస్తుండగా అందులో 50 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం అధికారు లు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తుండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

**సమష్టి సహకారంతోనే నియంత్రణ**

జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్

చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే



అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంలో దాతల సహకారంతో నారసంచులు పంపిణీ చేశాం. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమా నాలు విధిస్తుండటంతో ప్లాస్టిక్ విక్రయాలు కొంత మేర నియంత్రణలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.22వేల ఆదాయం సమకూరింది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి తనిఖీలు సద్దుమనిగాక తిరిగి యథావిధిగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విక్రయదారులు, వినియో గదారులు సమష్టిగా సహకరించినప్పుడే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. **వినియోగంతో అనర్థాలెన్నో..** పర్యావరణంపై అవగాహన లేని కొందరు జనావాసాల్లో, వ్యవసాయ క్షేత్రాలకు సమీప ంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పడేయడం వలన వర్షాలు కురిసినపుడు నీరు భూమిలోకి ఇంకిపోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరుకోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినడం ద్వారా గర్భకోశ వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. భూమిపైకి చేరిన ప్లాస్టిక్ కవర్లు నాశనం కావాలంటే వేల సంవత్సరాలు పడుతుం డగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసుల్లోని పదార్థాలు వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే వాయువులు విషపూరితమై సమీప కాలనీవా సులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

# యువత లక్ష్యంగా సైన్స్ రీల్స్

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం సందడంతా రీల్స్‌దే. వినోదం పంచడమే కాదు.. వ్యాపార ప్రకటనలు, ప్రచారాల వరకు వీటిదే హవా. ప్రభుత్వాల వైఫల్యాలపై వ్యంగ్యాస్త్రాలు, రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు ఏవైనా రీల్స్‌లోనే. పిల్లలు, కుర్రకారు మొదలు పెద్దల వరకు మొబైల్‌లో వీటి వీక్షణలో గంటల సమయం గడుపుతున్నారు. ఇంతటి జనాదరణ కలిగిన రీల్స్‌ను వినియోగించి సైన్స్‌ను జనంలోకి తీసుకెళ్లేందుకు హైదరాబాద్‌లోని కేంద్ర పరిశోధన సంస్థలు సమాలోచనలు చేస్తున్నాయి.

నగరంలో తార్నాక నుంచి ఉప్పల్ వరకు సైన్స్ కారిడార్‌లో పలు కేంద్ర పరిశోధన సంస్థలు ఉన్నాయి. ఐఐసీటీ, సీసీఎంబీ, ఎన్‌జీఆర్‌ఐ, సర్వే ఆఫ్ ఇండియా, సీడీఎఫ్‌డీ కేంద్రాలు ఇక్కడ ఉన్నాయి. ఇన్నర్‌రింగ్ రోడ్డు మీదుగా చంద్రాయణగుట్ట వరకు వెళ్తే డీఆర్‌డీవో ల్యాబ్‌లు ఉన్నాయి. ప్రజల పన్నులతో నడుస్తున్న ఈ సంస్థలు తమ పరిశోధనల గురించి ముఖ్యమైన వాటిని ఎక్స్‌లో పంచుకుంటున్నాయి. సీసీఎంబీ యూట్యూబ్ సిరీస్‌లు చేస్తోంది. సైన్స్‌పై కొత్తతరంలో ఆసక్తి పెంచడంతో పాటూ తమ చుట్టుపక్కల ఉన్న ప్రయోగశాలల్లో ఏమి చేస్తున్నారనే విషయాలను ప్రజలకు చేరవేసేందుకు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చాలా తక్కువ మందికే చేరుతున్నాయి. దీంతో కొన్ని సంస్థలు విస్తృత ఆలోచన చేస్తున్నాయి. సృజనాత్మకంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..ముఖ్యంగా యువత లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి.

**30 నుంచి 90 సెకన్లలో..**

గంటల తరబడి వీడియోలను చూసే వారి సంఖ్య తక్కువ. అందునా సైన్స్‌పై అంటే ఇంకా తక్కువ. అందుకే రీల్స్ చేసి సామాన్య జనానికి చేరువకావొచ్చన్న ఆలోచనలను పరిశోధన సంస్థలు చేస్తున్నాయి. రీల్స్‌ను 30 సెకన్లలో తీస్తారు. గరిష్ఠంగా 90 సెకన్లకు మించదు.




ఈ తక్కువ సమయంలోనే సూటిగా, సుత్తిలేకుండా పరిశోధనలతో సాధించిన విజయాలను చెప్పాల్సి ఉంటుంది. ఇందుకోసం భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫిల్మ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ)తో చర్చిస్తున్నామని హైదరాబాద్‌లోని సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ఆచార్య ఉల్లాస్ తెలిపారు.

**విజ్ఞాన సమాజం కోసం..**

సైంటిఫిక్ టెంపర్ ఉన్న సమాజం ఉండాలనేది మా ప్రయత్నం. సైన్స్‌లో చాలా ఆవిష్కరణలు సామాన్య మానవులకు చేరడం లేదు. ప్రస్తుతం సైన్స్ లిటరసీ ఒక సవాల్‌గా ఉంది. అక్షరజ్ఞానంతో ఆగిపోకుండా వైజ్ఞానిక అక్షరాస్యతను పెంపొందించాల్సి ఉంది. అప్పుడే రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏహెచ్ ప్రకారం సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం సాధ్యమవుతుంది. ప్రస్తుతం యువత సమాజంలో మూఢనమ్మకాలకు ఎక్కువ బలవుతున్నారు. వీరిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు రీల్స్ ఆలోచన వచ్చింది. ప్రస్తుతం యువత ఎక్కువగా ఇన్‌స్టాలోని రీల్స్ చూస్తున్నారు. తక్కువ నిడివితో రీల్స్ చేశాం. లక్షల సంఖ్యలో చూస్తున్నారు. జనంలోకి తీసుకెళ్లగలిగాం. స్పందన బాగుంది. ఈ తరానికి చేరేందుకు సంప్రదాయపద్ధతుల్లో సాధ్యం కాదు. కొత్త పద్ధతులను అన్వేషించాలి. రీల్స్ అలాంటివే. ఇంకా ఏమైనా ఉంటే కూడా ప్రయత్నించవచ్చు.
రమేశ్, అధ్యక్షుడు, విజ్ఞానదర్శిని

# సేవ ముసుగులో సైబర్ మాయగాళ్ల దందా

హైదరాబాద్ : సైబర్ మాయగాళ్లు ఏ అవకాశాన్ని వదులుకోవట్లేదు. ప్రజల భావోద్వేగాలతో ముడిపడిన ప్రతిదాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. పేద పిల్లలకు విద్య బుద్ధులు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ప్రార్థనామందిరాలకు విరాళాలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఉచిత వైద్య చికిత్సలంటూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆకట్టుకుంటున్నారు. సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఆలోచన ఉన్నవారు ఇది నిజమనే ఉద్దేశంతో స్పందించి డబ్బులు నష్టపోతున్నారు. మరోవైపు విదేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు, ట్రస్ట్‌లు భారత్‌లో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమైందంటూ ఫోన్ నంబర్లకు సందేశాలు, లింకులు పంపుతున్నారు. వాటికి స్పందించిన వారి ఫోన్లను హ్యాక్ చేసి బ్యాంకు ఖాతాల లావాదేవీలు తమ అధీనంలోకి తీసుకుంటున్నారు. తొలుత నమ్మకం కలిగించేందుకు రూ.5-10వేలు బాధితుల



ఖాతాల్లో జమ చేస్తున్నారు. పెద్దమొత్తంలో నగదు బదిలీ చేసేందుకు ముందుగా పన్నులు చెల్లించాలంటూ రూ.లక్షలు కొట్టేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు 5-6 కేసులు నమోదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు, సంస్థల పేరిట వచ్చే లింక్‌లు, సేవ, విరాళాల పేరిట వచ్చే ప్రకటనలు నమ్మొద్దని సైబర్‌క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. మాయగాళ్ల చేతిలో సొమ్ము నష్టపోయిన బాధితులు టోల్‌ఫ్రీ నం.1930కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

**సాయం పేరుతో మోసంవిదేశాల్లో** ఉన్న తమ వర్గానికి చెందిన ప్రజలకు సాయం చేయాలంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు ఒక యువకుడిని ఆకట్టుకుంది. అవతలి వారిని యాప్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించాడు. మిత్రుల సహకారంతో నిధులు సేకరించి వారు సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేశాడు. ఆ తరువాత వాస్తవం తెలియటంతో మోసపోయినట్టు గ్రహించాడు. పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తి ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేశాడు. ప్రార్థనామందిరం నిర్మాణానికి తాము సాయం చేస్తామని మాయగాళ్లు చెప్పటంతో నిజమని భావించాడు. బ్యాంకు ఖాతా వివరాలు పరిశీలించేందుకు కొంత నగదు జమచేయాలంటూ దఫాలవారీగా రూ.1.50లక్షలు కొట్టేశారు. అనంతరం ముఖం చాటేయటంతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# వరికి తెగులు.. అన్నదాతల్లో గుబులు



ఎల్లారెడ్డిపేట: మెట్ట ప్రాంతమైన జిల్లాలో అన్నదాతలకు గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఓ వైపు సాగునీటి కొరత నెలకొనగా మరోవైపు వరిపంటకు తెగుళ్లు సోకుతుండటంతో దిగులు చెందుతున్నారు. కాండం తొలుచు(మొగి) పురుగుతో ఇప్పటికే పైరు తెలుపురంగులోకి మారుతుండగా అగ్గితెగులు విజృంభిస్తోంది. తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తుండటంతో అదనంగా పెట్టుబడి వ్యయమవుతోంది. కాండం తొలుచు పురుగు నారు దశలో వరిపై చేరి, కంకి ఏర్పడే దశలో బయటపడుతుంది. పంటచేతికందే దశలో గింజలు తాలు పోతున్నాయి. ఈ ప్రభావం జిల్లా వ్యాప్తంగా నెలకొంది. అగ్గితెగులు వల్ల తొలుత ఆకులపై ఎర్రటి మచ్చలేర్పడుతున్నాయి. క్రమేణా కండె ఆకారంలో పెద్దగా మారడం వల్ల ఆకులు ఎండిపోతున్నాయి. ఈ కారణంగా వరిగొల పూర్తిగా విరిగిపోయి, నేలరాలిపోతుంది. వీటితోపాటు గింజ దశలో కంకినల్లి పురుగు ఆశిస్తోంది. గింజల నుంచి రసం పీల్చడం వల్ల గింజలు తాలుపోతున్నాయి.

**అన్నదాతలకు నష్టం** ఈ యాసంగిలో జిల్లాలో 1,78,350 ఎకరాల్లో వరి సాగు చేశారు. సన్నరకాలను 17,505 ఎకరాల్లో, దొడ్డు రకాలను 1,60,845 ఎకరాల్లో సాగుచేశారు. మొత్తం కలుపుకొని 4,38,872 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, కోనరావుపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్ తదితర మండలాల్లో తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. **పెట్టుబడి చేతికందని పరిస్థితి**

ఈ యాసంగిలో ఏడెకరాల విస్తీర్ణంలో దొడ్డు రకం వరి సాగుచేశాను. పంటమొత్తం ఈని, గింజలు గట్టిపడే దశకు చేరుకుంది. దాదాపు 40 శాతానికి పైగా పైరు తాలుపోయి, తెలుపురంగులోకి మారిపోయింది. రెండుమూడు సార్లు పురుగు మందులను పిచికారీ చేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది. పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు ఎలాంటి రసాయన మందులు వాడినా ప్రభావం ఉండదని అధికారులు అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి. అరికాల రామచంద్రం, రైతు, రాచర్ల బొప్పాపూర్

**సస్యరక్షణ చర్యలు పాటిస్తే మేలు**

తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి. కంకి బయటకు వచ్చిన తర్వాత ఈసపోవడాన్ని గమనిస్తే క్లోరాంతనిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. కార్టాఫ్‌హైడ్రోక్లోరైడ్ గుళికలను చల్లుకున్నా సరిపోతుంది. అగ్గితెగులు లక్షణాలు బయటపడితే యూరియా చల్లడం నిలిపివేయాలి. గట్లపై గడ్డిలేకుండా పూర్తిగా పరిశుభ్రపరచాలి. వ్యవసాయ అధికారులను సంప్రదించి తగిన సలహాలు తీసుకోవాలి. కాసం రాజశేఖర్, వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# నిధులు రావు.. పనులు పూర్తికావు



సిరిసిల్ల: జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ రకాల పనులకు అవసరమేరకు నిధులు రాక, అసంపూర్తిగా మిగిలిపోతున్నాయి. చందుర్తి మండలంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. బిల్లులు చెల్లించకుండా ఆరోగ్యకేంద్రం వినియోగిస్తుండటంతో ఇటీవల గుత్తేదారులు దానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. గ్రామస్థులు నచ్చజెప్పడంతో వెనక్కి తగ్గారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్సీ సామాజిక భవన నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు.

**సామాజిక భవనాలే అధికం** జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంఎఫ్‌టీ, ఎన్‌హెచ్‌ఎం, సంక్షేమశాఖలు, ఎంపీల్యాడ్స్‌లో సామాజిక భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఆయా పనులకు ప్రొసీడింగ్స్ సైతం ఇచ్చారు. వీటిలో ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్యమిషన్ పథకం)లో ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ఎనిమిది చోట్ల దాదాపు పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు గ్రామాల్లో కొద్దిమేరకు పనులు మాత్రమే మిగిలాయి. అద్దెభవనాల్లో కొనసాగుతున్న గ్రామాల్లో పనులు పూర్తయిన చోట ఉపకేంద్రాల్లోకి వెళ్లి.. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. వీటిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఒక్కో ఆరోగ్య కేంద్రానికి రూ.16 లక్షలతో పనులు చేపట్టారు. వీటిలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఎన్‌హెచ్‌ఎంకు జమచేసినట్లు గుత్తేదారులు చెబుతున్నారు. కాగా అధికారులు మాత్రం నిధులు విడుదల కాలేదంటూ కాలం వెళ్లదీస్తున్నారని వాపోతున్నారు.

**ప్రతిపాదనల దశలోనేవర్షాలకు** దెబ్బతిన్న గ్రామీణ రహదారుల మరమ్మతులకు డీఎంఎఫ్‌టీ కింద వీర్నపల్లి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఏడు పనులకు రూ.3.99 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఇందులో చేసిన పనులకు రూ.43.07 లక్షలు మంజూరు కావాల్సి ఉంది.ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల వసతి కల్పించేందుకు వివిధ మండలాల్లో 36 నిర్మాణాలకు రూ.72 లక్షలు మంజూరయ్యాయి. అలాగే 50 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.4 కోట్లు, ఎనిమిది పంచాయతీ భవనాలకు రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. ఆరు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పనులు నామమాత్రంగా ప్రారంభించారు. మిగతా పనులకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం గమనార్హం. బిల్లుల విడుదలపై పీఆర్ ఈఈ సుదర్శన్‌ను 'ఈనాడు' సంప్రదించగా పనులు పూర్తయిన వాటికి రికార్డులు పూర్తిచేసి ప్రభుత్వానికి పంపామన్నారు.

# చీకట్లో సౌర.. బిల్లు పెరిగి ఔరా!



సిద్దిపేట: 'ఏంది రామయ్యా.. దిగులుగా ఉన్నవు?' 'ఏం లేదే లక్ష్మయ్యా.. గతంలో మా ఇంటికి కరెంటు బిల్లు రూ.100 నుంచి రూ.150 వచ్చేది. ఇప్పుడు రూ.300 నుంచి ఒక్కోసారి రూ.700 వస్తోందే.' 'నాక్కూడా కరెంటు బిల్లు గట్లనే ఎక్కువొస్తున్నదే. సోలార్ ప్లేట్లు బాగా పనిచేసిన కాలంలో బిల్లు తక్కువొచ్చేది' 'అవును కదనే. ఆ సోలార్ ప్లేట్లు ఖరాబాయె. రిపేర్ చేసేటందుకు ఎవరూ పట్టించుకోకపాయె. మరమ్మతు చేస్తే మనకు.. ఊరికి మంచిగుండేది' ... ఇలా నారాయణరావుపేట మండలం బంజేరుపల్లిలో గ్రామస్థుల ఆవేదన. **రెండేళ్లుగా పనిచేయని తీరు**

రెండేళ్లుగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో గ్రామంలోని దాదాపు ప్రతి ఇంటికి అమర్చిన సౌర ఫలకలు పనిచేయడం లేదు. మరమ్మతులకు గురవడంతో వినియోగంలో లేవు. పెరిగిన విద్యుత్తు బిల్లులతో సతమతమవుతున్నారు. కొందరికి మాత్రమే 200 యూనిట్ల లోపు కరెంటు కాల్చిన వారికి గృహజ్యోతి కింద ఉచితంగా వర్తిస్తోంది. ఈ గ్రామ ప్రజలంతా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. 2017లో అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు గ్రామంలో సౌర ఫలకలు ఏర్పాటు చేయించారు. ఆరు సంవత్సరాల తర్వాత వివిధ కారణాలతో పని చేయడం మానేశాయి. నాడు తక్కువ విద్యుత్తు బిల్లులు వచ్చేవి. జిల్లా కేంద్రానికి 20 కిలో మీటర్ల దూరంలో నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామం ఉంది. సహజ వనరు అయిన సూర్యకాంతి వినియోగంతో విద్యుత్తు ఉత్పత్తితో ఇంటి అవసరాలకు విద్యుత్తు వినియోగించుకోవడానికి గ్రామస్థులంతా ఒక్కటై సౌర ఫలకలు ఏర్పాటు చేయించుకున్నారు. ఆన్‌డోమెడ్, టాటా కంపెనీ సహకారంతో నాడు బిగించారు. సౌర వెలుగుతో ఉత్పత్తి అయిన విద్యుత్తును చక్కగా ఇంటి అవసరాలకు వినియోగించుకునేవారు.

పునరుద్ధరిస్తే మేలు: చందు, గ్రామస్థుడు

గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ఫలకలు నిర్వహణ లేకపోవడంతో పని చేయడం లేదు. ప్రభుత్వం మరమ్మతు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే ప్రజలకు ఎంతో ఉపయోగం. వాటిని వినియోగించుకున్న సమయంలో తక్కువ విద్యుత్తు వినియోగించుకునే వాళ్లం. ప్రస్తుతం అవి పని చేయక పోవడంతో విద్యుత్తు యూనిట్ల వినియోగం పెరిగింది. ఖర్చు పెరిగింది.బంజేరుపల్లి జనాభా: 600

గ్రామంలో గృహ విద్యుత్తు కనెక్షన్లు: 118

ప్రస్తుతం యూనిట్ల వినియోగం: 9285

ఊరంతా బిల్లు మొత్తం (రూ.లో): 40,000

సౌర ఫలకలు ఉన్న ఇళ్లు: 100

పని చేసిన సంవత్సరాలు: 6

# నేతన్న ఆదాయం ఆర్జించేలా..

దుబ్బాక: ప్రస్తుతం చేనేత రంగంలోనూ ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. విభిన్నమైన చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగింది. అందులోనూ పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు అంటే ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు ఇష్టపడుతున్నారు. దీన్ని అందిపుచ్చుకొని వీటిని తయారుచేసి దుబ్బాక నేత కార్మికులు ఆదాయం ఆర్జించేలా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) కార్యాచరణ రూపొందించి అడుగేయడం విశేషం.

**ముడి సరకు ఇచ్చి..**

దుబ్బాక చేనేత సొసైటీలో 1734 మంది కార్మికులు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం 50 మంది మాత్రమే 40 మగ్గాలపై వస్త్రాలు నేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ తరుణంలో వీరిని మరింత ప్రోత్సహించేందుకు టెస్కో ఆదేశాలతో తక్కువ బరువు, మృదువుగా ఉండే పోచంపల్లి ఇక్కత్ కాటన్ చీరలు నేయిస్తున్నారు. నెల రోజుల కిందట ఈ ప్రక్రియ మొదలవగా, టెస్కో కావాల్సిన ముడి సరకును అందించడంతో పాటు నేసిన చీరలను సైతం కొనుగోలు చేసి విక్రయిస్తోంది. సంప్రదాయ టై అండ్ డై టెక్నిక్‌ను ఉపయోగించి, పేక (అడ్డు-వెఫ్ట్) 80 సింగిల్, వార్ప్ (నిలువు) 120 డబుల్ పద్ధతిలో వీటిని



రూపొందిస్తున్నారు. ఇందుకు వినియోగించే నూలు దారాలకు రంగు వేసే ప్రక్రియనూ చేపడుతున్నారు.

**రెండు రోజుల సమయం..**

ప్రస్తుతం ఒకే మగ్గంపై సాధారణ డిజైన్లలో ఇక్కత్ చీరలను ఇద్దరు కార్మికులు నేస్తున్నారు. ఒక చీర తయారీకి రెండు రోజుల సమయం పడుతోంది. ఇందుకు వారికి రూ.800, దారాలను కండెలపై చుట్టిన వారికి రూ.100 కూలీగా చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ డిజైన్లలో 15 చీరలను తయారుచేశారు. కూలీ ఖర్చులు రూ.900, ముడి దారాలకు రూ.1000 ఖర్చవుతోంది.

**తువాళ్లను తయారు చేస్తాం**

నేత కార్మికులు ఆదాయం ఆర్జించేందుకు టెస్కో ఆదేశాలతో పోచంపల్లి ఇక్కత్ మస్‌రేస్డ్ కాటన్ చీరలను నేయిస్తున్నాం. వచ్చే ఆర్డర్లను వీటి తయారీకి ఏర్పాట్లు చేస్తున్నాం. రానున్న రోజుల్లో ఇక్కత్ కాటన్ తువాళ్లను సైతం తయారుచేయనున్నాం.జి.భాస్కర్, సొసైటీ బాధ్యుడు

# అంగన్వాడీ కేంద్రం.. ఆరోగ్య భాగ్యం

నర్సాపూర్: చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ నేపథ్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో సేంద్రియ విధానంలో పెరటితోటల పెంపకం చేపట్టారు. జిల్లాలోనే నర్సాపూర్ ప్రాజెక్టు ఈ విషయంలో స్ఫూర్తిగా నిలుస్తోంది. ప్రాజెక్టు పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, చిలప్‌చెడ్, తూప్రాన్, మనోహరాబాద్ మండలాలున్నాయి. వీటి పరిధిలో 288 అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 80 శాతం కేంద్రాల్లో వివిధ ఆకు కూరలు పెంచుతున్నారు. పక్కా భవనాలు, విశాలమైన ఆవరణ ఉన్న చోట ఈ ప్రక్రియ చక్కగా కొనసాగిస్తున్నారు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా, ఆకు కూరలు, పండ్ల మొక్కలు నాటేస్తున్నారు. స్థలం లేనివారు చిన్నచిన్న తొట్లు, కుండీలు, బకెట్లు, పగిలిపోయిన బిందెల్లో పెంచుతున్నారు. టీచర్లు, ఆయాలు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

**ఉచిత విత్తనాలు**

పాలకూర, మెంతి, గోంగూర, బచ్చలి, చామ, కరివేపాకు వంటి వివిధ రకాలైన ఆకు కూరలు పండిస్తున్నారు. జిల్లాలో దక్కన్ సొసైటీ, కృషి విజ్ఞాన కేంద్రం(తునికి) విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నాయి. ప్రాజెక్టు పరిధి అంగన్వాడీ టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. ఆరు నెలలకోసారి అయిదు కేంద్రాలను ఎంపిక చేసుకుని తోటల పెంపకం చేపడుతూ పౌష్టికాహారం అందిస్తున్నారు. జామ, బొప్పాయి, దానిమ్మ, గుమ్మడి వంటి పండ్ల మొక్కలను సంరక్షిస్తూ కేంద్రాలకు వచ్చే వారికి పంపిణీ చేస్తున్నారు. సీడీపీవో పర్యవేక్షణలో 11 మంది పర్యవేక్షకులు కేంద్రాలను సందర్శిస్తూ పెంపకం దారులను



ప్రోత్సహిస్తున్నారు.

**ఈ కేంద్రాలు ఆదర్శం**

నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్, రెడ్డిపల్లి తదితర గ్రామాలు, కౌడిపల్లి ఉమ్మడి మండలంలో జగ్గంపేట, కొత్త చెరువు తండా, కౌడిపల్లి-4, శివ్వంపేట మండలం దొంతి, లింగోజిగూడ, చెన్నాపూర్, పిల్లుట్ల, తూప్రాన్ ఉమ్మడి మండలంలో కాళ్లకల్, అగ్రహారం, లింగారెడ్డిపేట, పోతురాజ్‌పల్లి తదితర కేంద్రాలు. కొన్ని కేంద్రాలకు కంచెను ఏర్పాటు చేయగా, మరికొన్ని చోట్ల గేట్లను అమర్చారు. కొందరు ఒకటేసి తోటల సాగు చేపడుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడి, పౌష్టికాహారం అందించడంతో వచ్చేవారి సంఖ్య పెరిగిందని, తద్వారా లోపపోషణను అధిగమించగలుగుతున్నామని అధికారులు చెబుతున్నారు.

**పోషకహారం లోపాన్ని అధిగమిస్తున్నాంచిన్నారుల్లో** పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు పెరటి తోటల పెంపం ఎంతగానో దోహదపడుతోంది. మూడునెలల పాటు ఆకుకూరలు, పండ్లు, రాగి జావ వంటివి ఇస్తే చిన్నారుల ఎదుగుదలలో కొంత మార్పు కనిపిస్తోంది. జిల్లాలోనే ప్రాజెక్టు పరిధిలో తోటల పెంపకంలో ఆదర్శంగా నిలవడం ఆనందంగా ఉంది. హేమభార్గవి, సీడీపీవో

# పర్యావరణానికి పునర్విని'యోగం'!

కరీంనగర్ : చెత్తను తడి, పొడిగా వేరు చేసి ఇస్తేనే సేకరించేలా పురపాలికలు, నగరపాలికల్లో కార్యాచరణ చేపట్టారు.. ఇన్నాళ్లు అంతా కలిపి ఆటోలో వేస్తుండటంతో వ్యర్థాలు పునర్వినియోగించలేక డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి.. వ్యర్థాలు గుట్టలుగా మారి దుర్వాసనకు, వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్నాయి.. దీనిని కట్టడి చేయాలని విడిగా చెత్త సేకరణ విషయంలో అధికారులు కచ్చితంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని వ్యర్థాలను వేర్వేరుగా నిల్వ చేసి చెత్త వాహనాలకు ఇస్తే పర్యావరణానికి మేలు చేసినవారవుతారు.

వేరుగా ఇస్తే..తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాహనాలకు ఇస్తే పునర్వినియోగానికి అవకాశముంటుంది. తడి చెత్తతో కంపోస్టు ఎరువు తయారు చేసి మొక్కలకు వినియోగిస్తుంటారు. పొడి చెత్త తుక్కు దుకాణాలకు విక్రయిస్తుంటారు.

తడి చెత్త ఇది..
కూరగాయలు, పండ్ల తొక్కలు
మిగిలిపోయిన ఆహారం
కుళ్లిన పండ్లు, కూరగాయలు
గుడ్డు పెంకులు



చికెన్, మటన్, చేప ఎముకలు
టీ చేసిన తర్వాత మిగిలిన పొడి
పూజ పువ్వులు, దండలు
పడిపోయిన ఆకులు, కొమ్మలు, పువ్వులు
కలుపు మొక్కలు

పొడి చెత్త
ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, పెట్టెలు, కప్పులు, ప్లేట్లు
రేపర్లు, పాలు, పెరుగు ప్యాకెట్లు
వార్తా పత్రికలు, పుస్తకాలు
కార్డ్‌బోర్డు, పిజ్జా బాక్సులు
టెట్రా ప్యాక్స్, పేపర్ ప్లేట్లు, కప్పులు
పగలని గాజు సీసాలు
బల్బులు, ట్యూబ్‌లైట్లు, డబ్బాలు, కంటెయినర్లు
శానిటరీ వేస్ట్, వ్యర్థాలు, డైపర్లు, మందులు, బ్లేడ్లు, వాడిన సిరంజీలు, ఖాళీ ఇంజెక్షన్లు వంటివి పారిశుద్ధ్య కార్మికులకు వేరుగా అందించాలి.

# పర్రెకాల్వలో.. నెర్రెలు..!

మోత్కూరు : మోత్కూరు మండలంలోని పర్రెకాల్వకు మరమ్మతులు చేస్తే 650 ఎకరాలకు పైగా సాగునీరందిస్తుంది. 1962లో అప్పటి చిన్ననీటి వనరులశాఖ మంత్రిగా స్థానికుడైన ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి దీన్ని తవ్వించారు. కొండగడప గ్రామశివారులోని బిక్కేరు నుంచి పర్రెకాల్వకు నీరందించి, సదర్‌షాపురం, బొడ్డుగూడెం మీదుగా అడ్డగూడూరు చెరువు నింపాలన్నది ఈ కాల్వ లక్ష్యం. అడ్డగూడూరు చెరువుకింద ఉన్న 400 ఎకరాలకు నీరందిస్తూ, సదర్‌షాపురం, బొడ్డుగూడెం గ్రామాల పరిధిలో మరో 250 ఎకరాలకు పైగా నీరందించేందుకు కాల్వను నిర్మించారు. సాంకేతిక కారణాల వల్ల కాల్వ పనులు పూర్తయినప్పటి నుంచి నేటివరకు ఒక్కసారి కూడా చివర దాక నీరు పారని పరిస్థితి. ప్రస్తుతం కాల్వ చెట్లు, పూడికతో నిండిపోయింది.

కాలువ ద్వారా సాగునీరందించాలని 2011లో 'ఈనాడు' వార్తాకథనాలతో అప్పటి స్థానిక ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి కాల్వను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించేందుకు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించి 75 శాతం పనులు పూర్తిచేయించారు. కాల్వతో భూమి కోల్పోతున్న రైతులు నష్టపరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు నిలిచిపోయాయి. నాటినుంచి నేటివరకు దీన్ని పట్టించుకున్న నాథుడే లేడని ఆయకట్టు రైతులు విమర్శిస్తున్నారు. పర్రెకాల్వ ద్వారా సదర్‌షాపురం, బొడ్డుగూడెం రైతులకు నీరందిస్తూ, అడ్డగూడూరు చెరువును నింపేందుకు కాల్వలో విపరీతంగా పెరిగిన చెట్లను తొలగించి, మరమ్మతులు చేయాలి.



కొన్నిచోట్ల కొత్తగా నిర్మించాలి. కాల్వలో వాననీటితో పడ్డ కయ్యలను సరిచేసి, సిమెంట్ గోడలు నిర్మించాలి. భూమి కోల్పోతున్న వారికి పరిహారం అందించాలి.

**రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు నివేదించాం..**
ఎం.సత్యనారాయణగౌడ్ (డీఈఈ, నీటిపారుదలశాఖ)
కొండగడప నుంచి అడ్డగూడూరు చెరువులోకి ఉన్న పర్రెకాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ. 1.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

**నిధులు మంజూరుకు కృషి చేస్తా..**
మందుల సామేల్ (ఎమ్మెల్యే, తుంగతుర్తి)
పర్రెకాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తా. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశా. త్వరలోనే నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తా.

# ప్రభుత్వ నిర్ణయం.. వస్త్ర పరిశ్రమకు ఊతం




సిరిసిల్ల: మరమగ్గాల వస్త్రోత్పత్తి పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు ప్రారంభించింది. కుటీర పరిశ్రమకు విద్యుత్తు లోడు సామర్థ్యం 10 నుంచి 25 హెచ్‌పీలకు 50శాతం రాయితీని ప్రకటించింది. ఈ రాయితీతో ఉమ్మడి జిల్లాలో సుమారు 28 వేల నేత కుటుంబాలకు లబ్ధి చేకూరుతుంది. వీటిపై నాలుగు వేల మంది ఆసాములు, పదివేల మంది కార్మికులతోపాటు ఇతర అనుబంధ రంగాల వారు పనిచేస్తున్నారు. వస్త్ర పరిశ్రమలోని అధునాతన యంత్రాలు వాడుకునే నేతన్నలకు దీనివల్ల కరెంటు ఛార్జీల భారం తగ్గుతుంది. ఫలితంగా వారి వస్త్రోత్పత్తుల సామర్థ్యం పెంచుకునేందుకు దోహదపడుతుంది. ఎస్‌ఎస్‌ఐ యూనిట్లు, టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు రాయితీ వర్తించదు. లోడు సామర్థ్యం పెంపుపై నేతన్నల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**క్షేత్ర స్థాయిలో సర్వే**
రాష్ట్రవ్యాప్తంగా 2018-19లో చేనేత, మరమగ్గాలపై సర్వే చేసి, ప్రతి మరమగ్గాన్ని జియోట్యాగ్ చేశారు. కుటీర పరిశ్రమలు, ఎస్‌ఎస్‌ఐ యూనిట్లు వేర్వేరుగా నమోదు చేశారు. రాయితీ పెంచడంతో ఒక్కో కారా?నాలో సగటున 40 సాధారణ మగ్గాల వరకు రాయితీ పొందడానికి అవకాశముంటుంది.

**నెరవేరిన హామీ**
ప్రభుత్వం విద్యుత్తు రాయితీ ఇవ్వడంతో కార్మికులు రాత్రింబవళ్లు పని చేసుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఇప్పుడు నెరవేర్చడంతో నేతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సిరిసిల్లలో 3,573 విద్యుత్తు సర్వీసులకు 25 యూనిట్ల రాయితీ వర్తిస్తుందని సెస్ అధికారులు పేర్కొన్నారు. బోయినపల్లి, కోనరావుపేట, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, గర్శకుర్తితోపాటు పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, ఎలిగేడు, జగిత్యాల జిల్లాలోనూ ఇళ్లలో మగ్గాలు పెట్టుకుని వస్త్రాలు నేస్తున్నారు.

రాయితీ విడుదలలో జాప్యం
ఉమ్మడి జిల్లాలో కుటీరపరిశ్రమగా గుర్తింపు పొందిన మరమగ్గాలకు 2014 నుంచి ప్రభుత్వం రాయితీ బకాయిలు విడుదల చేయడం లేదు. సిరిసిల్లలో సెస్‌కు రూ.54.09 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అదికాకుండా 127 ఎస్‌ఎస్‌ఐ యూనిట్లు కేటగిరీ మార్పు చేశారు. ఇందులో 744 సర్వీసులకు సంబంధించిన రూ.32 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు ప్రభుత్వం బిల్లులపై 50 శాతం రీయింబర్స్‌మెంటు రూపంలో చెల్లిస్తుంది. డిసెంబరు 2020 వరకు ప్రభుత్వం విద్యుత్తు రియంబర్స్‌మెంటు విడుదల చేసింది. జనవరి 2021 నుంచి విడుదల చేయాలని టెక్స్‌టైల్ పార్కులోని వస్త్రోత్పత్తిదారులు ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు.

# పంట కాల్వలు కనుమరుగు



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి గ్రామాల్లో కలిపి 494 ఎకరాల ఆయకట్టు ఉంటుంది. రాచర్ల గొల్లపల్లి వద్ద ఆయకట్టు భూములకు సాగునీటిని అందించే కాల్వ ఇది.. సుమారు 15 సంవత్సరాల క్రితం భారీ వెడల్పు, లోతుతో ఉండే ఈ కాల్వలో యువకులు ఈత కొట్టేవారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఇళ్లు, ఇతర నిర్మాణాలను చేపడుతుండటంతో అక్కడి భూముల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కాల్వ క్రమంగా కబ్జాకు గురవుతోంది. కాల్వ సన్నగా మారి సాగునీరు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

**నిర్వహణ లేక...**
వ్యవసాయానికి జీవనాధారం సాగునీటి వనరులే. ఇవి జలకళను సంతరించుకుంటేనే భూగర్భజల మట్టాలు వృద్ధిచెంది ఏడాది పొడవునా పంట పొలాలకు నీరందుతుంది. ఎగువ ప్రాంతంలోని వరదనీటిని చెరువులు, కుంటల్లోకి చేర్చే పిల్ల కాల్వలు, నీటి వనరుల కింద భూములకు నీటిని అందించే పంట కాల్వలు నిరాదరణకు గురవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్రమంగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటోంది.

**పిల్ల కాల్వలు మాయం**
సుమారు 4,72,329 ఎకరాల భౌగోళిక విస్తీర్ణం కలిగిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో దాదాపుగా 2,90,380 ఎకరాలు సాగుకు యోగ్యమయ్యే భూములు ఉన్నాయి. బోర్లు, బావులే సాగుకు ప్రధాన జీవనాధారం. చెరువులు, కుంటల కింద సుమారు 15,175 హెక్టార్లు, బోర్లు, బావుల కింద దాదాపు 35,212 హెక్టార్లు, మరో 45,400 హెక్టార్లు వర్షాధారంపై సాగవుతాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 650కి పైగా చెరువులున్నాయి. దాదాపు 12వేల కిలో మీటర్ల పొడవునా పెద్ద కాలువలు విస్తరించి ఉండగా పిల్ల కాల్వలు అంతకు రెట్టింపుగానే ఉంటాయి.

కాల్వలను పునరుద్ధరించాలి
జిల్లాలో ఒకప్పటి పంట కాల్వలు కబ్జాకు గురై, మాయమవుతున్నాయి. గ్రామ పొలిమేరల్లో భూముల్లో కాల్వలను సైతం కలుపేసుకొని, ప్లాట్లుగా మార్చేస్తున్నారు. కాల్వలు లేక వ్యవసాయ పొలాలకు సాగునీరు అందని దుస్థితి నెలకొంది. ఏయే ప్రాంతాల్లో ఎంత పరిమాణంలో కాల్వలు ఉన్నాయో అధికారులు గుర్తించాలి. తిరిగి వాటిని పునరుద్ధరించాలి.
ప్రభాకర్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్

రైతులే పూడ్చుకుంటున్నారు
చెరువులు, కుంటల నుంచి వచ్చే సాగునీటితో వ్యవసాయం చేసేవారు. ఇప్పుడు బోరుబావులతో పంటలను సాగుచేస్తున్నారు. చెరువులు, కుంటల్లో నీరుంటే చాలంటూ అప్పట్లో ఉన్న పంట కాల్వలను కొందరు రైతులే పూడ్చివేసుకుంటున్నారు. అమరేందర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఈఈ

# మరోసారి వడపోత

సూర్యాపేట : జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేసే పథకానికి ఇటీవల అడుగులు పడ్డాయి. జనవరి 26న మండలానికి ఒకటి చొప్పున పైలట్ ప్రాజెక్టు కింద 23 గ్రామాలను ఎంపిక చేసి 4,292 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి సంబంధించి ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కోడ్ ముగిసి రోజులు గడుస్తున్నా నేటికీ ఇంటి నిర్మాణానికి సంబంధించి నిధులు మంజూరు కాకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఇదిలా ఉండగా మిగతా గ్రామాల్లో దరఖాస్తులు అధికంగా ఉండటంతో తిరిగి అర్హుల గుర్తింపునకు పునఃపరిశీలన చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సర్వే ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో, 486 గ్రామ పంచాయతీల్లో మొత్తం 3,03,525 మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా అందులో పలు విభాగాలను గుర్తించారు. ఇల్లు లేని, స్థలం ఉన్న వారిని ఎల్-1 కింద, ఇల్లు, స్థలం లేని వారిని ఎల్-2 కింద, రేకుల ఇల్లు ఉండి, ట్రాక్టర్, ఇతర రుణాలు తీసుకున్న వారిని ఎల్-3 కింద విభజించారు. అందులో తొలుత ఎల్-1 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటికి అర్హులుగా గుర్తించారు. కాగా జిల్లాలో నియోజకవర్గానికి 3,500 చొప్పున మందికి కేటాయిస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కాగా ఎల్-1 విభాగంలో అధికంగా



ఉండటంతో తిరిగి పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. పరిశీలన అనంతరం నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. నివేదిక ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించనున్నారు. కాగా ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన లబ్ధిదారులు పునాదులు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అందుకు నేటికీ ఎలాంటి ప్రకటన రాకపోవడంతో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు..- ధర్మారెడ్డి, హౌజింగ్ ప్లానింగ్, ఈఈ, సూర్యాపేట నిబంధనల మేరకు అర్హులను గుర్తించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పునఃపరిశీలన చేపడుతున్నాం. ఈ ప్రక్రియ ముగియగానే ప్రభుత్వానికి నివేదిస్తాం. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన వారికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

# మత్తు.. వదిలేదేలా!

మేడిపల్లి: గంజాయి సరఫరాపై పోలీసులు నిఘా పెంచుతున్నా విక్రయాలు ఆగడం లేదు. బాలుర నుంచి యువకుల వరకు బానిసలుగా మారుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు పొరుగు జిల్లాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి గంజాయి సరఫరా అవుతోంది. సరఫరాదారులు, విక్రేతలు, తాగిన వారిపై కూడా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అయినా రోజురోజుకూ కేసులు పెరుగుతున్నాయి.

**బాలలపై ప్రభావం**
ముక్కుపచ్చలారని బాలలపై గంజాయి ప్రభావం చూపుతోంది. చాలా పాఠశాలలు, కళాశాలల సమీపాల్లో గంజాయి అమ్మకాలు జరుపుతుండటంతో బానిసలవుతున్నారు. జగిత్యాల జిల్లా నుంచి గంజాయి విక్రేతల కోసం నిజామాబాద్‌కు వెళ్లిన పోలీసులకు బాలురు గంజాయి అమ్ముతుండటం విస్మయం కలిగించింది. చాలా మంది బాలురు గంజాయికి అలవాటు పడి పలు నేరాలకు కూడా పాల్పడుతున్నారు. జగిత్యాలలో ఓ కేసులో బాలికకు గంజాయి అలవాటు చేసినట్లు తెలిసి అధికారులు హతాశులయ్యారు. చాలా నేరాల్లో బాలలు కేవలం గంజాయి ప్రభావంతోనే పాల్గొన్నట్లు చెబుతుండటం దాని తీవ్రతకు అద్దం పడుతోంది. బాలురతో పాటు యువకులు వాహనాలు అతివేగంగా నడపటం, దాడులు, హత్యాయత్నాలు, నేరాలకు పాల్పడటం లాంటి ఘటనల్లో గంజాయి కూడా ఒక కారణంగా తెలుస్తోంది. జగిత్యాలలో ఓ వివాహ వేడుకలో యువకులు ఇతరులపై



దాడులకు పాల్పడిన ఘటనలో గంజాయి తాగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఉమ్మడి జిల్లాలో పలు ఘటనల్లో గంజాయి ప్రభావం చూపినట్లు నిర్ధారణ కావడంతో పలు వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

**సరఫరా అవుతోందిలా..**
ఆదిలాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా సరిహద్దుల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గంజాయి సరఫరా అవుతోంది.
నిజామాబాద్ జిల్లా నుంచి బస్సులో గంజాయి సరఫరా చేస్తుండగా అనుసరించిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు.
పెద్దపల్లి జిల్లాలో రైలుమార్గాల ద్వారా గంజాయి సరఫరా అవుతుందన్న విషయం తెలిసి పోలీసులు నిఘా పెంచారు.
కరీంనగర్ జిల్లాకు విశాఖపట్నం నుంచి కారులో సరఫరా అవుతున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు గతేడాది నుంచి గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.

**కేసులు ఇలా..**
ఇటీవల మెట్‌పల్లికి చెందిన గోల్కొండ హరీశ్, బొల్లేపల్లి అభిషేక్‌ను మేడిపల్లి శివారులో పోలీసులు అరెస్టు చేశారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తుండగా పోలీసులు నిఘా వేసి పట్టుకున్నారు.
రామగుండం కమిషనరేట్ పరిధిలో ఇటీవల 120 కిలోల గంజాయిని పట్టుకున్నారు. జగిత్యాల గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కండ్లపల్లిలో కులదీప్, పవన్‌కుమార్, రాకేశ్ అనే వ్యక్తులను ఫిబ్రవరిలో అరెస్టు చేసి వారి నుంచి 130 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండు నెలల్లో 50 మందిని గంజాయి కేసుల్లో అరెస్టు చేశారు.

**పటిష్ఠ నిఘా-** రాములు, డీఎస్పీ మెట్‌పల్లి
గంజాయి అమ్మిన వారితో పాటు వినియోగించిన వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లా సరిహద్దుల్లో నిఘా ఉంచాం. ఇటీవల యువకులు, బాలలు గంజాయి బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద సంస్థల వారు గంజాయిపై అవగాహన కల్పించాలి. గంజాయి అమ్మిన వారి వివరాలు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలిపితే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# కరవు తెచ్చిన పట్టుదల.. కన్నీటి నుంచి విడుదల

కరవు కోరలు చాచింది. వర్షాకాలంలోనే భూమి బీడుబారు తోంది. యాసంగికి అయితే తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి. కాలువ ఊళ్లోనుంచే వెళ్తున్నా.. చెరువులు మాత్రం నిండవు. ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు వివిధ హోదాల్లో ఉన్నా వీరి కన్నీటిని తుడవలేకపోయారు. దీంతో రైతాంగం సంఘటితమై సమస్యను పరిష్కరించుకున్నారు.

కనగల్ మండలం చిన్నమాదారం గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరిగూడెం, ఎర్రగూడెం గ్రామాల్లో రెండేళ్ల క్రితం వరకు పంటలు చివర వరకు పండిన దాఖలాలు లేవు. వందల అడుగుల లోతు బోర్లు వేసిన గంగమ్మ జాడ కనిపించేది కాదు. దీంతో పలువురు వ్యవసాయానికి దూరం అయ్యారు. మరికొందరు ఉన్న నీటితో తిప్పలు పడేవారు. దూరప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీటిని తెచ్చి



పంటలను కాపాడుకునే వారు. కాల్వ, ఎత్తిపోతల ద్వారా చెరువులు నింపాలని రైతులు ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా.. వారిగోడు ఎవరికి పట్టలేదు.

దీంతో ఈ సమస్యను తామే పరిష్కరించుకోవాలని సంఘటితంగా కదిలారు. సొంత డబ్బుతో పాటు దాతల సహకారంతో మోటార్లకు తీసుకొచ్చారు. తలాపు నుంచి వెళ్తున్న కాలువకు వాటిని బిగించి ఎత్తిపోతల ద్వారా ఆయా చెరువులు, కుంటలను నింపారు. ఆ నీటిని నేరుగా సాగుకు వినియోగించకుండా భూగర్భ జలాలు పెంచుకున్నారు. రైతుల భగీరథ ప్రయత్నంతో నేడు ఆయా గ్రామాల్లో బావులు, బోర్లలో నీటి లభ్యత పెరిగింది. నాడు బీడు భూములుగా ఉన్న భూములు ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. రెండేళ్ల క్రితం ఎర్రగూడెం చెరువుకు మోటార్లు బిగించగా ఈఏడాది కుమ్మరిగూడెం చెరువును నింపుతున్నారు. ప్రభుత్వాల కోసం ఎదురు చూడకుండా సంఘటితంగా కరవును జయించిన ఈ అన్నదాతల పట్టుదల తోటి రైతులకు స్ఫూర్తిదాయకం.

# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

రూ.10 కోట్లవ్యయం: ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు- కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనటక్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా రెండు కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికి పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ%రి%్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనుతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్డుతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీలైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# వేలుపెట్టి నడిపించినా.. వెలి



హైదరాబాద్: "హలో.. హైదరాబాద్‌లో రోడ్డుపక్కన ఉన్న మృతదేహం వద్ద దొరికిన సంచిలో మీ ఫోన్ నంబరుంది.. మీ నాన్న అనుకుంటా! మృతదేహాన్ని తీసుకెళ్తారా.." మాట పూర్తయ్యేలోపు ఫోన్ కట్. మళ్లీ చేస్తే స్విచ్ఛాఫ్.

"అమ్మా.. గాంధీ ఆసుపత్రి బయట మీ వాళ్లెవరో చనిపోయారు.." అని చెప్పగానే.. "మేం రాలేం.. అంత్యక్రియలు కానిచ్చేయండి.. ఫోన్ పే నంబరు చెబితే డబ్బు పంపుతాం. చితాభస్మం దాయాల్సిన పనిలేదు. వీలైతే ఆ మూసీలోనే కలిపేయండి." అంటూ సమాధానం.

ఆ తల్లికి నలుగురు సంతానం. ఏడుపదుల వయసులో అమ్మను భారంగా భావించారు. బంధువుల ఇంట్లో శుభకార్యమని కాకినాడ నుంచి హైదరాబాద్ తీసుకొచ్చారు. సనత్‌నగర్‌లో వదిలేసి మాయమయ్యారు. స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం పొందుతూ మానసిక వేదనతో కన్నుమూసింది. బిడ్డలకు సమాచారమిస్తే అంత్యక్రియలు మీరే చేసేయండి అంటూ చేతులు దులుపుకొన్నారు.

గ్రేటర్ పరిధిలో ఏటా 500లకు పైగా అనాథ మృతదేహాలను గుర్తిస్తున్నారు. అందులో అధికశాతం వృద్ధులే. పెంచి పెద్ద చేసిన పిల్లలే వారిని భారంగా భావిస్తున్నారు. ఆస్తిపాస్తులు రాయించుకొని నగరంలో వదిలేసి వెళ్లిపోతున్నారు. చనిపోయాక మృతదేహాల వద్ద దొరికిన ఫోన్ నంబర్లను సంప్రదించినా స్పందించకుండా కఠినంగా వ్యవహరిస్తుండటం దయనీయం.

**భారమని.. దూరంగా వదిలేసి**

బంజారాహిల్స్‌లోని దేవాలయం వద్ద కూర్చునే ఒక పెద్దాయన వయసు 68ఏళ్లు. భార్య మరణించాక ఇల్లు తన పేరిట రాయించుకున్న కొడుకు గెంటేయడంతో నగరంలో కూతురి ఇంటికి చేరాడు. అల్లుడి సూటిపోటి మాటలను భరించలేక.. భిక్షాటన చేస్తున్నాడు. రైతుగా గౌరవంగా బతికి ఇప్పుడిలా అభిమానం చంపుకొంటూ చేయిచాస్తున్నానంటూ కన్నీరు పెట్టుకున్నారు. వృద్ధాప్యం, ఆరోగ్య సమస్యలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులతో కన్నవారిని భారంగా భావించే బిడ్డలు వారిని వైద్యపరీక్షలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు చూద్దామని చెప్పి నగరం తీసుకొస్తున్నారు. కొందరు మధ్యలోనే బస్సులు, రైళ్లలో వదిలేసి వెళ్లిపోతున్నారు. మరికొందరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి తప్పుడు వివరాలిస్తున్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులు, బస్సు, రైల్వేస్టేషన్లు, శివారుల్లో రోజూ 10 మంది వృద్ధులను వదిలేసి వెళ్తున్నట్టు పోలీసుల అంచనా.

**ఆ నలుగురు.. మోసేదెవ్వరు**

నగరంలో అనాథలుగా మరణించాక తలకొరివి పెట్టాల్సిన కుమారులను సంప్రదిస్తే వేం అందుబాటులో లేమంటూ సమాధానమిస్తున్నారు. రూ.20 కోట్ల ఆస్తులున్న పెద్దాయన.. కొద్దిరోజుల క్రితం రోడ్డుపక్కన మరణించాడు. మృతుడి జేబులోని ఫోన్ నంబర్‌కు సమాచారం అందిస్తే అంత్యక్రియలు ఖర్చులు పంపుతామంటూ ఫోన్ పెట్టేశాడంటూ ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎంతో గొప్పగా జీవించి.. బంధువులు.. ఆత్మీయుల మధ్య సాగాల్సిన చివరిమజిలీ.. పాడె మోసేందుకు ఆ నలుగురు కూడా లేకుండా ఒంటరిగా బతుకు ముగిస్తున్నారు.

# బెదిరిస్తూ.. బెంబేలెత్తిస్తూ..



తాండూరు : ఖనిజాల ఖిల్లాగా పేరున్న తాండూరులో నాపరాళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలంటే గనుల శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో తమ అధికారాలను వినియోగించి వాహనాలను అడ్డుకోవాలని చూస్తే బెదిరిస్తున్నారు. దాడులకూ తెగిస్తున్నారు. పోలీసులు వెంట ఉంటేనే విధులను నిర్వహించే పరిస్థితి నెలకొంటోంది. లేదంటే అక్రమ రవాణా యథాతథంగా సాగిపోతోంది.

**కర్ణాటక నుంచే ఎక్కువ**

తాండూరు మండలానికి చేరువలో కర్ణాటక రాష్ట్రం మిర్యాణం గ్రామం ఉంది. ఇక్కడ వేల ఎకరాల్లో నాణ్యమైన ముడి నాపరాళ్లు నిక్షిప్తమై ఉన్నాయి. ఇదే నాపరాయిని మిర్యాణ్‌లో ఉన్న చెక్‌పోస్టును తప్పించి తాండూరులోని యూనిట్లకు అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇలా వచ్చిన ముడి నాపరాయిని నునుపుగా మార్చి ఆర్డర్ల మేరకు విక్రయించి లాభ పడుతున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తాండూరుకు చెందిన మరి కొందరితో చేతులు కలిపి వ్యవహారం నడిపిస్తున్నారు. ఇక తాండూరు మండలంలో లీజు పొందిన నాపరాళ్ల గనులు 60 ఉంటే అనుమతులు లేని గనులు పదుల సంఖ్యలో కొనసాగుతున్నాయి. గనుల శాఖ తరచూ తనిఖీలు నిర్వహించి యజమానులను హెచ్చరిస్తున్నా షరామామూలే.

**తెగించిన లారీ డ్రైవర్**

తాజాగా ఈనెల 24న రాత్రి తాండూరు మండలం గౌతాపూరు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సూర్యకాంత్ రెడ్డి 11.30 గంటల సమయంలో మిర్యాణం నుంచి తాండూరు వైపు వస్తున్న నాపరాళ్ల లోడ్ లారీని ఆపి డ్రైవర్‌ను రాయల్టీ పత్రాలను అడిగారు. డ్రైవర్ అతడిని కిందకు తోసేసి వెళ్లడంతో గాయాలకు గురయ్యాడు. విధులకు ఆటంకం కల్గించి గాయపరిచాడని పేర్కొంటూ కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌లో ఏడీ సత్యనారాయణ సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదే రోజు ఎఫ్ఐఆర్ చేశారు. జరిగిన ఘటనపై ఏడీ రాష్ట్ర ఉన్నతాధికారులకు విషయాన్ని చేర వేశారు. మంగళవారం హైదరాబాద్ రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్‌రాజు తాండూరుకు చేరుకుని ఏడీ సత్యనారాయణతో కలిసి సూర్యకాంత్‌రెడ్డిని స్థానిక ఆసుపత్రిలో పరామర్శించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తాండూరు, గౌతాపూర్, బషీరాబాద్ మోమిన్‌పేట తదితర ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో గనులు విస్తరించి ఉన్నాయి.

ఒక్క తాండూరులోనే 100కుపైగా ఎకరాల్లో నాపరాయి గనులున్నాయి. వీటిలో పగలూ, రాత్రి పనులు సాగుతుంటాయి. అక్రమ రవాణా కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ రూ.కోట్లలో రాకుండా పోతోంది.

తవ్వకాలకు అనుమతులు పొందిన గనులు.. 228
అనుమతులు లేనివి.. 130
ఒక్కో గనిలో పనిచేసే కార్మికులు.. 10-20
సుద్ద, లేటరైట్, స్టోన్ మెటల్, నాపరాయి గనులు: 600 ఎకరాలు
నిత్యం అక్రమ రవాణా.. 50 లారీలు
డిమాండ్ ఉన్నవి.. సుద్ద, నాపరాయి, ఎర్రరాయి, స్టోన్‌మెటల్.

# వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి



సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో చేపట్టిన బీర్‌పూర్ రోళ్లవాగు ఆధునికీకరణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది. ప్రాజెక్టు పనులు 2017లో ప్రారంభించగా ఇప్పటి వరకు అటవీ అనుమతులు లేకపోవడంతో పూర్తికాలేదు. ఇటీవల రెవెన్యూ శాఖ భూములు అప్పగించగా అటవీ అనుమతులకు జిల్లా అటవీశాఖ అధికారులు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆధునికీకరణతో పర్యావరణం, వన్యప్రాణులు, అటవీ ప్రాంత నష్టం అంచనా తయారీకి ప్రత్యేకంగా అధ్యయనం చేసి నివేదించనున్నారు. ఇటీవల ప్రాజెక్టు ముంపు ప్రాంతాన్ని రాష్ట్ర అటవీ వనరులు, వన్యప్రాణుల సంరక్షణ అధికారి పరిశీలించగా అటవీ అనుమతుల కోసం రాష్ట్ర ఉన్నతాధికారులు రానున్నారు.

అటవీ, సహజ వనరుల నిర్వహణ అధ్యయనాల పరిశోధన విశ్వవిద్యాలయం(సీఈఎఫ్ఎన్ఏఆర్ఎం) అధికారులు, ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని అధ్యయనం చేసి నష్టం అంచనా వేయనున్నారు. ఇందులో మొక్కలు, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణానికి చేపట్టాల్సిన దానిపై అధ్యయనం చేయనున్నారు. ఇందుకు ప్రత్యేకంగా రూ.40 లక్షలతో సర్వే నిర్వహించి ఆధునికీకరణ చేపడుతుండంతో ముంపునకు గురవుతున్న ప్రాంతాన్ని గుర్తించనున్నారు. మూడు రకాలుగా వన్యప్రాణుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, అడవుల సంరక్షణగా విభజించి అటవీ సంపద పెంచేందుకు అవసరమైన నిధులు, చేపట్టాల్సిన చర్యలపై నివేదిక తయారు చేసి పంపించనున్నారు.

**3.67 లక్షల మొక్కల పెంపకం**

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీభూములకు బదులుగా 335 హెక్టార్ల రెవెన్యూ భూములను పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లో అప్పగించడంతో ఆయా భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకుంది. దీని ద్వారా ఆయా భూములతోపాటు పర్యావరణ, వనరుల సంరక్షణ కింద అటవీ శాఖ 3.67 లక్షల మొక్కల పెంపకం చేపట్టనుంది. ఇందులో ముందుగా అటవీ శాఖకు అప్పగించిన రెవెన్యూ భూములలో 80 వేల మొక్కలు నాటనుండగా, మిగతా మొక్కలు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో నాటేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అంతేకాకుండా అరుదుగా ఉండే తౌసీ, నల్లమద్దీ, టేకు భారీ వృక్షాలు ప్రాజెక్టు ముంపు ప్రాంతం నుంచి వేర్లతో సహా తరలించి సారంగాపూర్ మండలంలోని గణేష్‌పల్లె, బీర్‌పూర్ ఘాట్, జగిత్యాల అర్బన్ పార్కు ప్రాంతాల్లో నాటనున్నారు. అటవీ అనుమతులకు నివేదించాం- రవిప్రసాద్, డీఎఫ్‌వో, జగిత్యాల

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న అటవీ భూముల వివరాలు అటవీశాఖకు నివేదించాం. ముంపునకు గురవుతున్న భూములకు బదులుగా అందించిన వాటిలో అటవీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. ఉన్నతాధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# వడ్డీ రాయితీ వచ్చేసింది

పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. సంఘాల ఆర్థిక బలోపేతానికి చేయూతనిస్తూ ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటునందిస్తోంది. బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు తీసుకుని వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 2024 నుంచి జనవరి 2025 వరకు నిధులు విడుదల చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన సంఘాల ఖాతాలలో మంజూరైన నిధులను జమ చేస్తున్నట్లు తెలిపారు. వడ్డీ రాయితీ నిధులు మంజూరు చేయడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే చాలు

మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలు తీసుకుంటారు. వీటిని సద్వినియోగం చేసుకుని వివిధ ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించి వడ్డీతో కలిపి బ్యాంకులకు వాయిదాలను



చెల్లిస్తుంటారు. వాయిదాల చెల్లింపు సక్రమంగా ఉంటే ఏటా వారు కట్టిన వడ్డీని ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. దీనివల్ల మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో రుణాలు అందించినట్లవుతుంది.

జిల్లాలోని 10,805 సంఘాలు వడ్డీ రాయితీకి అర్హత సాధించగా రూ.20.35 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ సంఘాల్లో 1,65,000కుపైగా సభ్యులున్నారు. అర్హులైన వారికి రూ.3 లక్షల నుంచి రూ.10లక్షల దాకా రుణాలిస్తున్నారు. గతంలో చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నా ఇప్పుడు అధికారుల చర్యలతో పారదర్శకత పెరిగింది. లోపాలు తగ్గాయి. ఇదే సమయంలో మహిళల్లో బాధ్యత మరింత పెరిగింది.


సున్నా వడ్డీకే తీసుకుంటున్న రుణాలతో మహిళలు ఆర్థికంగా బాగుపడుతున్నారు. తమకాళ్లపై తాము నిలబడేందుకు అధికారులు శిక్షణ కూడా ఇస్తుండటంతో నేర్చుకుని ఉపాధిలో ఉన్నతంగా ఎదుగుతున్నారు. కేవలం కుట్లు, అల్లికలు, కిరాణా దుకాణాలు, బుట్టల అల్లకం వంటి చిన్న చిన్న వాటికే పరిమితం కావడంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ వంటివి కూడా చేపడుతూ తాజాగా బస్సులను కూడా తీసుకుని నడిపించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు ప్రభుత్వం వీరికి పూర్తి అండగా నిలుస్తోంది.

# చివరి అంకం.. ఆటంకం

హైదరాబాద్: హెచ్ఎండీఏ పరిధిలో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ ద్వారా ఇప్పటివరకు రూ.97 కోట్లు ఫీజుల రూపంలో సమకూరింది. 500 వరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఈ నెల 31తో రాయితీ గడువు ముగియనుంది. సర్వర్‌డౌన్ కావడంతో గురువారం ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. హెచ్ఎండీఏలోని ఏడు జిల్లాల పరిధిలో 3.5 లక్షల మంది దరఖాస్తు చేశారు. నిర్ణీత గడువు నాటికి లేఅవుట్లలో 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయిన వాటిని ప్రస్తుతం ఎల్ఆర్ఎస్ కిందకు తీసుకొచ్చారు.

**అంచనా తలకిందులు**

ఒక్క హెచ్ఎండీఏ పరిధిలో కనీసం రూ.ఐదారు వందల కోట్లు గరిష్ఠంగా రూ.వేయి కోట్ల ఆదాయం సమకూరుతుందని భావించినా వివిధ కారణాలతో లక్ష్యం నెరవేరడం లేదు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ



మొత్తం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నిర్వహిస్తోంది. తరచూ సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫీజు చెల్లించిన తర్వాత చాలామంది దరఖాస్తుదారులకు సంబంధించి ప్లాట్ల సమాచారం ఎర్రర్ కింద చూపుతుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలు తమ దరఖాస్తు ఉందా....తాము చెల్లించిన ఫీజు మొత్తం ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

**స్పందన అంతంతే..**

మార్చి 31లోగా పథకం వినియోగించుకునే వారికి ఎల్ఆర్ఎస్ ఫీజుతోపాటు ఓపెన్ స్పేస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ ప్రకటించినా ఇప్పటివరకు అనుకున్న స్పందన కనిపించలేదు. ఈ నేపథ్యంలో రాయితీ గడువు పెంచుతారా లేదా అనేది చూడాలని హెచ్ఎండీఏ వర్గాలు అంటున్నాయి. గడువు మరికొంత కాలం పెంచే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. కొన్ని లేఅవుట్ల పరిధిలో 200 మీటర్లలోపు చెరువులు, నీటి కుంటలు లేనప్పటికీ ఎల్1 కేటగిరి కింద పెండింగ్‌లో పెట్టారు. సిబ్బంది కొరత, ఇతరత్రా కారణాలతో వీటి పరిశీలనలో జాప్యం జరుగుతోంది. ఒకే సర్వే నంబరు, పక్కపక్కనే ఉన్న ప్లాట్లకు సంబంధించి మార్కెట్ ధర వేర్వేరుగా ఉండటంతో ఫీజులు అధిక మొత్తంలో ఉంటున్నాయి. సాంకేతిక కారణాలతో ఇలా జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

# కాలుష్య ఉద్గారాలు.. ఆ'గాలి'

హైదరాబాద్: కాలుష్య ఉద్గారాల స్థాయి పెరిగే కొద్దీ పీల్చే గాలి ప్రాణాంతకం అవుతుందని సెంటర్ ఫర్ సైన్ అండ్ ఎన్విరాన్‌మెంట్(సీఎస్ఈ) నిపుణులు హెచ్చరించారు. వాహనాల వల్ల పెరుగుతున్న కాలుష్యంతో అనారోగ్య సమస్యలతో పాటు ఆయువుపై ప్రభావం చూపుతుందని వెల్లడించారు. లాన్సెట్ నివేదిక, 'ఎక్స్‌పోజర్ టు వెహికిల్ ఎమిషన్స్ ఇన్‌టేక్ ఫ్రాక్షన్' ఆధారంగా హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, చెన్నై, ముంబయి, దిల్లీ, కోల్‌కతా నగరాల్లో వాహన కాలుష్యం పెరుగుతోందన్నారు. ఫలితంగా పీఎం 2.5 సూక్ష్మ ధూళి కణాల స్థాయి పెరిగి అనారోగ్యంతో పాటు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. లాన్సెట్ నివేదిక ప్రకారం కాలుష్యం కారణంగా సంభవించే మరణాల్లో దిల్లీలో 11.2శాతం, వారణాసి 10.2, కోల్‌కతా 7.3, పుణె 5.9, హైదరాబాద్, ముంబయి, అహ్మదాబాద్ నగరాల్లో 5.6శాతం మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. **నియంత్రణే ప్రధానం..**వాహనాల ఉద్గారాలను నిత్యం తనిఖీ చేసుకొని పీయూసీ సర్టిఫికెట్ తీసుకోవాలని సీఎస్ఈ నిపుణులు వెల్లడించారు. కాలం చెల్లిన వాటిని తుక్కుగా మారుస్తూ, ఇంధన వినియోగాన్ని తగ్గించాలి. రెట్రోఫిట్‌పై (విద్యుత్ బ్యాటరీతో నడిచే వాహనాలుగా మార్చడం) వాహనదారులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం వైపు మళ్లించాలని సూచించారు. **పౌరుల భాగస్వామ్యం ముఖ్యమే**కాలుష్య ఉద్గారాలకు అడ్డుకట్ట వేయాలంటే నియంత్రణే ముఖ్యమని ఇందులో పౌరుల భాగస్వామ్యం అవసరమని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నిపుణులు సూచించారు.

## అనర్హులైన అర్హులకు మరో అవకాశం.. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులపై నిర్ణయం

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి అధ్యయన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,70,859 దరఖాస్తులు అందాయి. వీటిలో చిరునామాలు గుర్తించలేకపోయినవి 10 వేలలోపు ఉంటాయని సమాచారం. ప్రస్తుతం వారు ఎక్కడ ఉంటున్నారో పరిసరాల్లోని వారు సైతం చెప్పలేకపోతున్నారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. 99.99 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. క్షేత్రస్థాయి పరిశీలన తరవాత దరఖాస్తులను మూడు భాగాలుగా విభజించారు. ఇల్లు లేకపోయినా సొంత స్థలం ఉన్న వారిని ఎల్-1గా, ఇల్లు, స్థలం లేని వారు ఎల్-2గా, అర్హులు కాని వారు ఎల్-3గా విభజించారు.



**దరఖాస్తుదారులకు మరో అవకాశం...?**

క్షేత్రస్థాయి పరిశీలనలో అర్హులుగా కొన్ని దరఖాస్తులను అధికారులు గుర్తించారు. సొంత ఇల్లు ఉండటం, ఆదాయపన్ను చెల్లిస్తుండటం తదితర కారణాలతో వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. వారికి మరో అవకాశం ఇవ్వాలని ఉన్నతస్థాయిలో అధికారులు భావిస్తున్నారు. అనర్హులుగా వారిని పక్కన పెడితే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న అభిప్రాయంతో ఆ జాబితాలోని వారికి మరో అవకాశం ఇవ్వాలని అధికారులు ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. మూడు విభాగాలకు చెందిన జాబితాను గృహ నిర్మాణ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ జాబితాలోని వారు అర్హులమని నిర్ధారించేందుకు అనువైన అంశాలతో మరోదఫా దరఖాస్తులను ఆహ్వానించి వాటిని పరిశీలించటంతో ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకున్నట్లు అవుతుందని అధికారుల యోచన. జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచడంతోపాటు చరవాణికి సంక్షిప్త సందేశాలు పంపేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఉన్నతాధికారి ఒకరు వివరించారు.

## ఇంకేదే లేదు.. ఇంకెలా..?

హైదరాబాద్: జీవ జలాలను పరిరక్షించుకునే అవకాశాన్ని నగరవాసులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో హైదరాబాద్ మహానగరంలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా డిసెంబరు నాటికే భూగర్భజలాలు అట్టడుగుకు చేరుకుంటున్న ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో వర్షపునీరు ఇంకే పరిస్థితి లేకపోవడంతో భూగర్భజలాలు వేగంగా అడుగంటుతున్నాయి. 300 చదరపు మీటర్లు మించిన స్థలంలో నిర్మాణాలు చేపడితే ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**నోటీసులు ఇస్తున్నా..**

భూగర్భజలాల సమస్యకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొంటూ వాటిని నిర్మించుకునేందుకు జలమండలి



గతంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తగిన సాంకేతిక సాయం అందించేందుకు ముందుకొచ్చింది. ఇంకుడుగుంతలు నిర్మించని వారికి నోటీసులు జారీ చేసింది. అయినా ఆశించిన ప్రయోజనం దక్కలేదు. 40 వేల క్యాన్ నంబర్ల వినియోగదారులు తరచూ ట్యాంకర్లు బుక్ చేసినట్లు గుర్తించారు. ఎక్కువమంది ఇంకుడు గుంతలు లేని ఇళ్ల నుంచే బుకింగ్ జరుగుతున్నట్లు వెల్లడవుతోంది.

**ట్యాంకర్లకు రెట్టింపు ధర ప్రతిపాదనకు కసరత్తు**

జలమండలి పరిధిలో నిబంధనల మేరకు ఇంకుడుగుంతలు లేని ఇళ్లను గుర్తించి చట్టబద్ధంగా చర్యలకు జలమండలి శ్రీకారం చుడుతోంది. లేని ఇళ్లకు నోటీసులు జారీచేస్తున్నారు. నిబంధనల మేరకు ఇంకుడుగుంతలు లేని ఇళ్ల యజమానులు వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే రెట్టింపు ధర వసూలు చేయాలనే ప్రతిపాదనలపై కసరత్తు చేస్తున్నారు.ఖైరతాబాద్, నాంపల్లి, ముషీరాబాద్, షేక్‌పేట, ఆసిఫ్‌నగర్, చార్మినార్, సికింద్రాబాద్, బాచుపల్లి, దుండిగల్ తదితర ప్రాంతాల్లో సాధారణం కంటే 20 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ 1, 2024 నుంచి జనవరి 31, 2025 వరకు వర్షపాతం వివరాలు (మి.మీ.లలో..)

## నగరంలో స్మార్ట్ పార్కింగ్

హైదరాబాద్: ఇంటి నుంచే.. వెళ్లబోతున్న ప్రాంతంలో మన వాహనానికి పార్కింగ్ వసతిని రిజర్వు చేసుకోవచ్చు. జీహెచ్ఎంసీ నూతన పార్కింగ్ విధానం రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. ఆసక్తిగల సంస్థలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో బూస్ట్(బిల్డ్ ఓన్ ఆపరేట్ షేర్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ప్రాజెక్టును అమలు చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని, సమగ్ర ప్రతిపాదనలు, ప్రణాళిక అందజేస్తే.. ఉత్తమ పద్ధతిన ఎంపిక చేస్తామని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయం తాజాగా టెండరు నోటిఫికేషన్ విడుదల చేసింది.

**రద్దీకి అనుగుణంగా ఛార్జీలు..**గత సర్కారు హయాంలో కూకట్‌పల్లి జోనల్ అధికారులు.. కూకట్‌పల్లి ఫోరంమాల్ వద్దనున్న పైవంతెన కింద 200 ద్విచక్ర వాహనాలకు స్మార్ట్ పార్కింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. తర్వాత.. సికింద్రాబాద్ తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాల భూమిని.. ఆ శాఖ పార్కింగ్ వసతికి ఇచ్చింది. ః ఇప్పుడు కొత్తగా ఖైరతాబాద్ జోన్ ప్రయత్నం చేస్తోంది. జీహెచ్ఎంసీ కేటాయించే ప్రాంతాల్లోనేగాక.. ప్రైవేటు వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. వారి ఇంటి ముందున్న పార్కింగ్ కేంద్రాన్ని, ఆఫీసుల్లోని ఖాళీ స్థలాలను, అపార్ట్‌మెంట్లలోని పార్కింగ్ వసతులను బల్దియాతో కలిసి వాహనదారులకు అద్దెకు ఇచ్చుకోవచ్చు. మొబైల్‌యాప్, వెబ్‌సైట్‌ను ఉపయోగించి ప్రజలు స్మార్ట్ పార్కింగ్ సేవలు పొందవచ్చు. నిర్వాహకులకు రద్దీకి తగ్గట్టుగా ఛార్జీలను వసూలు చేసుకునే అధికారం ఉంటుంది. పార్కింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలు.. వాహనాన్ని, వాహనంలోని డ్రైవరు, నంబరు ప్లేటును కృత్రిమ మేథ సాయంతో గుర్తించేలా ఏర్పాట్లు ఉండాలి.

**మొదలైన సర్వే..**స్మార్ట్ పార్కింగ్‌కు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో సర్వే చేస్తున్నారు. ఏ వీధిలో.. ఎన్ని వాహనాలను పార్కింగ్ చేయొచ్చు, ప్రైవేటు స్థలాలు ఎక్కడున్నాయి,

## ఎల్ఆర్ఎస్‌లో ఎల్-1 కష్టాలు



హైదరాబాద్: మేడ్చల్‌లో గ్రామ పంచాయతీ (జీపీ)లో ప్లాట్ ఉన్న ఓ వ్యక్తి గతంలో రూ.వెయ్యి చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం అవకాశం ఇవ్వడంతో ఫీజు చెల్లించేందుకు సిద్ధమయ్యాడు. ఆన్‌లైన్లో రుసుము చెల్లించడానికి ఎన్నిసార్లు ప్రయత్నించినా.. దరఖాస్తు ఎల్1 అధికారి వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. తాజాగా మార్చి 31లోపు ఈ స్కీం వినియోగించుకున్న వారికి 25 శాతం రాయితీ ప్రకటించడంతో ఇంకోసారి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇది ఆ ఒక్కరి సమస్య కాదు.. హెచ్ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో ఎంతోమంది ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) పథకంతో ప్లాట్లను సక్రమం చేసుకునేందుకు చాలామంది ఆశతో ఉన్నా అధికారులు మోకాలడ్డుతున్నారు. దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కారించడంలో జాప్యం చేస్తున్నారు. ఎవరిని సంప్రదించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. 3.2 లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం 1 శాతం కూడా పరిష్కారానికి నోచుకోలేదు. వీటిని యుద్ధప్రాతిపదికన పరిశీలిస్తే హెచ్ఎండీఏ ద్వారా రూ.వేయి కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. పైనుంచి నుంచి కిందిస్థాయి వరకు సరైన ప్రణాళిక లేదు.

**ఇబ్బందులు ఇలా...**

ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్‌ను సక్రమంగా మార్చుకోవాలంటే తొలుత లెవల్-1లో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలి. చెరువులు, నీటి వనరులు, కాలువలకు 200 మీటర్లలోపు లేఅవుట్ లేదని.. దేవదాయ, అసైన్డ్ ఇతర వివాదస్పద భూముల జాబితాలో లేదని అధికారులు ధ్రువీకరించాలి.

గ్రామ, రెవెన్యూ మ్యాపులు పరిశీలించి లేఅవుట్ చుట్టుపక్కల ఎలాంటి నీటి వనరులు లేవని ధ్రువీకరించిన తర్వాత ఎన్‌వోసీ జారీ చేయాలి.

రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఎన్‌వోసీ వచ్చిన తర్వాత హెచ్ఎండీఏలో పీవో లేదా సీపీవో అనంతరం డైరెక్టర్ పరిశీలించి ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు. దీంతో ఆన్‌లైన్ లేదా నేరుగా రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లిస్తే యజమాని పేరుతో ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేశారు.

చిన్నచిన్న లోపాలను చూపించి కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. పలు జోన్లలో ఈ తంతు యథేచ్ఛగా నడుస్తోందనే మాటలు వినిపిస్తున్నాయి.

ఎల్ 1 అనుమతుల విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను భాగస్వాములను చేశారు. హెచ్ఎండీఏతోపాటు పరిశీలించి పచ్చజెండా ఊపాకే దరఖాస్తులు కదులుతాయి. ఇక్కడే జాప్యం జరుగుతోంది.

క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులకు చుక్కలు చూపిస్తున్నారు. ఒక అధికారి వస్తే... ఇంకొకరు రావడం లేదని అంటున్నారు.మాస్టర్‌ప్లాన్‌లోని తప్పులను చూపించి కొర్రీలు పెడుతున్నారు.

గతంలో ఇలాంటి స్కీం అందుబాటులోకి తెచ్చిన సందర్భంలో సహాయ కేంద్రం, ఫోన్ నంబరు ఇచ్చేవారు. అక్కడ సంప్రదిస్తే సందేహాలను నివృత్తి చేసేవారు.

## పన్ను బూచి.. అధికారులు దోచి



హైదరాబాద్: గ్రేటర్‌లో తెలియకుండానే ఆస్తిపన్ను పెరుగుతోంది. పెరిగిన విలువతో బకాయి చెల్లించాలంటూ యజమానులకు సందేశాలూ వెళ్తున్నాయి. ఏప్రిల్, 2024లోనే పన్ను కడితే బకాయి ఏంటని ఆశ్చర్యపోతున్నారు. కింది స్థాయి సిబ్బందిని ఆశ్రయిస్తే.. పన్ను తగ్గిస్తామంటూ రూ.10వేల నుంచి రూ.50వేలు తీసుకుని ఫోన్ నంబర్లను బ్లాక్ చేస్తున్నారు. మరికొందరు జీహెచ్ఎంసీ చట్టం సెక్షన్ 213 కింద భవనాలకు నోటీసులివ్వడం.. ఆస్తిపన్ను పెరుగుతుందనే భయాందోళనలు సృష్టించి వసూళ్లకు పాల్పడుతున్నారు. అదే సమయంలో.. చట్ట ప్రకారం జారీ అయిన ఇంటి నంబర్లను రద్దు చేస్తూ నిషేధిత కేటగిరీల్లోని వాటికి ఇచ్చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. పలువురు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రైవేటు సిబ్బందిని నియమించుకుని జేబులు నింపుకొంటున్నారు. ఈ నెల 24న కాటేదాన్ పారిశ్రామికవాడలోని ఓ రేకుల షెడ్డుకు నోటీసు ఇచ్చి రూ.45వేలు లంచం తీసుకుంటూ బిల్ కలెక్టరు, అతని సహాయకుడు అనిశాకు పట్టుబడిన విషయం తెలిసిందే.

**ఇవిగో ఉదాహరణలు..**

సైదాబాద్ కుర్మగూడలోని ఏళ్ల నాటి ఇల్లు అది. ఇంటి నంబరు 17-2-427, 428, పీటీఐఎన్ నంబరు 1041705849 కలిగిన ఆ రెండంతస్తుల ఇంటికి గతంలో ఆస్తిపన్ను రూ.3వేలుగా ఉండేది. యజమానికి నోటీసు ఇవ్వకుండా అక్టోబరు 15, 2024న ఆస్తి పన్నును సవరించింది. దానికి ముందే యజమాని పూర్తిగా చెల్లించారు. పన్ను సవరణ జరిగాక.. ఉన్నట్టుండి బకాయి చెల్లించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి సందేశం వెళ్లడంతో కంగుతిన్నారు. వెబ్‌సైట్‌లో చూసుకోగా.. పన్ను విలువ నాలుగు రెట్లకుపైగా పెరిగింది. స్థానిక బల్దియా సిబ్బందిని సంప్రదిస్తే.. రూ.10వేలు తీసుకుని ఉడాయించారని, ఇప్పుడు ఫోన్‌లోనూ స్పందించడం లేదని బాధితులు 'ఈనాడు'తో వాపోయారు. కూకట్‌పల్లి శంశిగూడ గ్రామం పరిధిలో 180 గజాల్లో నిర్మాణం చేసుకున్న ఇంటికి ఆస్తిపన్ను మదింపు చేయాలని యజమాని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆశ్రయించగా.. నోటరీ స్థలానికి ఇంటి నంబరు రాదని, అలా ఇవ్వాలంటే రూ.3లక్షలు ఖర్చవుతుందని సిబ్బంది బేరం కుదుర్చుకున్నారు.

గ్రేటర్‌లో ఆస్తిపన్ను పరిధిలోని నిర్మాణాలు 23 లక్షలు
ఇటీవల పన్ను సవరణ జరిగిన భవనాలు 800
సవరణతో పెరిగిన ఆస్తిపన్ను విలువ రూ.2 కోట్లు
సవరణ పురోగతిలో ఉన్న భవనాలు సుమారు 50 వేలు

## ఎన్‌డీఎస్ఎల్ పునః ప్రారంభంపై ప్రతిష్టంభన!



మల్లాపూర్ : రాష్ట్రంలోని ఎన్‌డీఎస్ఎల్ (నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్) పరిశ్రమల పునః ప్రారంభంపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఐటీ పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరుద్ధరణ కమిటీ గతేడాది నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేట వద్దనున్న పరిశ్రమలను సందర్శించి పలు సూచనలు చేసింది. ఈ క్రమంలో రాష్ట్రంలోని మూడు పరిశ్రమల స్థితిగతులపై అంచనాలను రూపొందించేందుకు పరిశ్రమల పెట్టుబడులు, నిర్వహణపై పట్టున్న ఫార్చ్యూన్ సంస్థను డిసెంబరు-2024లో సంప్రదించింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ ప్రతినిధులు ముత్యంపేట, బోధన్, ముంబోజిపల్లి (మెదక్) జిల్లాల్లో పర్యటించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. సంస్థ నివేదిక ఆధారంగానే ప్రభుత్వం పరిశ్రమల పునః ప్రారంభంపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

**స్థితిగతులపై అధ్యయనం**

రాష్ట్రంలో మూసివేసిన ఎన్‌డీఎస్ఎల్ పరిశ్రమలను పునః ప్రారంభించేందుకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. మూడు యూనిట్లలో పరిశ్రమలను తెరిపిస్తే ఎంత ఖర్చవుతుంది? పాత యంత్రాలకు మరమ్మతులు జరిపి పునరుద్ధరించడమా? కొత్త యంత్రాలను అమర్చితే వచ్చే ఖర్చు ఎంత? ఆయా ప్లాంట్లలో 10వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయడంతోపాటు డిస్టిలరీ (అల్కహాల్ తయారీ) యూనిట్లను ఏర్పాటు చేస్తే ఎంత ఖర్చు వస్తుంది? భవిష్యత్తులో వీటి ఉపయోగాలు తదితర వాటిని ప్రభుత్వానికి ఫార్చ్యూన్ సంస్థ ప్రతినిధులు కూలంకుషంగా నివేదించనున్నట్లు సమాచారం.

**మరమ్మతుకు రూ.150 కోట్లు?**

మూడు యూనిట్ల పరిధిలో పాత యంత్రాలకు మరమ్మతులు చేస్తే దాదాపు రూ.150 కోట్ల మేర ఖర్చవుతుందని కమిటీ అంచనాకు వచ్చినట్లు సమాచారం. పాత యంత్రాలకు మరమ్మతులు జరిపి క్రషింగ్‌ను నడిపిస్తే రికవరీ శాతం సరాసరి 9 శాతానికి మించకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతోపాటు క్రషింగ్‌లో అంతరాయాలు కలిగితే మరింత నష్టం వాటిల్లే అవకాశాలు ఉండటంతో భవిష్యత్తులో ఉపయోగపడేలా కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు డిస్టిల్లరీ, విద్యుత్తు ప్లాంట్లను నెలకొల్పితేనే ప్రయోజనం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

**సాగు పెరిగితేనే..**

ముత్యంపేట పరిశ్రమ పరిధిలో ప్రస్తుతం 2024-25 సీజన్‌కు లక్ష టన్నుల మేర చెరకును రైతులు సాగు చేశారు. 2025-26 సీజన్‌కు మూడు లక్షల టన్నుల మేర చెరకు పంటను రైతులు పండిస్తేనే క్రషింగ్ సాధ్యపడుతుంది. పరిశ్రమలో వచ్చే ఏడాది క్రషింగ్ నిర్వహించాలంటే రైతులతో ఒప్పందం చేసుకోవడంతోపాటు మూడు లక్షల టన్నుల సరిపడా చెరకును సాగు చేసేలా రైతులను సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. ఎన్‌డీఎస్ఎల్ యాజమాన్యం బ్యాంకుల నుంచి గతంలో తీసుకున్న రుణాలు రూ.210 కోట్లు ఉండగా, వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.192 కోట్లను చెల్లించింది. ఫార్చ్యూన్ సంస్థ నివేదిక వస్తే గానీ ప్రభుత్వమే నడిపిస్తుందా? ప్రైవేటుకు అప్పగిస్తుందా? అనేది తేలే అవకాశం ఉంది.

## కళ.. కలేనా..?

నారాయణగూడ: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ పదేళ్ల క్రితం వరకు చిన్నారులతో కళకళలాడింది. ప్రస్తుతం చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. పిల్లలు వేసవి సెలవులను బాలభవన్‌లో ఆస్వాదిస్తారు. 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీన్ని ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేసవి శిబిరాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారు. బాలభవన్ తరపున 'బాలశ్రీ, బాలసూర్య, బాలరత్న' పురస్కారాలు అందించేవారు. ప్రస్తుతం అవి లేవు. ప్రతినెలా బీసీ, ఓసీ పిల్లలకు నామమాత్రపు రుసుము రూ.50, ఎస్సీ, ఎస్టీ పిల్లలకు రూ.20 ఉండేది. ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలను బాలభవన్‌కు బస్సులో తీసుకొచ్చేవారు. ఇప్పుడా బస్సు నిరుపయోగంగా మారింది.



పోస్టులన్నీ ఖాళీ..బాలభవన్‌లో లైబ్రేరియన్, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్రం, తబలా గురువులు మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సంగీతం, తబలా, మృదంగం, కథక్, కూచిపూడి, జానపదం, నాటకం, కరాటే, స్కేటింగ్ గురువులు కావాలి. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ఇక్కడికి పంపించారు. ఒకే పోస్టులో ముగ్గురు సైన్స్ టీచర్లున్నారు. ఒక ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి బాధ్యతల్ని అప్పగించడంపై విమర్శలున్నాయి. మరో ఎస్జీటీ టీచర్‌ను లైబ్రేరియన్‌గా పంపించారు. పదేళ్లుగా ఇన్‌ఛార్జి డైరెక్టర్.. ఇంతకుముందు బాలభవన్‌కు ప్రత్యేకంగా డైరెక్టర్ ఉండేవారు. పదేళ్లుగా అదనపు బాధ్యతలతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

## గోదావరి జలాల విడుదల

అశ్వాపురం : భీమునిగుండం కొత్తూరు సీతారామ ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఫేజ్-2 పంప్‌హౌస్ వైపు నీళ్లు పయనిస్తున్నాయి. ములుగు జిల్లా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి విడుదల చేసిన 1,200 కూసెక్కుల గోదావరి జలాలు దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకొని పొంగిపొర్లుతున్నాయి. బెల్‌మౌత్ వద్ద గోదావరికి, సీతారామ ప్రధాన కాల్వకు మధ్యనున్న మట్టి కట్ట తొలగింపు పనులు పూర్తయ్యాయి. గోదావరి జలాలు సీతారామ ప్రధాన కాల్వలోకి ప్రవేశించాయి. అమెర్ధా వద్ద సీతారామ హెడ్ రెగ్యులేటర్ ద్వారాలను అధికారులు తెరిచారు. గోదావరి జలాలు



భీమునిగుండం కొత్తూరు ఫేజ్-1 పంప్‌హౌస్‌కు చేరుకున్నాయి. పంప్‌హౌస్‌లోని ఏ-3 విద్యుత్తు మోటారును ఆన్ చేసి డెలివరీ సిస్టర్న్ ద్వారా సీతారామ రెండో ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్నాయి. అక్కడి నుంచి పూసుగూడెంలోని ఫేజ్-2 పంప్‌హౌస్, కమలాపురంలోని సీతారామ ఫేజ్-3 పంప్‌హౌస్‌కు చేరుకుంటాయి. జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆనకట్ట పైనుంచి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండటంతో సీతారామ ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తున్నామని తెలిపారు.

## విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.

సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహమూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.

# శ్రీకాళహస్తికి పరిశ్రమల హారం

శ్రీకాళహస్తి : కూటమి పాలనలో శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిశ్రమల హారంగా మారనుంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళికలు రూపొందించాలని సమీక్షిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

గతంలో తెదేపా ప్రభుత్వంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం-1, 2గా ఏర్పేడు- వెంకటగిరి ప్రధాన రహదారిపై ఈఎంసీ-3గా కేటాయించి ఏపీఐఐసీకి పెద్దఎత్తున భూములు కేటాయించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చలు జరిపి పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ



నేపథ్యంలో ఈఎంసీ-1,2లో 830.5 ఎకరాల ఏపీఐఐసీకి భూములు కేటాయించగా.. 330 ఎకరాల్లో రూ.వేల కోట్లు పెట్టుబడులతో డిక్సన్, సిలికాన్, కార్బన్, టీసీఎల్ వంటి 56 భారీ పరిశ్రమలను ఏర్పాటుకు పందగలా భూమి చేశారు. అప్పటికే 30కిపైగా పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించడం గమనార్హం.

**పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు**

ఈఎంసీ-1, 2, 3లో వెయ్యి ఎకరాలకు పైగా ఏపీఐఐసీకి కేటాయించిన భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి నూతన పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై ప్రత్యేక దృష్టిసారిస్తూ అధికారులతో చర్చలు జరపడంతో రానున్న రోజుల్లో కదలికలు ఏర్పడనున్నాయి.

**తెదేపా హయాంలో శ్రీకారం**

తిరుపతి ప్రాంతం అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు సమీపంలో ఉండటంతో 2014లో పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తెదేపా శ్రీకారం చుట్టింది. అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ఆదర్శవంతమైన ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు సంకల్పించారు. తర్వాత ప్రభుత్వం తరఫున అభివృద్ధి కుంటుపడింది.

**వైకాపాలో వెనుదిరిగినవెన్నో**

వైకాపా ఐదేళ్ల పాలనలో నూతన పరిశ్రమలు ఏర్పాటుకాకపోగా జియో, విన్‌టెక్, ఎయిల్‌డిక్సన్, ఫాక్స్‌లింక్ వంటి కొన్ని ప్లాంట్లు వెనుదిరిగాయి. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు సమీపంలో అపాచీ పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. దీంతో ఏపీఐఐసీకి కేటాయించిన భూములు బీడు భూములుగానే దర్శనమిస్తున్నాయి.

# బె'ధర'గొడుతున్నారు

చిత్తూరు : వ్యవసాయ శాఖలో అన్నదాతకు వ్యక్తిగత యంత్ర పరికరాలు అందించే యాంత్రీకరణ పథకం ఐదేళ్ల తరవాత అమల్లోకి వచ్చింది. కొన్ని పరికరాలపై 50శాతం.. మరికొన్నింటికి నిర్దేశిత మొత్తాన్ని రాయితీగా నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే వీటి ధరలు ఎక్కువగా నిర్ణయించడం గమనార్హం. తైవాన్ స్ప్రేయర్‌నే పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ ప్రైవేటు కన్నా రూ.4,132 అధికంగా నిర్ణయించింది. ఇదే స్ప్రేయరుకు ఉద్యానశాఖ రూ.10 వేలు రాయితీ ఇస్తుండగా రైతులు రూ.23 వేలకే కొనుగోలు చేసి బిల్లులు సమర్పిస్తున్నారు.

**తగ్గిపోతున్న సాయం..**

వ్యవసాయ శాఖ సీలింగ్ నిర్ణయించడం వల్ల అన్ని పరికరాలపై 50 శాతం రాయితీ అందడం లేదు. పైగా కొన్నింటి ధరలను అధికంగా



పేర్కొనడంతో రైతుకు వాస్తవంగా దక్కే ఆర్థిక ప్రయోజనం 25 నుంచి 30 శాతమే ఉంటోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన మేరకు అన్నదాతకు లబ్ధి చేకూరడం లేదు. ఉద్యానశాఖలో అమలవుతున్న యాంత్రీకరణ పథకం వారికి మేలు చేసేలా ఉంది. ఎందుకంటే రైతులే స్వయంగా బేరమాడి కొనుగోలు చేసి బిల్లులు పెడుతుంటే అధికారులు రాయితీ జమ చేస్తున్నారు. సాధారణంగా ఒక్క పరికరాన్నే కొనుగోలు చేసే రైతు బాగా బేరమాడితే వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. అలాంటిది రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో పరికరాలు కొనుగోలు చేసినప్పుడు ధర ఇంకా తగ్గాల్సి ఉంది. అయితే పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

**పెరిగింది ఇందుకేనంటా..**

నోడల్ ఏజెన్సీగా ఉన్న ఆగ్రోస్‌కు 2శాతం కమీషన్, జీఎస్టీ కారణంగా ధరలు పెరిగాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. యాంత్రీకరణ పథకం కింద రైతులు యంత్రాలు సరఫరా చేసిన కంపెనీలకు రాయితీ సొమ్ము జమ చేసేందుకు 3-4 నెలలు సమయం పడుతుండటంతో ఆయా కంపెనీల ధరలు ఐదు నుంచి 10 శాతం అధికంగా ఉన్నాయని మరికొందరు అధికారులు పేర్కొంటున్నారు.

**అంతంత మాత్రంగానే దరఖాస్తులు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యంత్రీకరణ పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు ప్రభుత్వం ఈ నెల మూడో తేదీన ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలకు లక్ష్యాలను కేటాయించి జిల్లా వ్యవసాయాధికారులకు పంపింది. 24 రోజులు గడిచినా ఉమ్మడి జిల్లాలో కేవలం 1,208 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇక మూడు రోజులే గడువు ఉందని ఈలోగా రైతులు దరఖాస్తు చేసుకుని నాన్ సబ్సిడీ చెల్లించిన వారికి ఆగ్రోస్ ద్వారా యాంత్రీకరణ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తామని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆగ్రోస్ జిల్లా మేనేజరు శశిచంద్రమౌళిరెడ్డి తెలిపారు.

# మిగిలిందా.. మింగేస్తారు!!



విశాఖపట్నం : మధురవాడ పరిధిలోని లే-అవుట్లు, కాలనీల్లో మిగులు భూములను మింగేస్తున్నారు. సామాజిక అవసరాల కోసం రికార్డుల్లో 'ఓపెన్ స్పేస్' స్థలాలుగా ఉన్నా...నకిలీ పత్రాలు సృష్టించి భూబకాసురులు కబ్జా పర్వం సాగిస్తున్నారు. రెవెన్యూ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మిథిలాపురి వుడా కాలనీ, సాగర్ నగర్ శాంతినికేతన్ లే-అవుట్ పరిధిలో రూ.కోట్ల విలువైన భూములు దర్జాగా ఆక్రమించేశారు.

**వైకాపా నాయకుల గుప్పిట్లో..**

రెవెన్యూ కాలనీలో సర్వే నెంబరు 292లో గెడ్డ పక్కన లే-అవుట్లో సుమారు 300 గజాల మిగులు భూమి ఉంది. లేఅవుట్ మ్యాప్‌లోనూ అలానే చూపిస్తోంది. అయితే 'వుడా' నుంచి కొనుగోలు చేసినట్లు కొందరు వైకాపా నాయకులు పత్రాలు సృష్టించారన్న ఆరోపణలున్నాయి. దీని విలువ రూ.3 కోట్లు పైమాటే. ఇదే సర్వే నెంబరులో గెడ్డకు చేరువగా రూ.1.50కోట్ల విలువైన 200 గజాల మిగులు స్థలంలో స్థానికంగా ఉన్న ఓ వైకాపా నాయకుడు రేకుల షెడ్లు నిర్మిస్తే తొలగించారేకానీ, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు.

**జీవీఎంసీ అధికారుల ఉదాసీనత..**

ఎన్జీఓస్ కాలనీ ఫేజ్-2 సర్వే నెంబరు 175లో గెడ్డకు ఇరువైపులా పార్కు నిర్మాణం కోసం ఖాళీ స్థలం వదలిపెట్టారు. వైకాపా నాయకుల అండదండలతో పక్కనే ఉన్న ఓ జిరాయితీ స్థల యజమాని దాదాపు రూ.1.5 కోట్ల విలువైన 250 గజాల స్థలం ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కళ్లముందే ఆక్రమణలు గుర్తించినా చర్యలు తీసుకోలేదు. ఇదే కాలనీలో మరోచోట ఎంవీవీ ఓజోన్ అపార్టుమెంట్ వెనుక రూ.3.5 కోట్లు విలువ చేసే సుమారు 500 గజాలకు పైగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఇక్కడ నిర్మించిన భవనం, రేకుల షెడ్డుకు జీవీఎంసీ పన్నులు వేయడం, విద్యుత్తు సదుపాయం కల్పించడం గమనార్హం. ఈ లేఅవుట్లో మిగులు స్థలాల కబ్జాపై నెల రోజుల క్రితం రెవెన్యూ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు సమాచారమిచ్చినా స్పందించలేదు. ఈ వ్యవహారం వెనుక వైకాపా నేత, మాజీ మంత్రి హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

సాగర్‌నగర్ బీచ్ రోడ్డులోని తుపాన్ రక్షిత భవనం వెనుకనున్న శాంతినికేతన్ లేఅవుట్లో సుమారు రూ.3 కోట్లు విలువ చేసే 400 గజాల పార్కు స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీనికి నకిలీ పత్రాలు సృష్టించి ఇప్పటికే విక్రయాలు జరిపి ప్రహరీ నిర్మించినట్లు తెలుస్తోంది. లేఅవుట్ మ్యాప్ ప్రకారం పార్కు స్థలంగా చూపిస్తున్నా, జీవీఎంసీ అధికారులు వీఎల్‌టీ పన్ను కట్టించుకుని కబ్జాదారులకు వంతపాడుతున్నారన్న విమర్శలున్నాయి. ఈ పార్కు ఆక్రమణ వెనుక ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ వైకాపా నాయకుడి అనుచరుల పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది.

**అలా అమ్మకాలు..**

మిథిలాపురి వుడా కాలనీ లేఅవుట్కి సంబంధించి కమర్షియల్ స్పేస్ కోసం విడిచి పెట్టిన భూమి పక్కనే సుమారు 700 గజాల మిగులు స్థలం ఉంది. దీనిపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఇటీవల అక్కడ పిచ్చిమొక్కలు తొలగించారు. రూ.5కోట్ల విలువైన ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయానికి తెరతీశారు. స్థలానికి సమీపంలో గెడ్డను భవన నిర్మాణ వ్యర్థాలతో కప్పి కొన్ని రేకుల షెడ్లు నిర్మించి 500 గజాలకు పైగా భూమిని కబ్జా చేశారు. నకిలీ పత్రాలతో మరికొంత ఆక్రమణకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ భూమి విలువ రూ.10కోట్లకుపైగా ఉంటుంది.

# నాటి దూకుడు నేడేమైంది..?



అనకాపల్లి : నాడు.. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడి ఇంటి నిర్మాణంలో జలవనరుల శాఖకు చెందిన రెండు సెంట్ల స్థలం కలిసిందని స్పందనలో ఫిర్యాదు వచ్చింది. దానిపై అధికారులు హడావుడి చేశారు. కేసులు పెట్టి వందల సంఖ్యలో పోలీసులను ఇంటికి పంపి నిర్మాణాన్ని కూలగొట్టే ప్రయత్నం చేశారు. తమకు సంబంధిత శాఖ నుంచి ఎన్వోసీ ఉందని చెప్పినా వినలేదు. అది నకిలీదంటూ అయ్యన్నను అర్ధరాత్రి అరెస్టు చేసేవరకు అప్పటి సర్కారు పెద్దలు నిద్రపోలేదు. నేడు.. కశింకోట మండలం విస్సన్నపేటలో వైకాపా నేతలు తమ బినామీల పేరిట భారీ లేఅవుట్ వేశారు. అందులో కొండ గెడ్డలు, ప్రభుత్వ భూములు కొంతమేర కలిపేశారని గత ప్రభుత్వంలోనే గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ భూముల వ్యవహారంలో అక్రమాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే జనసేన నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికీ ఆ ఫిర్యాదును పట్టించుకోనేలేదు. ఇదీ నేటి అధికారుల మెతక వైఖరి తీరు. తాజాగా మరోసారి ఆ పార్టీ నాయకుడొకరు ఆ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు.

గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు అధికారులు దూకుడు చూపేవారు. బుల్డోజర్లు తీసుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మాత్రం ఫిర్యాదులు చేసినా అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇందుకు విస్సన్నపేట భూముల వ్యవహారమే ఉదాహరణ. నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేటడ ప్రసాద్ కనుసన్నల్లోనే ఈ లేఅవుట్ వ్యవహారాలు నడిచాయి. అప్పటి ఎంపీ విజయసాయిరెడ్డి అనుచరుడు ఎస్.ఆర్.గోపీనాథ్ రెడ్డి ఇక్కడ 55 ఎకరాలపైగా భూములు కొనుగోలు చేశారు. 609 ఎకరాల్లో భారీ లేఅవుట్ వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదు వచ్చాక అప్పటి ఆర్‌డీవో సీతారామారావు విచారణ జరిపారు. సుమారు పదెకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. చర్యలైతే తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలో నాటి నేతల అక్రమాలను పూర్తిస్థాయిలో వెలికి తీస్తారని ఆశించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటారని భావించారు. ఫిర్యాదు వచ్చి పదినెలలైనా అధికారులైతే ఆ దిశగా అడుగులు వేయడమే లేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా మౌనం దాల్చడం వెనుక వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి.

**సా..గుతున్న విజిలెన్స్ విచారణ..**

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత గత ప్రభుత్వంలో భూముల వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. అయితే భూ రికార్డులు సక్రమంగా లేకపోవడం, కొండలు కరిగించినా వాటిని ఎక్కడికి, ఎంత పరిమాణంలో తరలించారనే వివరాలు దొరక్కపోవడంతో కాలయాపన జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో విచారణ చేపట్టిన ఆర్డీవో నివేదిక సైతం ఇప్పటి వరకు వెలుగుచూడలేదు. ఈ భూముల వ్యవహారంలోనే సస్పెన్షన్‌కు గురైన అధికారిని ఆర్డీవో కార్యాలయంలోని కీలక పోస్టులో పెట్టారు. ఆయన హయాంలో జరిగిన అక్రమాల వివరాలు ఇప్పుడు ఆయన్ని దాటి బయటకు వస్తాయా అన్నది ఫిర్యాదుదారుల అనుమానం.

# సర్కారీ భూముల్లో సౌర కుసుమాలు



అనకాపల్లి : వ్యవసాయ కనెక్షన్లకు అవసరమైన విద్యుత్తును పూర్తిగా సోలార్ ద్వారానే ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జా సురక్ష ఏవమ్ ఉద్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) ద్వారా వ్యవసాయ ఫీడర్లన్నింటినీ సోలరైజేషన్ చేయబోతున్నారు. ఇందులో భాగంగా జలవనరుల శాఖకు సంబంధించిన పంట కాల్వలపైనా, ప్రభుత్వ భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. దీనివల్ల భూముల ఆక్రమణలకు చెక్‌పెట్టడంతో పాటు సంబంధిత శాఖలకు ఆదాయం రానుంది. ఈపీడీసీఎల్ పరిధిలోని అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో సుమారు 358 ఎకరాల్లో సౌర పలకలు ఏర్పాటు చేయడానికి ఇటీవల టెండర్లు పిలిచారు.ఎకరాకి రూ.31వేల చొప్పున.. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడ ఆక్రమణలకు గురవుతున్నాయి. వాటిని కాపాడుకోవడమే పెద్ద సవాల్‌గా మారింది. వాటిలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వడం వల్ల ఆక్రమణల నుంచి రక్షణ ఏర్పడుతుంది. నర్సీపట్నం నియోజకవర్గంలో 90 ఎకరాల దేవాదాయ భూములతో పాటు రాంబిల్లి, మాకవరపాలెం, భీమిలి, ఆనందపురం మండలాల్లో ప్రభుత్వ భూములను ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధిత శాఖలకు విద్యుత్తు సంస్థ లేఖలు రాసింది. వీటి ద్వారా ఆయా శాఖలకు లీజు రూపంలో ఎకరాకు రూ.31వేల చొప్పున ఆదాయం సమకూరుతుంది.

కాలువ గట్టుపై కాసుల పంట.. జిల్లాలో పోలవరం ఎడమ కాలువ ఉంది. పాయకరావుపేట నుంచి కశింకోట మండలం వరకు ఈ కాలువ ఇరువైపులా సోలార్ పలకలు ఏర్పాటు చేయడానికి 123 ఎకరాలను గుర్తించారు. జలవనరుల శాఖకు ఏడాదికి రూ.31 వేల చొప్పున ఎకరాకి లీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రెండేళ్లకు 5 శాతం లీజు పెంచుతుండాలి. 25 ఏళ్లు పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగనుంది.

# రాకుంటే అడగొచ్చు.. రాయితీ పొందొచ్చు

రాజాం : పేదలకు అందిస్తున్న తొలి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకే గడువుంది. దీపం పథకం అర్హులు ఇంకా మిగిలి ఉంటే సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ప్రతి ఆర్థిక సంవత్సరంలో మూడు అందించాలని నిర్ణయించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుండడంతో అప్పట్లోగా బుక్ చేసుకోకపోతే తొలి ఏడాది లబ్ధికి దూరం అవుతారు. బుకింగ్ చేసుకున్న 24 గంటల్లో పట్టణ ప్రాంతాలకు, 48 గంటల్లో గ్రామీణ ప్రాంతాలకు అందిస్తున్నారు. లబ్ధిదారులు నగదు చెల్లించి బండను తీసుకున్న 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో జమ చేస్తున్నారు.

**తప్పిదాలు దిద్దుకోండి**



గ్యాస్ సిలిండర్ తీసుకున్నా.. సాంకేతిక సమస్యలు, లబ్ధిదారుల వివరాల నమోదులో తప్పిదాలతో కొందరికి రాయితీ జమ కావడం లేదు. ఎందుకు రావట్లేదో పౌర సరఫరాల అధికారులు, గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి తెలుసుకోవచ్చు. ఆధార్ నంబరు మనుగడలో లేకపోవడం, బ్యాంకు ఖాతాతో ఆధార్ అనుసంధానం కాకపోవడం, బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడం, లబ్ధిదారుడు చనిపోవడం, సరైన బ్యాంకు ఖాతా నంబరు నమోదు చేసుకోకపోవడం, ఈకేవైసీ డాక్యుమెంట్లు పెండింగ్ ఉండడం, తదితర కారణాలతో చాలా మంది జిల్లాలో లబ్ధి పొందలేకపోయారు.

ముందుకు రావాలి: అర్హులంతా దీపం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇంకా మిగిలి ఉంటే బుక్ చేసుకోవాలి. సాంకేతిక సమస్యలుండి లబ్ధి బ్యాంకు ఖాతాలో జమకాకపోతే సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి సరిదిద్దుకోవాలి.

మధుసూదనరావు, డీఎస్‌వో

అందించిన సిలిండర్లు: 4,46,846

అందులో రాయితీ పొందినవి : 4,42,394

ఆ మొత్తం మంజూరు: రూ.32.63 కోట్లు

బ్యాంకులో రాయితీ జమైన బండలు: 4,40,373

ఖాతాలో జమైన సొమ్ము: రూ.32.49 కోట్లు

# ఉంటే ఎక్కువ.. లేకుంటే తక్కువ

విజయనగరం : వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అయిదేళ్లు పారిశ్రామిక రంగం కుదేలైంది. కూటమి ప్రభుత్వం ఈ రంగమే ప్రగతిలో కీలకం కానుందని, అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావించి చిన్న పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఏపీఐఐసీ ద్వారా ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తామని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు మహిళలను ఆహ్వానిస్తున్నారు.



గత పాలనలో ప్రభుత్వ స్థలాలను భవనాల నిర్మాణం, కాలనీ లేఅవుట్లకు సేకరించడంతో ప్రస్తుతం పాతిక ఎకరాలు ఒకే చోట ఎక్కడ ఉందా అని రెవెన్యూ అధికారులు అన్వేషిస్తున్నారు. విజయనగరం జిల్లాలో ఏడు, మన్యం జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. కొని చోట్ల వందల ఎకరాలు ఉన్నాయి. మరికొన్ని చోట్ల పది ఎకరాలు కూడా లేదు. ఆయా ప్రాంతాల్లో డి-పట్టా భూముల సేకరణకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన వాటిని ఏపీఐఐసీకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గుర్తింపు దశ దాటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని పరిశ్రమల శాఖ అధికారులు అంటున్నారు.

# ఎర్రకాలువ పరిధిలో రైతులకు ఊరట

నిడదవోలు : గతేడాది జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో ఎర్రకాలువ పొంగి పంట పొలాలను ముంచెత్తి రైతులకు తీవ్ర నష్టం మిగిల్చిన విషయం తెలిసిందే. ఆ కష్టం నుంచి నిడదవోలు, ఉండ్రాజవరం, నల్లజర్ల, దేవరపల్లి మండలాలకు చెందిన రైతులు ఇంకా తేరుకోలేదు. ఆయా మండలాల్లో ఎర్రకాలువ వరదలకు సుమారు 14 వేల ఎకరాల్లో 4,500 మంది రైతులకు చెందిన వరి, చెరకు, ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. గత వైకాపా పాలనలో కాలువ నిర్వహణకు కనీస పనులను చేపట్టకపోవడంతో ఎర్రకాలువ పొంగిన సందర్భంలో గట్లకు గండ్లు పడి పంటచేలను ముంచెత్తింది. ఆ సమయంలో రైతులను ఓదార్చేందుకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఆ మేరకు మంత్రి దుర్గేష్ పలు సందర్భాల్లో పంటలు నష్టపోయిన రైతులకు ఉత్పాదక రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించాలని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం, ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనూ ఈ విషయం ప్రస్తావనకు రావడతో సీఎం స్పందించి ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. పూర్తిగా వరిపంట నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.17 వేలు నష్టపరిహారం అందించనున్నారు. ఈ సొమ్ము అందితే తమ కష్టాలు కొంత వరకు తీరుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**నిడదవోలు మండలంలోనే అధిక నష్టం...**

ఎర్రకాలువ వరద ప్రభావం నిడదవోలు మండలంలోని కోరుమామిడి, తాడిమళ్ల, ఉనకరమిల్లి, కంసాలిపాలెం, రావిమెట్ల, శంకరాపురం, సింగవరం, నిడదవోలు, తాళ్లపాలెం, శెట్టిపేట గ్రామాలపైనే ఎక్కువగా ఉంటుంది. వీటిలో సింగవరం, తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో మరింత అధికం. ఒక్క సింగవరంలోనే 575 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లింది. నిడదవోలులో 359, శంకరాపురంలో 145, శెట్టిపేటలో 396 హెక్టార్లలో నష్టపోయారు. ఉండ్రాజవరం మండలం కాల్దారి, సూర్యారావుపాలెం, పసలపూడి, దేవరపల్లి మండలం త్యాజంపూడి, నల్లజర్ల మండలంలో గుండేపల్లి, తెలికిచర్ల, అనంతపల్లి, నబీపేట, చోడవరం, పోతవరంలో ప్రభావం చూపుతుంది.

చురకలు



## అందని అదనపు పౌష్టికాహారం

అనంతపురం : ఐసీడీఎస్‌లో పౌష్టికాహార పంపిణీ బాగోతంలో ప్రతినెలా ఏదొక సమస్య ఉత్పన్నమవుతోంది. అధికార యంత్రాంగం గాడిలో పెట్టడానికి శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుత నెలకు సంబంధించి గర్భిణీ, బాలింతలకు అందజేయాల్సిన అదనపు పౌష్టికాహారం(కిట్లు) పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. నాలుగు రోజుల్లో మార్చి నెల పూర్తి కానుంది. అందులో రెండు రోజులు సెలవులు ఉన్నాయి. శుక్ర, శనివారాల్లో వంద శాతం కిట్ల సరఫరా అసాధ్యమే. కిట్ల గుత్తేదారు ప్రతి నెలా నిర్లక్ష్యం ప్రదర్శించినా ఐసీడీఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 10న కొత్త పీడీ నాగమణి బాధ్యతలు స్వీకరించినా పూర్తి స్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. ఇప్పటికీ నాలుగు ప్రాజెక్టులకు కిట్ల సరఫరా అగమ్యగోచరంగా మారింది. రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ




లేనివిధంగా అనంత గర్భిణీ/బాలింతల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంది. ఈ మహమ్మారి బారిన నుంచి గట్టెక్కించడానికే ఐదు రకాలతో కూడిన అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఏ నెలలోనూ సకాలంలో పంపిణీ చేయని దుస్థితి నెలకొంది.

**అటుకులే..**ప్రతి నెలా అదనపు పౌష్టికాహారం(కిట్లు) కింద ఐదు రకాల సరకులు ఇస్తారు. అటుకులు కిలో, రాగిపిండి 2 కిలోలు, బెల్లం, చిక్కీ ఖర్జూరం 250 గ్రాముల చొప్పున ఇవ్వాలి. ప్రతి నెలా మొదటి వారంలోనే ఇంటింటా పంపిణీ(టీహెచ్‌ఆర్) కార్యక్రమం కింద అందించాలి. గర్భిణీ/బాలింత కిట్లను నెలంతా వినియోగించాలి. జిల్లాలోని ఐదు ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో అందలేదు. కొన్ని ప్రాజెక్టులకు ఒక నెలలో ఇవ్వాల్సిన కిట్లను తరువాత నెల్లో పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా ఐసీడీఎస్ అధికారులు ఏమాత్రం చర్యలు ఉపక్రమించలేదు.

## పదోన్నతులు సరే.. ఖాళీల భర్తీ ఏదీ?

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ పట్టుపరిశ్రమ సహాయకులను(వీఎస్‌ఏ), సాంకేతిక సహాయకులుగా(టీఏ) పదోన్నతి కల్పించారు. దీంతో వారందరిని రిలీవ్ చేయడంతో విధుల్లో చేరారు. వారి స్థానంలో గ్రామస్థాయి సహాయకులను ఇంతవరకు నియమించలేదు. కనీసం మండలస్థాయి అధికారులకు భవనాలు స్వాధీనం చేయలేదు. దీంతో 69 రైతు సేవా కేంద్రాలు మూతపడ్డాయి. రైతులకు అందించే సేవలు స్తంభించాయి. పశుపోషకులు, కాపర్లు కేంద్రాలు చుట్టు తిరుగుతున్నారు. కనీసం సమాచారం చెప్పే నాథుడే లేరని వాపోతున్నారు. ప్రస్తుతం కొన్ని కేంద్రాల్లో రైతులకు విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియతో పాటు యాంత్రికీకరణ పథకం అమలుకు దరఖాస్తు స్వీకరిస్తున్నారు. ఈనెలాఖరులో రెండు కార్యక్రమాలు పూర్తి చేయాలని




ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈక్రమంలో పలుచోట్ల తెరుచుకోకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 54, అనంతపురం జిల్లాలో 15 కేంద్రాలు తెరుచుకోవడం లేదు.

**ఇళ్లలో టెలివిజన్లు..**

పదోన్నతి పొందిన వారు రిలీవ్ అయితే మండల అధికారులకు కేంద్రాలను అప్పగించాలి. అదేదీ లేకుండా కేంద్రాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోయారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో టెలివిజన్, ట్యాబు, డివైజర్, రెండు టేబుళ్లు, 15 కుర్చీలు, రెండు ర్యాకులు చొప్పున పంపిణీ చేశారు. టీవీలు, కుర్చీలు సిబ్బంది ఇళ్లలో పెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని జిల్లా పట్టు పరిశ్రమలశాఖ అధికారి ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే ఖాళీలను భర్తీ చేస్తామన్నారు.

## నీరు పారదు.. పంట తడవదు



గుత్తి: గుత్తి మండలంలోని సేవాఘడ్ వద్ద ఉన్న చెంద్రాయిని కుంట సాగునీటి కాలువ శిథిలావస్థకు చేరుకుంది. ముళ్లపొదలతో నిండి సాగునీరు ముందుకు పారడం లేదు. దీంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందడం లేదు. కొన్ని చోట్ల కాలువ పూర్తి శిథిలమై రాళు తేలాయి. సుమారు 5 వేలకు పైగా ఆయకట్టు ఉన్న చెంద్రాయిని కుంట రిజర్వాయర్ కాలువలకు కనీసం మరమ్మతులు, ముళ్లపొదలు తొలగించలేరా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఉండగా రిజర్వాయర్ నీటిని బయటకు పంపే షెల్టర్ మరమ్మతులకు గురై గత రెండేళ్ల నుంచి సాగునీరు వృథా పోతోందని రైతులు తెలిపారు. రిజర్వాయర్‌కు మరమ్మతులు చేసి సాగునీరు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన ఉందని రైతులు విన్నవిస్తున్నారు.

## పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్..



అనంతపురం: కనీస అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలుపై ప్రకటనలు గుప్పిస్తున్నారు. ప్లాటు కొంటే ఉచిత రిజిస్ట్రేషన్‌తో పాటు బంగారు నాణెం, ద్విచక్ర వాహనం బహుమతిగా ఇస్తామంటూ ఆకర్షిస్తున్నారు. దీంతో చాలామంది అవగాహన లేకుండా ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా అహుడా అధికారులు పట్టించుకోవడం లేదు. విమర్శలు వచ్చిన సందర్భాల్లో కొన్ని లేఅవుట్లలో రాళ్లు తొలగిస్తున్నారు. మళ్లీ రెండు రోజులకే సదరు నిర్వాహకులు కొత్త రాళ్లు పాతి యథేచ్ఛగా ప్లాట్ల అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

**నిబంధనలు గాలికి..**

ఉమ్మడి అనంత జిల్లాలోని 993 పంచాయతీల్లో అహుడా (అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) విస్తరించి ఉంది. పంచాయతీ ఏర్పాటు చేసే లేఅవుట్లకు అహుడా అనుమతులు తప్పనిసరి. 10 శాతం భవిష్యత్తు అవసరాలకు కేటాయించాలి. ప్రాంతాన్ని బట్టి 33, 60 అడుగుల రోడ్లు ఏర్పాటు చేయాలి. లేఅవుట్‌లో 30 నుంచి 40 శాతం భూమిని వదులుకోవాల్సి వస్తుందని అనుమతులు తీసుకోవడం లేదు. అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి ప్లాట్లు కట్టబెడున్నారు. ఇలా అహుడా పరిధిలో సుమారు 2,400 లేఅవుట్లకు అనుమతులు లేవు. ప్రస్తుతం ఇరు జిల్లాల్లో 280 లేఅవుట్లకు మాత్రమే అనుకూలంగా ఉన్నాయి.

**మాముళ్ల మత్తులో..**

అనధికార లేఅవుట్లపై అహుడా ఎప్పటికప్పుడు పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులకు నివేదికలు పంపించాలి. దీంతోపాటు అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వివరాలు ఇవ్వాలి. నోటీసులకు స్పందించని వారి లేఅవుట్లను ధ్వంసం చేయాలి. ఇటీవల అనంతపురం గ్రామీణం, రాప్తాడు, మామిళ్లపల్లి ప్రాంతాల్లో 14 లేఅవుట్లను అధికారులు ధ్వంసం చేశారు. కొందరు మళ్లీ కొత్తగా రాళ్లు పాతి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

**చర్యలు తీసుకుంటాం-శివనారాయణశర్మ, అహుడా వైస్ ఛైర్మన్**

అహుడా పరిధిలో అనుమతులు లేని లేఅవుట్లను గుర్తించి నోటీసులు ఇస్తున్నాం. ఇటీవల కొన్ని లేఅవుట్లలో రాళ్లను తొలగించాం. త్వరలోనే పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

## తిర'కాసు'లెన్నో!



అనంతపురం : అనంతపురం నగర డంపింగ్ యార్డులో చెత్తతరలింపు అవినీతి కంపుగా మారింది. వైకాపా ప్రభుత్వ హయాంలో చెత్త తరలింపు పూర్తి కాకుండానే రూ.కోట్లు నగదు చేతులు మారింది.. 40 సంవత్సరాలుగా పేరుకున్న చెత్తగుట్టలను ప్రాసెసింగ్ చేసి తరలించామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు భిన్నం. పూర్తిగా తొలగింపు చేపట్టలేదన్నది స్పష్టం. ఈలోగా కొత్త చెత్త వెల్లువలా రావడంతో దాన్ని ఆ గుట్టలోనే కలిపేసి ప్రాసెసింగ్ పూర్తయిందని చెప్పి బిల్లులు నొక్కేశారు. చెత్తను ప్రాసెసింగ్ చేశామని లెక్కలు చూపగానే అధికార యంత్రాంగం సంతకాలు చేసేశారు. ప్రాసెసింగ్ కాలేదని అప్పుడు అడ్డు చెప్పకుండా వైకాపా మాజీ ముఖ్యనేత అండతో బిల్లుల చెల్లింపు సాగించేశారు. కాకి లెక్కలు చూపి తెరవెనుక మంత్రాంగం ఆయనే నెరిపారని డంపింగ్ యార్డులో భారీగా అవినీతి జరిగిందని, కీలకమైన వారికి కమిషన్లు దక్కడం వల్లే అవినీతి గుట్టు వెలికి రాలేదని.. ఆ పార్టీకి చెందిన నగరపాలకలోని రెండో కీలక ప్రజాప్రతినిధి కౌన్సిల్ సమావేశాల్లో పలుసార్లు ప్రస్తావించారు. ఇటీవల జరిగిన నగరపాలక కౌన్సిల్ సమావేశంలో సైతం గట్టిగా వాదన విన్పించినా విచారణ జోలికి వెళ్లడం లేదు.

**వైకాపా కీలక నేత అండ**

చెత్తను ప్రాసెసింగ్ చేయకుండానే పూర్తి చేశామని బిల్లులు కాజేశాక.. కొత్త తంతు మొదలైంది. టెండరు మాకే దక్కుతుందన్న ధీమాతో యంత్రాలను అక్కడే ఉంచారు. పెద్దయెత్తున దుమారం రేగగానే యంత్రాలను వెనక్కి పంపారు. పాలక వర్గానికి చెప్పకుండా, గుట్టుచప్పుడు కాకుండా బయోమైనింగ్ ఎలా చేస్తారని అప్పట్లోనే కౌన్సిల్ సమావేశంలో వైకాపా నాయకులు తప్పుబట్టారు. అధికార యంత్రాంగం అంతా వైకాపా ముఖ్యనేత చెప్పినట్లు చేయడంతో చెల్లింపులు సాగుతూ వచ్చాయి. ఎంత తరలించారు, ఎంత బిల్లు చెల్లించారు అన్న వివరాలను వెలికితీస్తే అవినీతి డొంక కదులుతుంది.

**విచారణ.. కాలయాపన!**

విచారణ పేరుతో కలెక్టరు సైతం జాప్యం చేస్తుండటంతో అవినీతి లెక్కలు తేలలేదు. విచారణ వెంటనే చేయాలని గత సంవత్సరం జులైలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఫిర్యాదు చేశారు. అప్పటి జేసీ కేతన్‌గార్గ్‌ను విచారణ అధికారిగా నియమించారు. తర్వాత ఆయన బదిలీపై వెళ్లారు. విచారణకు కమిటీ వేసి ఇప్పటికే ఆరునెలలు అవుతోంది. అది ఏమైందో అంతుచిక్కని అంశంగా మారింది.

## నవధాన్యం.. భూమికి సారం



చిత్తూరు : మోతాదుకు మించి రసాయనాల వినియోగంతో నేల నిర్జీవంగా మారుతోంది.. దీంతో వ్యయం పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి.. సాగు గిట్టుబాటు కాక రైతులు కాడి పడేస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో నేలకు పునరుజ్జీవం కల్పించి సహజ శక్తిని పెంపొందించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.. తక్కువ పెట్టుబడితో ప్రకృతి విధానంలో పంటల సాగు ప్రోత్సహిస్తున్నారు.. ఇందులో భాగంగా నవ ధాన్యాలు అందజేసి ప్రకృతి సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఖరీఫ్ సీజన్‌కు ముందే వేసవిలో సుమారు లక్ష మంది రైతులతో 85 వేల ఎకరాల్లో నవధాన్యాల విత్తనాలు వేయించాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. గతేడాది 80 వేల ఎకరాల్లో వీటిని సాగు చేశారు. రుతుపవనాలు రాకముందే పొడి నేలలో వేయనున్నారు. పొలం సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో ఉపయోగపడనున్నాయి.

**35 రకాల విత్తనాలు..**

నవధాన్యాల కిట్లలో జొన్న, మొక్కజొన్న, కందులు, పెసలు, వేరుసెనగ, పొద్దుతిరుగుడు, ధనియాలు, మెంతులు, ఆవాలు, జీలుగలు, జనుము, పిల్లిపెసర, ఆకుకూరలు, ఉలవలు, అలసంద, మినుములు, కొర్రలు, సామలు, రాగులు, సజ్జలు, నువ్వులు, వరి, తీగ, దుంపజాతికి చెందిన 35 రకాల విత్తనాలతో ఓ కిట్ రూపొందించారు. ఒక్కో దాంట్లో 15 కిలోల చొప్పున అన్ని రకాల విత్తనాలు ఉంటాయి. వీటిని వేసవిలో ప్రధాన పంట వేసే ముందుగా రైతులకు పంపిణీ చేస్తారు. కిట్ల తయారీ దాదాపు పూర్తయింది, త్వరలో రైతులకు అందజేయనున్నారు.

**జిల్లా వివరాలు..**

సాగు లక్ష్యం: 85 వేల ఎకరాలు

నవధాన్యాల కిట్లు: 83 వేలు

ఎన్నో ప్రయోజనాలు30 రకాల విత్తనాలను పచ్చిరొట్ట ఎరువులుగా సాగు చేయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. నేలలో కర్బన శాతం పెరుగుతుంది. కలియ దున్నడం వల్ల భూసారానికి లోపం ఉండదు. ప్రధాన పంటకు రసాయన ఎరువుల భారంతో పాటు కలుపు బెడద, చీడపీడల ఉద్ధృతి తగ్గుతుంది. నేలలో నీటి సామర్థ్యం పెరిగి, వానపాముల సంఖ్య వృద్ధి చెందుతుంది. స్థూల, సూక్ష్మ పోషకాల లోపాలను అధిగమించొచ్చు. త్వరలో కిట్లు అందజేయనున్నాం.వాసు, జిల్లా పథక మేనేజరు, ప్రకృతి వ్యవసాయ విభాగం

## నత్తనడకన.. 'నవీకరణ'..!

విశాఖపట్నం : విశాఖ చేపలరేవులో చేపడుతున్న నవీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో జాప్యం కారణంగా ఆయా పరిసరాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కీలకమైన జెట్టీల ఆధునికీకరణ, ఫింగర్ జెట్టీ, డ్రై డాక్ పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

విశాఖ పోర్టు నిధులు రూ.150 కోట్లతో చేపట్టిన పనులకు 2023 ఆగస్టులో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ఆ ఏడాది నవంబరులో ప్రారంభించిన పనులను 2024 నవంబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినప్పటికీ ముందుకు సాగలేదు. ఆ తర్వాత 2025 మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని భావించినా... ఆ దిశగా అడుగులు ముందుకు పడడం లేదు. చేపలరేవు ఆవరణలో వివిధ అవసరాల కోసం నిర్మించిన భవనాల పనులు మాత్రం తుది దశకు చేరాయి.

**రాబోయే రెండు నెలల్లో..**ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు చేపలవేటపై నిషేధం ఉంటుంది. ఆ సమయంలోనే జెట్టీల నవీకరణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. కాని ఇప్పటికీ ఆయా పనులు ప్రారంభం కాలేదు. జెట్టీల్లో డ్రెడ్జింగ్ పనులు రెండు విడతల్లో చేయాల్సి ఉండగా, ఇప్పటి ఓ విడత పూర్తి చేశారు.డ్రై డాక్ లేకపోవడంతో బోట్ల మరమ్మతులకు



ఇబ్బందిగా ఉంటోందని బోటు ఆపరేటర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి.. రాబోయే రెండు నెలల్లో పనులను వేగవంతం చేయించాలని మత్స్యకారవర్గాలు కోరుతున్నాయి.

**40 శాతమే పూర్తి**

తొలినాళ్లలో చేపలరేవులో 300 బోట్లు నిలుపుకొనేలా 11 జెట్టీలతో నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు రోజూ వందల టన్నుల మత్స్య సంపద దిగుబడులు, ఎగుమతులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 700 మర పడవలు, మరో వెయ్యి ఇంజిన్ బోట్లు ఉన్నాయి. వీటి ద్వారా చేపల వేట సాగుతోంది. ఇక్కడి ఆవరణలో సౌకర్యాల కల్పనకు కేంద్రం, విశాఖ పోర్టు సంయుక్తంగా ముందుకొచ్చాయి. అలా చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు కేవలం 40 శాతం మాత్రమే పూర్తయ్యాయి.

**ఇవీ సదుపాయాలు..!**

సరకు నిల్వకు శీతలీకరణ కేంద్రాలు
రహదారుల అభివృద్ధి
వలల తయారీ కేంద్రం
వాహనాలకు పార్కింగ్
ప్యాకింగ్ వసతి
మురుగు నీటి శుద్ధి కేంద్రం
శుద్ధమైన తాగునీటి వసతి
జెట్టీల నవీకరణ
కొత్తగా ఫింగర్ జెట్టీ ఏర్పాటు
బోట్ల మరమ్మతులకు డ్రైడాక్ నిర్మాణం

## 'జల'సత్వాలు కూడగట్టుకునేలా!

చిత్తూరు, తిరుపతి: వైకాపా హయాంలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు కూటమి ప్రభుత్వం సంసిద్ధమైంది. తాజాగా బుధవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులోనూ ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి అవసరమైన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.పోలవరం ప్రాజెక్టు తర్వాత అత్యధికంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.3,243 కోట్లు కేటాయించి సర్కార్ చిత్తశుద్ధి చాటుకుంది. ఇదే తరహాలో తిరుపతి జిల్లాలో మూడు జలాశయాలు, ఒక చెరువుకు నీళ్లు అందించేందుకు నిధులు విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. పుంగనూరు నియోజకవర్గంలో పలు రిజర్వాయర్లు, జలాశయాలు నిర్మించారని బాధిత రైతులకు పరిహారం మాత్రం ఇవ్వలేదని ఆ నగదూ మంజూరు చేయాలని చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ విన్నవించారు. త్వరితగతిన రూ.1,154.73 కోట్ల నిధులు విడుదల చేస్తే తిరుపతి జిల్లాలో నిర్మాణాలు పూర్తయి ఇక్కట్లు తొలగుతాయి. పుంగనూరు రైతులకు కష్టాలు తప్పుతాయి.

**రూ.270.13 కోట్లతో ఆల్తూరుపాడు**

వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి నియోజకవర్గాలకు తాగు, సాగునీరు అందించడంలో ఆల్తూరుపాడు రిజర్వాయర్ కీలకం. గుత్తేదారులకు వైకాపా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపేశారు. రూ.270.13 కోట్లతో పరిపాలనా అనుమతులివ్వాలని సీఎం దృష్టికి కలెక్టర్ తీసుకెళ్లారు. ‌య మల్లెమడుగు జలాశయంలో 2.69 టీఎంసీలు లక్ష్యంగా పెట్టుకున్నారు. తొలి దశలో ఒక టీఎంసీబీ ఆల్తూరుపాడు, మేర్లపాక జలాశయాలతోపాటు లిఫ్ట్ పనులు చేసేలోగా మిగిలిన సామర్థ్యం మేరకు నింపాలనుకున్నారు. రూ.259 కోట్లకు ప్రతిపాదనలు పంపి.. నిధుల విడుదలకు ఆర్థికశాఖ ఆమోదం కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎంకు తెలిపారు.

**రూ.489.60 కోట్లతో బాలాజీ జలాశయం**

బాలాజీ జలాశయాన్ని పూర్తిచేస్తే తిరుమల, తిరుపతి నగరంలోని ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య ఉండదు. తెదేపా హయాంలో తొలి దశ అటవీ అనుమతులు లభించగా రెండో దశ అనుమతులకు వైకాపా ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదు. ఈ నేపథ్యంలో అనుమతులకు కృషి చేయాలని ముఖ్యమంత్రికి విన్నవించారు. పనులకు రూ.498.60 కోట్లు అవసరమని నివేదించారు. చంద్రగిరి మండలం మూలపల్లె చెరువుకు నీరందించేందుకు రూ.127 కోట్లు వ్యయమవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీన్ని ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**పరిహారం ఇవ్వకుండానే 'పెద్దాయన' పనులు**

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పుంగనూరు నియోజకవర్గంలో రిజర్వాయర్లు, చెరువుల నిర్మాణాలు పూర్తి చేసినా నిర్వాసిత రైతులకు రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదు. వైకాపాలో 'పెద్దాయన'గా ముద్రపడ్డ కీలక ప్రజాప్రతినిధి నియోజకవర్గం కావడంతో అన్నదాతలు నోరెత్తే సాహసం చేయలేదు. సోమల మండలంలోని ఆవులపల్లి, పుంగనూరు మండలంలోని నేతిగుట్లపల్లి, రొంపిచెర్ల మండలంలోని గానుగచింత, సదుం మండలంలో కొర్లగుంటవారిపల్లి, గంటావారిపల్లి, చింతపర్తివారిపల్లి కర్షకులు ఏళ్లుగా పరిహారానికి విన్నవిస్తున్నా ఫలితం లేదు. రూ.96.04 కోట్లు విడుదల చేస్తేనే భూములు కోల్పోయిన రైతులకు ఉపశమనం లభిస్తుంది.

# నంబర్ 5, 341 మిర్చి రకాలకు గిరాకీ

అమరావతి: మిర్చి నంబర్ 5, 341 రకాలకు మిగతా వెరైటీలతో పోలిస్తే ధర మెరుగ్గా ఉంది. తేజ, బాడిగ రకాల మిర్చి కంటే కూడా ఈ రెండు రకాలకు మంచి ధర పలుకుతుంది. 341 రకం ఎండు మిరపకాయల్ని కారానికి, నంబర్ 5 రకం మిర్చిని పచ్చళ్లకు వినియోగిస్తారు. 341 రకం మిర్చిని దేశీయంగా కారం వ్యాపారులు, నంబర్ 5 మిర్చిని రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తుండడంతో ఆయా రకాలకు గిరాకీ ఉందని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఏడాది ఈ రెండు రకాలకు అంతగా డిమాండ్ లేకపోవడం, ఆశించిన ధర



దక్కకపోవడంతో రైతులు సాగుకు వెనుకంజ వేశారు. ప్రస్తుత సీజన్‌లో పంట తక్కువగా ఉండటం.. డిమాండ్ అధికంగా ఉండడంతో ధర పలుకుతుందని చెబుతున్నారు.

**గరిష్ఠ ధర రూ.14,500**

కామన్ వెరైటీలో నంబర్ 5, 341 రకాల మిర్చి గరిష్ఠ ధర రూ.14,500 ఉంది. ఎప్పుడూ స్పెషల్ వెరైటీలోని తేజ, బాడిగ రకాల మిర్చి ధరలు వీటి కంటే అధికంగా ఉంటాయి. తేజ రకాల గరిష్ఠ ధర రూ.14,200 ఉండగా, బాడిగ రకాలకు రూ.14,100 లభిస్తుంది. కామన్ వెరైటీలోని మిగతా రకాలైన 334 రకం మిర్చికి రూ.9,000–13,900, 273 రకానికి రూ.10,000–13,000, 4884 రకం మిర్చికి రూ.9,000–13,000, సూపర్ 10 రకానికి రూ.10,500–13,000 ధర లభించింది. స్పెషల్ వెరైటీలోని తేజ రకాల రూ.10,000–14,200, బాడిగ రకానికి రూ.10,000–14,100, సింజెంటా బాడిగకు రూ.10,000–12,500, దేవనూరు డీలక్స్‌కు రూ.10,000–13,500, ఆర్మూర్ రకానికి రూ.10,000–11,500, తాలు రకాలకు రూ.5,000–7,700 ధర లభించింది.

**తగ్గిన నిల్వలు**రైతులు మహా శివరాత్రి తిరునాళ్లకు వెళ్లడంతో యార్డుకు లక్ష బస్తాల కంటే తక్కువగా బస్తాలు వచ్చాయి. అయితే విక్రయాలు మాత్రం అధికంగా జరిగాయి. శుక్రవారం రైతులు 99,747 బస్తాలు యార్డుకు తరలించగా.. గత నిల్వలతో కలిపి 1,03,526 బస్తాలు విక్రయాలు జరిగాయి.

# యువతకు ఉపాధి బాటలు

భీమవరం : పట్టణాల్లోని మెప్మా కుటుంబ సభ్యుల్లో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. ప్రస్తుతం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ చేపడుతోంది. అర్హత సాధించిన వారికి ఏడాదిపాటు వర్చువల్‌గా శిక్షణనిచ్చి.. ఉపాధి బాటలు వేయనున్నారు. ఆశా సొసైటీ సహకారంతో 2024- 25 విద్యా సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 వేలు మందికి అప్రెంటిస్‌షిప్ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు మెప్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2021 తర్వాత డిగ్రీ పూర్తయిన వారిని జాతీయ అప్రెంటిస్‌షిప్ శిక్షణ పథకం(ఎన్.ఎ.టి.ఎస్) ద్వారా ఎంపిక చేయనున్నారు. వారికి వృత్తి, జీవన నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఏడాది నిర్వహించే శిక్షణకు ప్రతి నెలా రూ.4,500 భృతి ఇవ్వనున్నారు.అర్హతలు ఇవీ.. 2021 తర్వాత రెగ్యులర్‌గా ఏదైనా డిగ్రీ పూర్తి చేయాలి. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, చరవాణి, బ్యాంకు ఖాతా నంబర్లు, ఇ–మెయిల్ ఐడీ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఏడాది శిక్షణ కాలంలో మొత్తం 150 గంటలు వర్చువల్ శిక్షణ పొందాలి.

నమోదు చేసుకోండి.. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ద్వారా పొందే శిక్షణ ధ్రువీకరణ పత్రంతో ఉపాధి అవకాశాలుంటాయి. మెప్మా కార్యాలయంలో లేదా ఎస్ఎల్ఎఫ్ ఆర్పీ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు. సీహెచ్ నానిబాబు, మెప్మా జీవనోపాధుల విభాగ నిపుణుడుఉభయ జిల్లాల్లో పట్టణాల వారీగా అభ్యర్థుల లక్ష్యమిలా..

భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, నూజివీడు, జంగారెడ్డిగూడెం: 300 చొప్పున

ఏలూరు : 500

ఆకివీడు, చింతలపూడి : 150

# అరకొర సిబ్బంది అంతటా ఇబ్బంది

భీమవరం : ఇరగవరం మండలంలో ఏపీవో 1, సాంకేతిక సహాయకులు (టీఏ) 2 ఉండాల్సి ఉండగా టీఏ ఒకరే ఉన్నారు. భారమంతా ఒకరి మీదే పడటంతో సమయానికి చేయలేకపోతున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ముగ్గురు కొరత ఉండటంతో ఆ పనులు సైతం ఉన్న ఒక్కరి మీదే పడుతున్నాయి.తాడేపల్లిగూడెంలో ఏపీవో 1, సాంకేతిక సహాయకులు (టీఏ) అయిదుగురు పనిచేయాల్సి ఉండగా ఇద్దరు టీఏలు మాత్రమే ఉన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉండటంతో ఉన్నవారిపైనే పని భారం పడుతోంది.ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరతతో పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకంలో పలు అభివృద్ధి పనులు చేపడుతుండటం, సిబ్బంది కొరతతో ఇబ్బంది నెలకొంది.

గత ప్రభుత్వంలోని కొందరు నాయకులు, క్షేత్రస్థాయి సహాయకుల నిర్వాకంతో ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారింది. తప్పుడు మస్తర్లతో పనిచేయని వారికి నగదు జమయ్యేలా చేశారు. సామాజిక తనిఖీల్లో గతేడాది అక్టోబరులో నలుగురు అధికారులను సస్పెండ్ చేశారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

**ఏళ్లగా ఖాళీ..**

ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ) పోస్టులు కొంత కాలంగా ఖాళీగా ఉన్నాయి. పనులను గుర్తించి, కూలీలను నియమించడం, అంచనాలు రూపొందించడం, చేసిన పని కొలతలు తీసుకోవడం తదితర పనులను సాంకేతిక సహాయకులు చేయాల్సి ఉండగా, వాటిని ఏపీవో పర్యవేక్షించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. కొన్నేళ్లగా భర్తీ లేకపోవడంతో ఉన్న సిబ్బందికే అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు.

**ఇష్టానుసారంగా..**జాబ్‌కార్డు ఉన్నవారికి తప్పనిసరిగా పని కల్పించాల్సి ఉన్నా క్షేత్రస్థాయి సిబ్బంది తమకు కావాల్సిన వారికే పని కల్పిస్తున్నారంటూ ఇటీవల కాలంలో ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. ఆచంటలో ఉపాధి హామీ పనులు చేసేందుకు కొంతమంది కూలీలు రాకపోయినా మస్తరు వేయడం, జాబ్‌కార్డులు సృష్టించి కూలి డబ్బులు చెల్లించినట్లు చూపించి అధికారులు చేతి వాటానికి పాల్పడ్డారు.

# ప్రయోగం వినూత్నం.. ఉపయుక్తం



అనంతపురం : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు, వినూత్న ప్రయోగాలవైపు ఎంత ఎక్కువ దృష్టి సారిస్తే సమాజాభివృద్ధికి అంతే స్థాయిలో పునాదులు పడతాయి.. తద్వారా విద్యార్థులకు రావాల్సిన గుర్తింపు దక్కుతుంది. భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీరామన్ 1928లో రామన్ ఎఫెక్ట్ అనే ప్రయోగానికి నోబెల్ బహుమతి దక్కింది. ఫిబ్రవరి 28న ఆయన ప్రయోగం చేశారు. అదే రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకొంటాం. ఎస్కేయూ, జేఎన్‌టీయూలో పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రయోగాలతో ప్రత్యేక గుర్తింపు పొందారు.

**వ్యర్థాలు.. మూడు భాగాలు**

ప్రయోగం : గార్బేజి సార్టింగ్ మిషన్

విద్యార్థులు : ప్రశాంత్, గుణశేఖర్, మనూష, పారిజాత, మదన్‌మోహన్ (ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల)

అవసరమైన వస్తువులు: ప్రాక్స్‌మెటీ సెన్సార్, మాయిశ్చరైజర్ సెన్సార్, అల్ట్రాసోనిక్ సెన్సార్, డీసీ మోటర్, ఆర్డినో నానో, ఎల్‌సీడీ డిస్‌ప్లే, బెల్ట్ కన్వర్షన్, వ్యర్థాలతో నింపిన డ్రమ్ము

ప్రయోగ విధానం: ఒక ప్లాట్‌ఫారంపై పైన పేర్కొన్న వస్తువులన్నీ అమర్చాలి. డీసీ మోటర్ సాయంతో బెల్ట్ కన్వర్షన్ తిరుగుతూ ఉంటుంది. వ్యర్థాలు బెల్ట్‌పై పడేలా ఏర్పాటు చేసుకోవాలి. బెల్ట్‌పై చెత్త నెమ్మదిగా ముందుకు వెళ్తుంటాయి. వ్యర్థాల్లో లోహ వస్తువులను ప్రాక్స్‌మెటీ సెన్సార్, తడిపొడి చెత్తను మాశ్చరైజర్ సెన్సార్, ప్లాస్టిక్ వ్యర్థాలను అల్ట్రాసోనిక్ సెన్సార్లు 3 భాగాలుగా వేరు చేస్తాయి. పట్టణాలు, నగరాల్లో వెలువడే చెత్తను ఇలా వేరువేరు చేసి సులువుగా రీసైక్లింగ్ చేయవచ్చు.

**విద్యుత్తు సరఫరా లోపాలు తెలిపేలా..**

ట్రాన్స్‌మిషన్ లైన్ పార్ట్స్ ఫాల్ట్ సేఫ్టీ అండ్ ప్రొటక్టివ్

శ్రీనివాసులు నాయక్, రహంతుల్లా, మధుసూదన్‌రెడ్డి, మహేష్, తిమ్మప్ప (ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాల)

ట్రాన్స్‌ఫార్మర్, రిలేస్, ఎల్ఈడీ బల్బులు, జీఎస్ఎం మాడ్యూల్స్, బ్యాటరీలు,

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రిలేస్, జీఎస్ఎం మాడ్యూల్స్ అమర్చాలి. ఏఏ ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య విద్యుత్తు లైన్లు పాడైనా, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైనా రిలే గుర్తిస్తుంది. జీఎస్ఎం మాడ్యూల్స్ ద్వారా ఆ ప్రాంతాన్ని విద్యుత్తుశాఖ అధికారుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. విద్యుత్తు తీగలు పడిపోతే క్షణాల్లో సమాచారం తెలుస్తుంది.

**వంతెనలు కూలిపోకుండా నియంత్రణ**

స్మార్ట్ క్రౌడ్ కంట్రోల్ సిస్టమ్ ఫర్ ప్రివెన్సీ ఆఫ్ బ్రిడ్జి ఓవర్‌లోడ్ అండ్ కొలాప్స్ విద్యార్థుల పేర్లు: శశిధర్‌రెడ్డి, మోహన్‌కుమార్, వెంకటేష్‌నాయక్, సురేష్, కాత్యాయని (జేఎన్‌టీయూ)

ఐర్ సెన్సార్లు, ఆర్డినోబోర్డు, సర్వో మోటర్, లోడ్‌సెల్, ఎల్‌సీడీ డిస్‌ప్లే, సర్వో మోడల్ గేటు నిర్ణీత బరువు కంటే అధికలోడుతో వాహనాలు వంతెనపైకి వెళ్లకుండా నియంత్రించేందుకు వంతెన ఇరువైపులా ఐర్ సెన్సార్లు ఏర్పాటు చేయాలి. వంతెన ప్రవేశ మార్గంలో సర్వోమోడల్ గేటు అమర్చాలి. వంతెనపైకి వాహనాలు ప్రవేశించినపుడు వాటి బరువును లోడ్ సెల్ కొలుస్తుంది. గరిష్ఠ బరువు పెరిగితే ఐర్ సెన్సార్లు గుర్తించగానే సర్వోమోడల్ గేటు ఆటోమేటిక్‌గా మూతపడతుంది. వంతెనలు దెబ్బతిని కూలిపోయే ప్రమాదాలను అరికట్టవచ్చు.

# అంగన్‌వాడీలకు టీఏ ఎగనామం!



అనంతపురం : ఒకో అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.300.. ఇలా మొత్తం 2079 మందికి రూ.6.24 లక్షలు రవాణా ఛార్జీ(టీఏ) రూపంలో చెల్లించాలి. సదరు మొత్తాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు పంపిణీ చేసినట్లు గుట్టుచప్పుడు కాకుండా ఏకంగా అక్విటెన్స్ (ఆధారం) కూడా తీసుకున్నారు. కాని.. జిల్లాలో ఎవరికి నయాపైసా ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. రెండు రోజుల క్రితం జరిగిన 'జ్ఞానజ్యోతి' శిక్షణలో చోటు చేసుకున్న అక్రమ బాగోతమిది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల ద్వారా మీకు అందజేస్తామంటూ కొందర ఎంఈఓలు చెప్పినా ఇప్పటికీ అతీగతీలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు వినూత్న పద్ధతిలో బోధనలు చేసేందుకు కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 'జ్ఞానజ్యోతి' పేరుతో ఈ తర్ఫీదుకు శ్రీకారం చుట్టారు. జిల్లావ్యాప్తంగా మండలాలు, ప్రాజెక్టుల వారీగా ఈనెల 18, 19, 20, రెండో విడతగా ఇదే నెల 22, 24, 25వ తేదీల్లో శిక్షణ ఇచ్చారు.

**బడ్జెట్ రూ.35.35 లక్షలు**అనంత జిల్లాకు ఆరు రోజుల శిక్షణకే రూ.35.35 లక్షల బడ్జెట్ కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) సారథ్యంలో ఎంఈఓ/హెచ్‌ఎంలు ఈ శిక్షణ ఇచ్చారు. ఈ జ్ఞానజ్యోతి శిక్షణకు కేవలం అంగన్‌వాడీ సిబ్బంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం బడ్జెట్టులో ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.50 చొప్పున ఆరు రోజులకు రూ.300 ప్రకారం 2079 మందికి రూ.6.24 లక్షలు, భోజనం, స్నాక్స్ కోసం రోజుకు రూ.200 ప్రకారం ఆరు రోజులకు 2079 మందికి రూ.24.95 లక్షలు, స్టేషనరీ, జ్ఞానజ్యోతి మాడ్యువల్స్ ముద్రణ కోసం రూ.200 ప్రకారం రూ.4.16 లక్షలు ప్రకారం కేటాయించారు. ఆరు రోజులూ భోజనం కూడా నాసిరకంగా పెట్టారన్న విమర్శలు వచ్చాయి. మాడ్యువల్స్ ముద్రణ స్థానంలో పీడీఎఫ్ ఇచ్చినట్లు సమాచారం. తాజాగా... ఏకంగా టీఏ కూడా ఇవ్వకుండా ఎగ్గొట్టడం విమర్శలకు దారి తీసింది.

**ఫిర్యాదులు వచ్చాయి - బీఎన్ శ్రీదేవి, ఇన్‌ఛార్జి పీడీ, ఐసీడీఎస్**జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమానికి హాజరైనందుకు టీఏ రూపంలో డబ్బులు ఇవ్వలేదని తనకు కూడా కొందరు అంగన్‌వాడీల సంఘం నాయకులు మౌఖికంగా ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. శిక్షణ ప్రక్రియ మొత్తం ఎస్ఎస్ఏ యంత్రాంగం చూస్తోంది.

# పునాది దశలోనే ఆగింది

బాపట్ల: బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం పునాది దశలో నిలిచింది. నిర్మాణానికి నాబార్డు రుణాన్ని గత వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. నిధుల కొరతతో గత జూలై నుంచి పనులు ఆగాయి. పీపీపీ విధానంలో కళాశాల భవనాలు నిర్మించి ప్రారంభించాలన్న ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులు తిరిగి పట్టాలెక్కే అవకాశం ఉంది. వైకాపా ప్రభుత్వం 2020 మార్చిలో బాపట్లలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. పట్టణ శివారున జమ్ములపాలెం రోడ్డు 500 పడకల బోధనాసుపత్రి, వైద్య కళాశాల, విద్యార్థుల వసతి గృహాలు, నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి 54 ఎకరాల అసైన్డ్ భూములు కేటాయించింది. రూ.510 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 2021 మే 31న భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2023 డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తి చేసి 2025 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభిస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు.

నిధుల కొరతతో భవనాల నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. వైద్య కళాశాల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.270 కోట్ల రుణం తీసుకున్నారు. నాలుగేళ్లలో కేవలం పునాది దశ వరకు మాత్రమే పనులు చేశారు. రూ.78 కోట్ల విలువైన పనులు చేయగా.. గుత్తేదారుకు రూ.30 కోట్లు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.48 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నాబార్డు రుణాన్ని ఇతర అవసరాలకు వైకాపా ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధుల కొరత ఏర్పడి గతేడాది జూన్ నుంచి పనులు నిలిచాయి. వైద్య కళాశాలను పీపీపీ పద్ధతిలో నిర్మించాలని కూటమి ప్రభుత్వం భావించింది. నీతి ఆయోగ్ ద్వారా నిధులు సాధించటానికి ప్రయత్నాలు ప్రారంభించింది.

కేంద్ర బడ్జెట్లో దేశవ్యాప్తంగా రానున్న ఐదేళ్లలో 75 వేల ఎంబీబీఎస్ సీట్లు పెంచుతామని ప్రకటించారు. ఈ ఏడాది పది వేలు, మిగిలిన నాలుగేళ్లలో మరో 65 వేల సీట్లు పెంచాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం



ఉన్న వైద్య కళాశాలల్లో అదనంగా సీట్లు పెంచటంతో పాటు కొత్త కళాశాల నిర్మాణానికి కేంద్రం నిధులు ఇవ్వనుంది. కొత్త కేంద్ర బడ్జెట్‌తో బాపట్ల వైద్య కళాశాల నిర్మాణానికి నిధులు సాధించే అవకాశం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో కొంత నిధులు కేటాయిస్తే వెంటనే కళాశాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభించవచ్చు. కేంద్ర నిధులు సాధిస్తే రెండేళ్లలో భవనాల నిర్మాణం పూర్తయి వైద్య కళాశాల ప్రారంభమై విద్యార్థులకు వైద్య విద్య సీట్లు అందుబాటులోకి వస్తాయి. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం. వైద్య సేవలకు జిల్లా ప్రజలు 60 కి.మీ. దూరంలోని గుంటూరు లేదా ఒంగోలు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర వైద్యం అందక మార్గమధ్యలో రోగులు, రోడ్డు ప్రమాదాల క్షతగాత్రులు చనిపోతున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో ఓ వైద్య కళాశాల ఉండాలని గతంలో నీతి ఆయోగ్ ప్రతిపాదించింది.

**నిధుల మంజూరుకు కృషి**

బాపట్లలో వైద్య కళాశాల, బోధనాసుపత్రి నిర్మాణ ఆవశ్యకతను కేంద్రానికి వివరిస్తా. కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయించి పునాది దశలో నిలిచిన వైద్య కళాశాల నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా కృషి చేస్తా. ఈ ప్రాంతంలో 500 పడకల బోధనాసుపత్రి వస్తే ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. తెన్నేటి కృష్ణప్రసాద్, ఎంపీ, బాపట్ల

# జలం నిలవాలి జనం మురవాలి

కర్నూలు : ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా జలభగ్నం చేసింది.. నిర్వహణకు పైసా ఇవ్వలేదు.. కేసీ చెదిరింది.. ఎస్సార్బీసీ ఏడిపిస్తోంది.. అలగనూరు కుప్పకూలింది.. గోరుకల్లు లీకేజీ అవుతోంది.. అవుకు అధోగతి పాలైంది.. పెండింగ్ ప్రాజెక్టుల దస్త్రాన్ని అటకెక్కించారు.. తుంగభద్ర, హంద్రీ, కృష్ణమ్మ నదులు పారుతున్నా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేల ఎకరాలు బీళ్లుగా మారాయి.. ప్ర'జల'కు ప్రాధాన్యం ఇచ్చేలా 'కూటమి' ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. జలాశయాల నిర్వహణకు నిధులు విడుదల చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి పూర్తిస్థాయి బడ్జెట్‌ను శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలవనరుల బాగుకు రూ.1,568 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు.

**వీటికి మోక్షం కలిగేనా**

పశ్చిమ ప్రాంతంలో ఆర్డీఎస్, వేదవతి జలాశయాల నిర్మాణానికి గతంలో తెదేపా పునాది వేసింది. 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,942 కోట్లతో వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ఇప్పటివరకు రూ.90 కోట్లు ఖర్చు చేశారు. దీన్ని గత వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది.

కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నియోజకవర్గాలకు నీరందించేలా రూ.1,985 కోట్ల వ్యయంతో ఆర్డీఎస్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రూ.12.60 కోట్ల వరకు వెచ్చించారు. అందుబాటులోకొస్తే 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

సుంకేసుల (రూ.27 కోట్లు)

కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల పరిధిలో 2.65 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు అందించే సుంకేసుల జలాశయానికి రూ.27 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. కాల్వ అధ్వానంగా మారడంతో 1,500 క్యూసెక్కులు ప్రవహించని పరిస్థితి నెలకొంది.సుంకేసుల, అలగనూరు, ముచ్చుమర్రి జలాశయాలకు కలిపి తొలుత రూ.107 కోట్లకు ప్రతిపాదించారు.. ఆ తర్వాత రూ.27 కోట్లకు కుదించారు.

ఎస్సార్బీసీ (రూ.89 కోట్లు)

శ్రీశైలం కుడిగట్టు కాల్వకు గోరుకల్లు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తుంటారు. జలాశయం పనులు పూర్తికాకపోవడంతో 12 టీఎంసీలు నిల్వ చేయని పరిస్థితి నెలకొంది.

గత ఐదేళ్లు నిర్వహణ చేపట్టకపోవడంతో కట్ట కుంగింది. ఈ నేపథ్యంలో రూ.89 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు.

అవుకు (రూ.40కోట్లు)

గత ఐదేళ్లుగా అవుకు జలాశయం నిర్వహణ పనులు చేపట్టలేదు. గేట్ల వద్ద నీటి లీకేజీ కొనసాగుతోంది. గత ప్రభుత్వం పైసా ఇవ్వలేదు.. రెండో విడత పనులకు సంబంధించి రూ.24 కోట్లు గుత్తేదారుకు చెల్లించాల్సి ఉంది.

వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని అవుకు సొరంగం, జలాశయం నిర్వహణకు రూ.40 కోట్ల వరకు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

హంద్రీనీవా (రూ.700కోట్లు)

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాల్వను విస్తరించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మల్యాల నుంచి జీడిపల్లి (0–216 కి.మీ.) వరకు కాల్వ వెడల్పు, లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.700 కోట్లు అవసరమని ఇంజినీర్లు ప్రతిపాదించారు.

ప్రస్తుతం కాల్వలో 1,900 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. విస్తరించి 3,850 క్యూసెక్కులు తరలించనున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గురు రాఘవేంద్ర (రూ.57కోట్లు)తుంగభద్ర దిగువ కాల్వ ఆయకట్టు స్థిరీకరించాలన్న ఉద్దేశంతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా కనీసం విద్యుత్తు బిల్లులు చెల్లించలేదు.. నిర్వహణలేక మోటార్లు సతాయిస్తున్నాయి. వీటిని బాగు చేసేందుకు రూ.57 కోట్లు అవసరమవుతాయి.

శ్రీశైలం (రూ.18కోట్లు)కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టుకు రూ.18 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులతో కొంతవరకు పనులు చేసేందుకు అవకాశముంటుంది, డ్రిప్ ద్వారా నిధులు విడుదలైతే తప్ప పూర్తిస్థాయిలో పనులు చేసేందుకు అవకాశముండదని ఇంజినీర్లు పేర్కొంటున్నారు.

ఎల్లెల్సీ, వేదవతి, ఆర్డీఎస్ రూ: 313 కోట్లు

కేసీ, రాజోలి, జొలదరాశి (235)


గాజులదిన్నె (35)

చెరువుల నిర్వహణ (46)

సిద్ధాపురం ఎత్తిపోతల (8)

# ఉపాధి మేడలు

కర్నూలు : ఐదేళ్ల వైకాపా కాలంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. 'కొత్త ఇసుక విధానం' పేరిట రీచ్‌లను మూసేశారు. ఇసుక అందుబాటులో లేకుండా చేశారు. భవనాలు, ఇళ్ల పనులన్నీ ఆగిపోవడంతో కార్మికులకు నెలల తరబడి ఉపాధి కరవైంది. ఇతర రాష్ట్రాలకు వలస పోయారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వమే అర్ధాకలితో అలమటించేలా చేసింది. కొందరు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కార్మికులకు చేతినిండా పని దొరుకుతోంది. పనుల స్థాయిని బట్టి రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు కూలి లభిస్తోంది. ఏడాదిలో అక్టోబరు నుంచి మే వరకు నిర్మాణాలకు అనుకూల వాతావరణం ఉంటుంది. 'కూటమి' ప్రభుత్వం పల్లె పండగ పేరుతో సిమెంటు దారులు నిర్మిస్తోంది.



ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ.80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1,000, రూ.1,500, రూ.2 వేలకు అందుబాటులో ఉంది. కారుచౌకగా ఇసుక లభిస్తుండటంతో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించారు." నగరంలో మూడు సెంట్లలో ఇంటి నిర్మాణానికి దసరా రోజున శంకుస్థాపన చేశాం.. రూ.40 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు" బ్యాంకు ఉద్యోగి నవీన్ పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ పట్టణాల్లో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు వెచ్చించి ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు అంచనా. ఒక్క కర్నూలు నగరంలోనే గత నెలలో వంద ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు.

**దండిగా ఇసుక నిల్వలు** గతంలో టన్ను రూ.326 ఉండగా.. దాన్ని కూటమి ప్రభుత్వం రూ.320కు తగ్గించింది. ప్రస్తుతం సి.బెళగల్ మండలంలోని డీసిల్టింగ్ పాయింట్లలో టన్ను రూ.202, మరలి ఇసుక రీచ్‌లో రూ.119, గుడికంబాలి రూ.39, నదిచాగిలో రూ.40 నామమాత్రపు ధరకు ఇసుక లభిస్తోంది. ఉమ్మడి జిల్లాలో కార్మికుల సంఖ్య 1,45,350

## పేద రోగులకు కొండంత సాయం



అమరావతి : ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఇమ్యునో ఫ్లోరోసెన్స్ మైక్రో స్కోపీ. ఇది మూత్రపిండాలు..చర్మ సంబంధిత వ్యాధులను నిర్ధారిస్తుంది. ఇప్పటివరకు గుంటూరు జీజీహెచ్‌లో ఇది లేక నెఫ్రాలజీ, స్కిన్ విభాగాలకు వచ్చే పేషెంట్ల నుంచి ముక్క(బయాప్సీ) తీసి హైదారాబాద్ పంపి పరీక్షలు చేయించేవారు. ఇందుకోసం జీజీహెచ్‌కు సాలీనా రూ.లక్షలు ఖర్చయ్యేది. నెలకు సగటున నెఫ్రాలజీ విభాగం నుంచి 5-6, స్కిన్ విభాగం నుంచి 12-15 శాంపిళ్లు వచ్చేవి. వీటిని బయటకు పంపి పరీక్షలు చేయించడానికి ఆలస్యమయ్యేది. కిడ్నీ వ్యాధుల నిర్ధారణకు ఖరీదైన రియోజన్స్ వాడతారు. ఒక లీటర్ రియోజన్స్ ద్రావకం ఖరీదు రూ.40 వేల దాకా ఉంటుంది. ఈ పరీక్షకు కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులు రూ.25 వేల దాకా ఛార్జి చేస్తాయి. కొందరికి చర్మంపై అంతుచిక్కని మచ్చలు వస్తాయి. వైద్య పరిభాషలో వాటిని బుల్లస్ లిజిన్స్ అంటారు. అది ఎందువల్ల వచ్చిందో ఈస్కోపీ కచ్చితంగా నిర్ధారిస్తుంది. ఎంతో ప్రయోజనకరమైన యంత్రాన్ని దాత ఒకరు రూ.10 లక్షల వెచ్చించి అందజేశారు. ఇకమీదట జీజీహెచ్ రోగులకు బయాప్సీ పరీక్షలు వైద్యకళాశాల పెథాలజీ విభాగమే చేసి రిపోర్టులు ఇస్తుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు మహర్దశ పట్టుకుంది. దేశ, విదేశాల్లో స్థిరపడిన అనేక మంది వైద్యులు విరాళాలిచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. న్యూరాలజీ వైద్యంలో విశేషానుభవం కలిగిన ఆచార్య సుందరాచారిని ప్రభుత్వం రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా నియమించడం విరాళాలు రావడానికి మరింత తోడయిుంది. ఆయన వద్ద వైద్య మెలకువలు నేర్చుకున్న వారు, సన్నిహితులు కళాశాల అభివృద్ధికి సాయం చేస్తున్నారు. నగదు, వస్తు, వైద్య పరికరాల రూపాల్లో ఇవి అందుతున్నాయి. క్లిష్టతరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడానికి పరికరాలు ఇస్తుండడంతో రోగులకే కాదు వైద్య విద్యార్థులకు ప్రయోజనం కలుగుతోంది. మనం చూస్తున్నది కారియో టైపింగ్ మిషన్. రాష్ట్రంలోని బోధనాసు పత్రుల్లో ఎక్కడా లేదు. రూ.అరకోటికి పైగా విలువ చేసే మిషన్‌ను యూఎస్‌లో ఉంటున్న వైద్యురాలొకరు కొనుగోలు చేసి కళాశాలకు అందజేశారు. ఇది జన్యుపరంగా వచ్చే వ్యాధులను ముందుగానే పసిగడుతుంది. క్రోమోజోమ్స్‌ను మ్యాపింగ్ చేసి ఈ పరీక్ష చేస్తారు. జన్యుపరంగా ఇంట్లో పెద్దలకున్న వ్యాధులు కొన్ని పిల్లలకు వస్తాయి. బ్లడ్ క్యాన్సర్ తదితరాలు ఈ కోవలోకి వస్తాయి. పెద్దల నుంచి పిల్లలకు రాకుండా ముందుగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. వైద్య పరిభాషలో దీన్ని బ్రాకా అని పిలుస్తారు. జన్యుపరంగా పిల్లలకు ఏ జీన్ వల్ల వస్తుందో గుర్తించి దాన్ని తొలగించి ముందుగానే వ్యాధి రాకుండా నియంత్రించుకోవచ్చని వైద్యులు తెలిపారు. ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష.

## వైకాపా ఇచ్చిన పట్టాలు మాకొద్దు.. వెనక్కి తీసుకోండి

అమరావతి: పేదలకు గత వైకాపా ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో మేం ఇళ్లు కట్టుకోలేదు. అవి ఊరికి దూరంగా ఉన్నాయి. నివాసయోగ్యంగా లేవని కొందరు.. చెరువులు, శ్మశానవాటికల పక్కన ఇస్తే అక్కడెవరుంటారని మరికొందరు లబ్ధిదారులు.. అధికారులను కలిసి ఆ పట్టాలను రద్దు చేయాలని కోరుతున్నారు. అప్పట్లో మా పేరు మీద ఇచ్చిన పట్టాలను వెనక్కి ఇచ్చేస్తాం.. కూటమి ప్రభుత్వం ఇచ్చే స్థలం తీసుకుంటామంటూ అర్జీలు ఇస్తున్నారు. గతంలో ఇళ్ల స్థలాలను అర్హులే పొందారా? అనర్హులున్నారా? అన్న అంశంపై అధికారులు సర్వే చేయిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయికి వెళ్లిన సచివాలయ, మున్సిపల్ ఉద్యోగుల ఎదుట చాలామంది లబ్ధిదారులు తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఇలాంటి వినతులు మిగిలిన పట్టణాలతో పోలిస్తే గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కువగా వస్తున్నాయి. వీరికి ఏం చెప్పాలో తెలియక అధికారులు ఎలాంటి హామీ ఇవ్వడం లేదు.తాము అధికారంలోకి వస్తే ఇళ్లు లేని పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల చొప్పున స్థలాలు ఇస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. గతంలో



వైకాపా హయాంలో పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున స్థలాలిచ్చారు. సెంటు స్థలంలో నిర్మించే ఇల్లు నివాసానికి ఏమాత్రం అనువుగా ఉండదని లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. పైగా నివాస యోగ్యంకాని ప్రాంతాల్లో ఇవ్వడంతో చాలామంది ఇళ్లను నిర్మించుకోలేదు. వీరి విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు వెలువడలేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతానికైతే గతంలో పట్టాలు పొందినవారిలో అనర్హులను మాత్రమే గుర్తిస్తున్నామన్నారు. గుంటూరు నగరానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలోని పేరేచర్ల, కొర్నెపాడు లేఔట్లు పొలాల్లో ఉన్నాయి. ఇక్కడ నివసించడం కష్టమని అత్యధిక లబ్ధిదారులు అసంతృప్తితో పట్టాలను వెనక్కి ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. లాం వద్ద లేఔట్‌పైనా ఇదే పరిస్థితి. అంత దూరం నుంచి నగరంలోకి రావాలంటే రెండు ఆటోలు మారాలని, ప్రయాణ వ్యయం ఎక్కువవుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంతమందైతే నేతలతో సిఫార్సు చేయించుకుని అర్జీలిస్తున్నారు.

## కరవు సీమపై కరుణ చూపేనా?



అనంతపురం : ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఉమ్మడి అనంతను ప్రగతి వైపు నడిపించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సాగునీరు, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా గతేడాది నవంబరులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.1867 కోట్లు కేటాయించింది. వైకాపా ప్రభుత్వం పక్కనపెట్టేసిన పేరూరు, బైరవానితిప్ప ప్రాజెక్టులను మళ్లీ గాడిలో పెట్టాల్సి ఉంది. రైతులకు రాయితీ అందించే పథకాలకు నిధుల కేటాయింపులు పెరగాలి. జిల్లాకు చెందిన పయ్యావుల కేశవ్ ఆర్థికమంత్రిగా ఉండటంతో బడ్జెట్‌పై అనంత జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

**ఉన్నత విద్యలో రాణించాలంటే..**

కొన్నేళ్లుగా జేఎన్టీయూ, ఎస్కేయూలకు నిధుల విషయంలో అన్యాయం జరుగుతోంది. ఏటా రెండింటికి కలిపి రూ.150 కోట్లకు మించి ఇవ్వడం లేదు. ఇవి జీతాలకే సరిపోతున్నాయి.

**ఉద్యానానికి ఊతమిస్తేనే..**

ఉమ్మడి జిల్లాలో అరటి, మామిడి, మిరప, చీని, టమాటా, వక్క, దానిమ్మను 1,51,876 హెక్టార్లలో పండిస్తున్నారు. ప్రస్తుతం 31.2 లక్షల టన్నుల ఉత్పత్తి సాధిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో 38.2 లక్షల టన్నులకు పెంచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.

**ఆసుపత్రుల నిర్వహణకు..**

ఉమ్మడి జిల్లాలో జీజీహెచ్, జిల్లా ఆసుపత్రి, వైద్యకళాశాల, 6 ప్రాంతీయ ఆసుపత్రులు, 14 సీహెచ్‌సీలు, 86 పీహెచ్‌సీలు ఉన్నాయి. చాలావాటిల్లో ఇప్పటికీ తగిన సదుపాయాలు లేవు. అనంతపురంలో మాతా, శిశు కేంద్రం, పెనుకొండ వైద్య కళాశాల నిర్మాణానికి నిధులు వస్తేనే పనులు ముందుకు సాగే పరిస్థితి నెలకొంది.

**బిందుసేద్యం స్పష్టత రానుందా..!**

గతేడాది ఉమ్మడి జిల్లాలో 67 వేల హెక్టార్లలో బిందుసేద్యం చేయాలని లక్ష్యం విధించగా 30 వేల హెక్టార్లకే అనుమతులు ఇచ్చారు. వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం మాత్రమే రాయితీ అందుతోంది. 90 శాతం రాయితీ ఇవ్వాలనే డిమాండ్ ఉంది. దీనిపై బడ్జెట్‌లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

**పెండింగ్ ప్రాజెక్టులు పట్టాలెక్కాలి**

తెదేపా ప్రభుత్వం 2018లో చేపట్టిన జీడిపల్లి-పేరూరు, జీడిపల్లి-బైరవానితిప్ప ప్రాజెక్టులను వైకాపా ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసింది. జీడిపల్లి-పేరూరుకు అప్పట్లోనే రూ.803 కోట్లు కేటాయించారు. ఇప్పుడు అంచనా వ్యయం రూ.900 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. జీడిపల్లి-బైరవానితిప్ప ప్రాజెక్టుకు అప్పటి తెదేపా సర్కారు రూ.968 కోట్లు కేటాయించి ప్రధాన కాలువ పనులు చేపట్టింది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే సుమారు లక్ష ఎకరాలకు నీరు అందించవచ్చు. మడకశిర బ్రాంచి కెనాల్‌కు సంబంధించి రూ.730 కోట్లతో గత తెదేపా ప్రభుత్వం 90 శాతం పనులు పూర్తిచేసింది. వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రూ.214 కోట్ల అంచనాతో బైపాస్ కెనాల్ నిర్మాణానికి జీవో జారీ చేశారు. ఈ బడ్జెట్‌లో మడకశిర బ్రాంచి కెనాల్‌కు నిధులు కేటాయించాలి.

**పరిశ్రమలకు పెద్దపీట అవసరం**

జగన్ పాలనలో ఉమ్మడి జిల్లాలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదు. కూటమి ప్రభుత్వం రాగానే పెనుకొండ, మడకశిర ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించేందుకు భారత్ ఫోర్జ్, కియా అనుబంధ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఎంఎస్‌ఎంఈల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పారిశ్రామికవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది.

## విరబూసిన పూత.. దిగుబడిపై ఆశ



అనంతపురం : ఈ ఏడాది విభిన్న వాతావరణ పరిస్థితులతో మామిడి పంట ఆశాజనకంగా ఉంది. పూత కాస్త ఆలస్యంగా విరబూసింది. దిగుబడులు బాగా పెరిగి మంచి ధరలు వస్తాయని అటు అన్నదాతలు, ఇటు ఉద్యానశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పుట్టపర్తి, కొత్తచెరువు, తనకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, గుత్తి, కంబదూరు తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. చీనీ తర్వాత మామిడి సాగు రెండో స్థానంలో ఉంది. గతేడాది అధిక వర్షాలతో పంట పూత ఆలస్యమైంది. నవంబరు, డిసెంబరు నెలల్లో పూత రావాల్సి ఉంది. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయ దశల్లో ఉంది. హెక్టారుకు 10 టన్నుల దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. ఢిల్లీ, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బళ్లారి తదితర ప్రాంతాలకు మామిడి ఎగుమతి అవుతుంటుంది.

**పక్వ దశలోనే కోతలు:** కాయ పక్వ దశకు వచ్చినప్పుడే కోయాలి. ఆరు సెంటీమీటర్లు తొడిమి ఉండేలా ఉదయం వేళల్లో కోస్తే మంచిది. హార్వెస్టర్లు వినియోగిస్తే కాయలు దెబ్బతినవు. కోతకు 40 రోజుల ముందే నీటి తడులు ఆపేయాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సహజ సిద్ధంగా మాగబెడితేనే..**

బేనీషా, మల్లికా, తోతాపురి, అల్ఫన్‌షో, బెంగళూరు, నీలిమా తదితర రకాలు సాగులో ఉన్నాయి. కాయలు మాగబెట్టేందుకు వ్యాపారులు కార్బైడ్ వాడుతున్నారు. దీంతో పండ్లు నిగనిగలాడుతాయి. కాయల లోపల మాత్రం తెల్లగానే ఉంటుంది. పండ్లకు కార్బైడ్ వాడకం ప్రమాదకరం కావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిషేధించాయి. ప్రధానంగా రైపెనింగ్ ఛాంబర్లలో మాగబెట్టాలి. సహజ సిద్ధంగా వరిగడ్డిలో మాగబెడితే మరీ మంచిది.

**కవర్ల వాడకంతో మరింత నాణ్యత**–నరసింహారావు, ఉప సంచాలకులు, ఉద్యానశాఖ

ఈ ఏడాది ఉద్యానశాఖ ద్వారా మామిడి కాయలకు 50 శాతం రాయితీతో కవర్లు అందించి ప్రోత్సహిస్తున్నాం. హెక్టారుకు రూ.10 వేలు ఇస్తున్నాం. వీటి ద్వారా కాయలు నాణ్యతతో పాటు చీడపీడలు నివారణకు తోడ్పడుతుంది. ఎండకు కాయలు చీలిక రాకుండా నివారిస్తోంది. కాయ సహజ రంగు కోల్పోదు. మంచి ధర దక్కుతుంది. సాగు చేసిన ప్రతి రైతుకు కవర్ల రాయితీ వర్తిస్తుంది. ఇందుకు ఆయా డివిజన్లలో ఉద్యానాధికారులకు సంప్రదించవచ్చు.

ఉమ్మడి అనంత జిల్లాలో సాగు ఇలా..

| | |
|---|---|
| సాగు విస్తీర్ణం | 55 వేల హెక్టార్లు |
| కాపుకొచ్చిన పంట | 42 వేల హెక్టార్లు |
| దిగుబడి అంచనా | 4.20 లక్షల టన్నులు |
| తాజా మార్కెట్ ధర | టన్ను రూ.1.10 లక్షలు |

## అసైన్డ్ భూముల్లో రియల్ దందా



అనంతపురం : గుత్తి పురపాలికతోపాటు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులు అసైన్డ్‌భూముల్లో దందా సాగిస్తున్నారు. రూ.150 కోట్లు విలువైన సర్కారు స్థలాలు చేతులు మారుతున్నాయి. కొందరు రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థిరాస్తి వ్యాపారులతో కుమ్మక్కు అవుతూ దందాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా తాడిపత్రి రోడ్డు, కొత్తూరు, తురకపల్లిరోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రైవేట్ లేఅవుట్‌లు... మిగిలిన చోట్ల ప్రభుత్వ భూములు ఉన్నాయి.

**తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ..**

గుత్తి పట్టణంతోపాటు శివారులోని అసైన్డ్‌భూములను లబ్ధి పొందుతున్న వారి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ.. వెంచర్లు వేస్తూ రూ.కోట్లు కూడగట్టుకుంటున్నారు. గుత్తిలోని సర్వేనంబరు 725లో నాలుగు ఎకరాల అసైన్‌భూమిని కొనుగోలు చేసి.. లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించారు. సెంటు స్థలాన్ని రూ.1లక్ష నుంచి 2లక్షలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. సర్వేనంబరు 728లో రెండు ఎకరాల అసైన్డ్‌భూమిలో లేఅవుట్ వేసి రూ.లక్షలు దండుకున్నారు. 644లో మూడు ఎకరాలు, 590లో ప్రభుత్వ భూమిలో రియల్ దందా సాగించి దండుకున్నారు. ఓ ప్రజాప్రతినిధి కుమారుడు నేమితాబాదు సమీపంలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో వెంచర్ వేసి.. జేబు నింపుకొన్నాడు. కరిడికొండ పంచాయతీ పరిధి బాచుపల్లిలో ఓవైకాపా నాయకుడు, ప్రజాప్రతినిధి సర్వేనంబరు 848లో 5ఎకరాల అసైన్డ్‌భూమిని ఒకరి నుంచి రూ.22 లక్షలకు కొనుగోలు చేసి.. ప్లాట్లువేసి విక్రయానికి పూనుకున్నాడు. అదే గ్రామంలోని 188,179 సర్వేనంబర్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది.

**క్రయవిక్రయాలు చేస్తే చర్యలు తప్పవు- ఓబిలేశు, తహసీల్దారు**

అసైన్డ్‌భూములను క్రయవిక్రయాలు చేయకూడదు. ప్రభుత్వ భూముల్లో స్థిరాస్తి వ్యాపారానికి సంబంధించి పరిశీలించి చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూస్తాం.

## గురుకులాలు.. సరస్వతీ నిలయాలు

పర్చూరు : గురుకులాలు సరస్వతీ నిలయాలుగా నిలుస్తున్నాయి. వీటిల్లో చేరేందుకు ఎన్నడూ లేనంతగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025-2026 విద్యాసంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాగా ఈనెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అర్జీలు స్వీకరిస్తున్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు మార్చి 6 చివరి తేదీ కాగా ఏప్రిల్ 6న ప్రవేశపరీక్ష జరగనుంది. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది మండలాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు ఉండగా 1280 సీట్లు ఖాళీగా ఉన్నాయి. బాలురకు రెండు, బాలికలకు ఆరు పాఠశాలలు, కళాశాలలు అనుబంధంగా ఉన్నాయి. ఒక్కొక్క పాఠశాలలో ఐదో తరగతికి 80, ఇంటర్మీడియట్‌కు 80 సీట్లుగా ఖాళీగా ఉన్నాయి. వీటిలో 75శాతం సీట్లు షెడ్యూల్డ్ కులాలకు, 12శాతం(బీసీ-సీ), 6శాతం(ఎస్టీ), 5శాతం(బీసీ), 2శాతం ఇతరులకు కేటాయిస్తారు. ఆయా తరగతులకు సంబంధించి ఇప్పటికే 1600 దరఖాస్తులు చేరినట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యాలయాల సమన్వయకర్తలు తెలుపుతున్నారు.

**జిల్లాలోని గురుకుల పాఠశాలలు**

బాలికలు: బాపట్ల, నరసాయపాలెం, రేపల్లె, అద్దంకి, పర్చూరు, యద్దనపూడి పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి.

బాలురకు: చుండూరు, నిజాంపట్నం పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ



తరగతి చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతికి, పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు.

**మెరుగైన వసతులు కల్పిస్తున్నాం**

ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన నాణ్యమైన భోజనం, వసతి కల్పిస్తున్నాం. విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్ ఉచితంగా అందిస్తున్నాం. నాణ్యమైన విద్యతోపాటు పరిపూర్ణ వికాసం కోసం క్రీడలు, సంగీతం, నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నాం. ప్రత్యేకించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోచింగ్ ఇస్తున్నాం. విద్యార్థినుల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. ఈ అవకాశాలను పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. కె.పద్మజ, జిల్లా కో-ఆర్డినేటర్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు

## పింఛన్లకూ బదిలీలు

విజయవాడ : రొంపిచర్లకు చెందిన లక్ష్మీ భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో విజయవాడలో ఉంటున్న కుమార్తె తల్లిని తన వద్ద ఉంచి బాగోగులు చూసుకుంటున్నారు. దీంతో ఆమె పింఛను తీసుకునేందుకు ప్రతి నెలా స్వగ్రామానికి రావాల్సి వస్తోంది. వయసు మీద పడటంతో కూతురు, మనవడు ఎవరో ఒకరిని తోడు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రతి నెలా రావడంతో తీసుకునే పింఛను నగదు కొంత ఖర్చులకే సరిపోతుంది. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీన ఠంచనుగా పింఛను అందజేస్తోంది. నెలలో మొదటి తేదీ సెలవు వస్తే ముందు నెల చివరి రోజే పింఛను నగదు లబ్ధిదారులకు చేరేలా చూస్తోంది. దీంతో దూర ప్రాంతాల్లో ఉంటున్న కొందరు లబ్ధిదారులు వ్యయప్రయాసలకోర్చి సొంతూళ్లకు రావాల్సి వస్తోంది. ఇలాంటి ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టిసారించింది. లబ్ధిదారులు తాము కోరుకున్న చోటుకు పింఛను బదిలీ చేసుకునే అవకాశాన్ని సచివాలయాల ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది.

**ఇలా చేయాలి**

ఎన్టీఆర్ భరోసా పింఛను బదిలీ చేయించుకోవాలనుకునే లబ్ధిదారులు గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేయాలి. పింఛను వెబ్‌సైట్‌లో దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక ఆప్షన్ ఇచ్చింది. పింఛను ఐడీ, ఏప్రాంతానికి బదిలీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంతం చిరునామా ఇవ్వాలి. నివాసం ఉంటున్న జిల్లా, మండలం, గ్రామసచివాలయం పేర్లను పేర్కొనాల్సి ఉంటుంది. దీనివల్ల స్వగ్రామానికి రాలేని వారు ప్రస్తుతం ఉంటున్న ప్రాంతంలో పింఛన్లు తీసుకోవటానికి దోహద పడుతుందని రొంపిచర్ల ఎంపీడీవో మాథ్యూబాబు తెలిపారు.

## అపరాల ధరలు.. నేలచూపులు

చెరుకుపల్లి : నూర్పిళ్లు మొదలై పంట ఉత్పత్తులు అమ్ముకొనే సమయంలో ధరలు పతనమై రైతులను దిగాలు పడేలా చేస్తున్నాయి. రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది దాదాపు 32 వేల ఎకరాల్లో అపరాలు సాగు చేశారు. కొద్ది మంది మాత్రమే అపరాలు గిట్టుబాటు కావటం లేదని మొక్కజొన్న వైపు మొగ్గు చూపారు. గూడవల్లి, నడింపల్లి ప్రాంతాల్లో పెసర నూర్పిళ్లు పూర్తయి, పంట ఉ



త్పత్తులు ముమ్మరంగా మార్కెట్‌కు రావటం ప్రారంభమయ్యాయి. ఆరంభంలోనే ధరలు రైతులను నిరాశకు గురిచేశాయి. గత రబీలో మినుములు ప్రారంభ ధర క్వింటాలుకు రూ.8800, పెసలు రూ.8500 ఉండగా ఈ సంవత్సరం క్వింటా మినుములు రూ.7900, పెసలు రూ.7300 మించి ధర పలకటంలేదు. కేంద్ర ఈ యేడు మద్దతు ధరగా మినుముకు రూ.7400, పెసలుకు రూ.8650 ప్రకటించింది. గిట్టుబాటు ధర కాకపోయినా మినుముకు మాత్రం మద్దతు ధరకన్నా నాలుగైదు వందలు అధికంగా లభిస్తున్నా పెసలుకు మాత్రం మద్దతు ధరకన్నా క్వింటాలుకు రూ.1350 తక్కువగా వ్యాపారాలు జరుగుతున్నాయి. మరి కొద్దిరోజుల్లో నూర్పిళ్లు ముమ్మరంగా సాగి సరకు మార్కెట్‌ను ముంచెత్తే అవకాశం ఉంది. పెసలు త్వరగా పుచ్చుపట్టే అవకాశాలున్న దృష్ట్యా రైతులు నూర్పిళు కాగానే విక్రయాలు చేసే పరిస్థితి ఉండటంతో పెసల ధర మరింత దిగజారవచ్చని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చురకలు



## కాజోల్ నటవారసురాలిని చూశారా?

ఐదేళ్ల క్రితం నైసా వేరు.. ఇప్పటి నైసా వేరు! ఇంత నైసుగా ఎలా మారిందో కానీ, ఇటీవల నటవారసురాలి ఫోటోషూట్ల దూకుడు అమాంతం పెరిగింది. ప్రతి ఈవెంట్లోను తల్లి కాజోల్ తో పోటీపడి ఫోటోగ్రాఫర్స్ కి ఫోజులిస్తోంది. మమ్మీని మించి నైసా నైసుగా దర్శనమిస్తోంది. తనతో కలిసి ఈవెంట్లలో బోలెడంత సందడి చేస్తోంది. అది పెళ్లి వేడుక లేదా సినిమా ఈవెంట్, లేదా ఇంకేదైనా కానీ కాజోల్ తో పాటు నైసా దేవగన్ కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే నైసా దేవగన్ గ్లామరస్ వేషధారణలు వెబ్ లో వైరల్ గా మారుతున్నాయి. నేటి జెన్ జెడ్ నటవారసురాళ్లతో పోటీపడుతూ ఈ బ్యూటీ అందాలను



ఆరబోస్తోంది. తాజాగా నైసా దేవగన్ కొత్త అవతారంలో కనిపించింది. పదహారణాల దేశీ గాళ్ లా పట్టు పరికిణీలో గుబులు రేపింది. ఎరుపు, గోల్డ్ మిశ్రమ రంగు పరికిణీ దానికి కాంబినేషన్ గా బిస్కెట్ కలర్ టాప్ ధరించి మెడలో కాంబినేషన్ వజ్రాల హారం ధరించి నైసా ధగ ధగా మెరిసిపోతోంది. 22 ఏళ్ల నైసా అందచందాలు మైమరిపిస్తున్నా యి. ఈ లుక్ చూడగానే నైసా నైసుగుందమ్మా! అంటూ అభిమానులు తన అందాన్ని పొగిడేస్తున్నారు. ఇదే హుషారులో నైసా సినీ ఎంట్రీ ఇస్తుందని ఊహిస్తున్నారు. ఇప్పటి వరకూ కాజోల్– అజయ్ దేవగన్ తమ కుమార్తె సినీఎంట్రీ గురించి ఎలాంటి హింటూ ఇవ్వలేదు. ఇటీవల నైసా దేవగన్ తన తల్లిదండ్రుల అడుగుజాడల్లో నడుస్తూ నటిగా మారా లని కోరుకోవడం లేదని కాజోల్ వెల్లడించడం నిరాశ కలిగించింది. ప్రస్తుతానికి నైసా స్టడీస్ పైనే దృష్టి సారిస్తోందని సమాచారం.

## తమన్నా లక్... రెండు దశాబ్దాలైనా రచ్చే

మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు అవుతుంది. 2005 సంవత్సరంలో హిందీ మూవీ చాంద్ సా రోషన్ చెహ్రా, తెలుగు సినిమా 'శ్రీ' తో సినీ కెరీర్‌ను ప్రారంభించింది. మొదటి ఏడాదిలో లక్ కలిసి రాలేదు. సినిమాలు పెద్దగా విజయాన్ని సొంతం చేసుకోలేదు. ఆ తర్వాత ఏడాది కూడా కలిసి రాలేదు. 2007లో నటించిన హ్యాపీ డేస్ సినిమా తర్వాత మిల్కీ బ్యూటీ తమన్నాకు వెనక్కి తిరిగి చూసుకునే అవసరం రాలేదు. తెలుగులో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేస్తూ వచ్చింది. టాలీవుడ్ స్టార్ హీరోల అందరితోనూ సినిమాలు చేసిన ఘనత ఈ అమ్మడికి దక్కింది. యంగ్ స్టార్ హీరోలతోనే కాకుండా చిరంజీవి, వెంకటేష్ వంటి సీనియర్ స్టార్స్‌తోనూ ఈ అమ్మడు నటించింది. సాధారణంగా హీరోయిన్స్ దశాబ్ద కాలం పాటు బిజీగా కొనసాగితే గొప్ప విషయం. కానీ ఈ అమ్మడు రెండు దశాబ్దాలు అయినా కెరీర్ ఏ మాత్రం జోరు తగ్గలేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడి జోరు తగ్గింది. కానీ నార్త్ ఇండియాలో ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. సినిమాలనే కాకుండా



వెబ్ సిరీస్‌లు, మ్యూజిక్ వీడియోలు, ఐటెం సాంగ్స్ ఇలా చాలా విధాలుగా ప్రేక్షకులకు చేరువ అవుతూ వస్తోంది. మిల్కీ బ్యూటీ తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌లో ఏకంగా అయిదు సినిమాలు చేస్తోంది. అందులో రెండు పెద్ద సినిమాలు కావడం విశేషం. బాలీవుడ్ యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్ర హీరోగా నటిస్తున్న వ్యన్ సినిమాలో హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్న విషయం తెల్సిందే. దీపక్ మిశ్రా దర్శకత్వంలో భారీ అంచనాల నడుమ రూపొందుతున్న 'వ్యన్' సినిమాపై తమన్నా చాలా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఈ అమ్మడి సినిమాలు బాలీవుడ్‌లో చాలా విడుదల అయ్యాయి. కానీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్‌లు దక్కించుకోలేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాలతో సక్సెస్‌ను దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే ఈ అమ్మడు రైడ్ 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాలో మిల్కీ బ్యూటీ తమన్నా పాత్ర గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి రెండు దశాబ్దా లు అయినా కూడా కెరీర్‌లో ఏమాత్రం తగ్గకుండా ఓ రేంజ్‌లో దూసుకు పోతున్న మిల్కీ బ్యూటీ ఎంతో మందికి ఆదర్శం. ఒక్క భాషపై నమ్మకం పెట్టుకోకుండా, ఒకే ఇండస్ట్రీలో సినిమాలు చేస్తూ ఉండకుండా అన్ని భాషల్లో సినిమాలు చేయడం ద్వారా ఒకచోట కాకున్నా మరో చోట అయినా ఆఫర్లు ఎప్పుడూ ఉంటాయి అనేది తమన్నాను చూస్తే అర్థం అవుతుందని ఇండస్ట్రీ వర్గాల వారు కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలోనూ తమన్నాకు ఉన్న క్రేజ్ ఏంటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ క్రేజ్‌కు తగ్గట్లుగానే మిల్కీ బ్యూటీ తమన్నా రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఆ అందమైన ఫోటోల కారణంగా కూడా తమన్నాకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వస్తూ ఉంటాయి. మరో దశాబ్ద కాలం పాటు మిల్కీ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా సినిమాలు చేసే అవకాశం ఉంది. అదృష్టం అంటే తమన్నాదే అంటూ ఆమె ఫ్యాన్స్ కామెంట్ చేస్తూ ఉంటారు.





## సర్ ప్రైజ్ ఇవ్వబోతున్న బిగ్ స్టార్



నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2 – తాండవం' షూటింగ్‌లో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. అఖండ సృష్టించిన ప్రభంజనం తర్వాత ఈ కాంబో నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. టైటిల్ వీడియో విడుదలైనప్పటి నుంచే మూవీపై క్రేజ్ మామూలుగా లేదు. బాలయ్య మాస్ యాటిట్యూడ్, బోయపాటి మాస్ ట్రీట్‌మెంట్ మళ్లీ ప్రేక్షకులను థియేటర్లవైపు రప్పించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతలోనే అఖండ 3కి సంబంధించిన ఆసక్తికర రూమర్స్ తెగ వైరల్ అవుతున్నాయి. అఖండ 2 పూర్తి కాగానే అఖండ 3 ప్రీ–ప్లానింగ్ మొదలైనట్టు టాక్. ఇప్పటికే బాలీవుడ్ స్టార్స్‌తో కూడిన విలన్ క్యారెక్టర్‌లను ఫిక్స్ చేయాలనే ఆలోచన బోయపాటి టీం చేస్తున్నట్టు సమాచారం. అఖండ 2లో సంజయ్ దత్ పాత్ర మేజర్ అట్రాక్షన్ కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు అఖండ 3 కోసం సన్నీ డియోల్ పేరూ గట్టిగా వినిపిస్తోంది. లేటెస్ట్ గా అఖండ 2 సినిమా జార్జియాలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ షెడ్యూల్‌కు స్పెషల్ ఆకర్షణగా బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ జాయిన్ అవుతున్నారట. అయితే అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, సన్నీ డియోల్ ఈ సినిమాలో కేవలం గెస్ట్ రోల్‌లో మాత్రమే కనిపించబోతున్నారని తెలుస్తోంది. పూర్తి లెంగ్త్ విలన్ రోల్ అనుకోకుండా, ఒక కీలకమైన చిన్న పాత్రలో ఫుల్ పవర్ ప్యాక్ గెస్ట్ అప్పియరెన్స్ ఇవ్వనున్నారని సమాచారం. సన్నీ డియోల్ పాత్ర గురించి కొన్ని రిపోర్ట్స్ ప్రకారం, ఆయన గెస్ట్ రోల్ అఖండ ఫ్రాంచైజీలో మూడో భాగానికివేదిగా మారే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, సన్నీ డియోల్ అఖండ యూనివర్స్‌లో ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకుల్లో మంచి ఉత్సాహాన్ని రేపుతోంది. సన్నీ డియోల్ తన లేటెస్ట్ చిత్రం 'జాట్'తో బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపుతున్నారు.
100 కోట్ల క్లబ్‌లో చేరిన ఈ సినిమా విజయంతో సన్నీ డియోల్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. ఈ హవాలో అఖండ 2లో గెస్ట్ రోల్ చేయడం ఆయన కెరీర్‌కు మరింత బూస్ట్ ఇచ్చేలా చేస్తుందా అనే ఆసక్తి అందరిలో ఉంది. మొత్తం మీద అఖండ 2లో సన్నీ డియోల్ గెస్ట్ రోల్ సినిమాకు అదనపు మసాలా జోడించనుంది. బాలయ్య పవర్, బోయపాటి మాస్ ట్రీట్‌మెంట్‌తో కలిసి సన్నీ సర్ప్రైజ్ అప్పియరెన్స్ ప్రేక్షకులకు ఫుల్ కిక్ ఇచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మరి అధికారిక వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయో చూడాలి.

## నా ఎత్తుతో సమస్య... చాలా బాధ వేసేది : మీనాక్షి చౌదరి





గత ఏడాది 'లక్కీ భాస్కర్', ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో నటించి సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో ఒడిదుడుకులు ఎదుర్కొంది. తెలుగులో మొదటి సినిమా 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' నిరాశపరచడంతో ముందు ముందు ఆఫర్లు వస్తాయా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ లక్కీగా ఈ అమ్మడికి ఆ సినిమా కారణంగా ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ తర్వాత హిట్ 2, గుంటూరు కారం సినిమాల్లో నటించే అవకాశం దక్కింది. గత ఏడాదిలో చాలా సినిమాలు చేసిన ఈ అమ్మడు లక్కీ భాస్కర్‌తో మాత్రమే హిట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు నవీన్ పొలిశెట్టితో కలిసి అనగనగా ఒక రాజు సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్ ఆరంభం గురించి, తన బాల్యం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... చిన్నతనంలో ఇతరులతో మాట్లాడేందుకు చాలా ఇబ్బంది పడేదాన్ని. కాలేజ్ రోజుల్లోనే నా ఎత్తు 6.2 ఉండేది. దాంతో చాలా మంది అమ్మాయిలతో పోల్చితే నేను చాలా ఎత్తుగా ఉండేదాన్ని. దాంతో అంతా నాకు దూరంగా ఉ ండేవారు, నా ఎత్తు నాకు పెద్ద సమస్యగా అనిపించింది. ఆ సమయంలో చాలా బాధ వేసింది. ఆర్మీ ఆఫీసర్ అయిన మా నాన్నకు ఆ విషయం గురించి చెప్తే నీ సమస్యను నువ్వే పరిష్కరించుకోవాలని సూచించాడు. దాంతో నేను బుక్స్‌ను స్నేహితులుగా చూడటం చేశాను. ఎక్కువ బుక్స్ చదవడంతో పాటు, అందాల పోటీల్లో పాల్గొనేందుకు, ఆటలపై ఆసక్తి కలిగింది. సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో నిరాశే మిగిలింది. అయితే వచ్చిన ప్రతి ఆఫర్ కూడా నేను సాధ్యం అయినంత వరకు కష్టపడి సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమా కారణంగానే నాకు ఖిలాడీ సినిమాలో నటించే అవకాశం దక్కింది. కనుక ఇండస్ట్రీలో ప్రతి చిన్న ఆఫర్ కూడా కచ్చితంగా ముందు ముందు కెరీర్ నిలదొక్కుకునేందుకు సహాయపడుతుందని భావిస్తున్నాను. సీనియర్ హీరోలతో నటించడం ఏంటి అంటూ చాలా మంది నన్ను ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి హీరోతో అయినా నటించేందుకు నాకు ఇబ్బంది లేదు. సీనియర్ హీరోలతో నటించడం అనేది ఒక జోనర్ సినిమాగా భావిస్తాను.

వెంకటేష్ గారితో సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నటించడం అనేది చాలా కంఫర్ట్‌బుల్‌గా అనిపించింది. ఆయనతో వర్క్ చేయడంను ఎంజాయ్ చేశాను. ఇప్పుడు చిరంజీవి గారి సినిమా విశ్వంభరలోనూ నటిస్తున్నాను. ఆ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా, గొప్ప విషయంగా భావిస్తున్నాను. ఇండస్ట్రీలో ఎక్కువ కాలం నిలదొక్కుకోవాలంటే వచ్చిన ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలి. కథల ఎంపిక విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలి తప్ప అతి విశ్వాసం, అతి నమ్మకంతో సినిమాలను వదులుకోవద్దని మీనాక్షి సూచించింది. పుకార్లు అనేవి చాలా కామన్‌గా వస్తూ ఉ ంటాయి. అయినా కూడా రూమర్స్ చూసినప్పుడు కోపం వస్తుంది. నేను ఎప్పుడూ అందుబాటులోనే ఉంటాను. కనుక నన్ను సోషల్ మీడియా ద్వారా సంప్రదించి క్లారిటీ తీసుకోవాలని మీనాక్షి కోరింది. నా గురించి ఏ విషయం అయినా సోషల్ మీడియా ద్వారా నేను చెప్తాను. కనుక పుకార్లను నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

## హీటెక్కించే లుక్స్ లో సామ్.. ఈ ఫోటోలు చూశారా?

సౌత్ సినిమా ప్రపంచంలో బ్యూటీఫుల్ హీరోయిన్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్న టాప్ హీరోయిన్స్ లిస్టులో సమంత రూత్ ప్రభు ఒకరు. సినిమాల్లో తన నటనతోనే కాదు, వ్యక్తిత్వంతోనూ మిలియన్ల మంది అభిమానులను సంపాదించుకుంది. సమంత కెరీర్‌దిశలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా, ఆమెకు ఉన్న ఫైట్ స్పిరిట్ వేరే లెవెల్ అని చెప్పవచ్చు. ఇక లేటెస్ట్ గా, ఆమె పుట్టినరోజు సందర్భంగా 'ఫెమినా' మాగజైన్ విడుదల చేసిన మర్చ్ 2024 కవర్ స్టోరీస్ మరింత హైలైట్ అయ్యాయి. ఫోటో షూట్‌లో సమంత డిఫరెంట్ స్టైల్ తో ఆకట్టుకుంది. వైట్ లేస్ కాస్ట్యూమ్ నుంచి స్టైలిష్ మోడర్న్ అవతారాల వరకు ఆమె ప్రతీ ఫోటో ఒక కొత్త స్టైల్ లా అనిపిస్తోంది. ప్రత్యేకంగా బ్లాక్ క్రియేటివ్ డిజైన్ గౌన్‌లో సమంత అందాన్ని వర్ణించడానికి మాటలు చాలవు.




ఆ డ్రెస్‌లో ఆమె సూపర్ కాన్ఫిడెన్స్‌తో పోజులు ఇవ్వడం చూసి ఫ్యాషన్ లవర్స్ మైమరచిపోయారు. 'ఫెమినా' కవర్ పేజీపై సమంతను చూసిన ప్రతి ఒక్కరూ బ్యూటీఫుల్ హీరోయిన్! అంటూ కామెంట్స్ చేస్తున్నారు. నిజంగానే, ఆమెలో ఉన్న ధైర్యం, గ్లామర్, గ్రేస్ అన్నీ కలిపి ఒక రేర్ కాంబినేషన్. గోల్డెన్ కార్పెట్ లుక్‌లోనూ ఆమె మరింత స్టన్నింగ్‌గా కనిపించింది. ప్రతి డ్రెస్‌ని తనదైన స్టైలిష్ స్వాగ్‌తో క్యారీ చేయగల గుణం సమంతను ప్రత్యేకం చేస్తోంది. సమంత ఫోటోలు అలా పోస్ట్ చేసిన వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఫ్యాన్స్ ఆమె బ్యూటీ, ఫెయిర్ ఫైటింగ్ స్పిరిట్‌ను మళ్ళీ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఆమె చేసిన కొన్ని రిఫ్లెక్టివ్ పోస్ట్‌లు కూడా ఆమె జీవితాన్ని ఎంత పాజిటివ్‌గా ముందుకు తీసుకెళ్లిందో చెప్పకనే చెబుతున్నాయి. మొత్తానికి సమంత ఫెమినా కవర్ ఫోటోలు మరోసారి నిరూపించాయి.. ఎన్ని అడ్డుకట్టలు వచ్చినా, నిజమైన అందం, స్ఫూర్తి ఎప్పుడూ వెలిగిపోతుంది. ఆమె తదుపరి ప్రాజెక్ట్స్‌పై కూడా ఇప్పుడు భారీ అంచనాలు నెలకొన్నాయి.

## బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా



ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాక్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉండవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది. తన తల్లిదండ్రులు కమల్, సారికలు విడాకులు తీసుకున్న సమయంలో తీవ్రమైన ఒత్తిడికి గురి అయ్యాను. చెన్నై నుంచి ముంబై మకాం మార్చిన సమయంలో బెంజ్ కారులో తిరిగే నేను ముంబై లోకల్ రైల్‌లో, ట్యాక్సీ కారులో తిరగాల్సి వచ్చింది. ఆ సమయంలో జీవితం చాలా నేర్పించింది. అన్ని విషయాలను గుర్తు పెట్టుకుని జీవితంలో ముందుకు సాగుతూ వచ్చాను. తిరిగి నా తండ్రి వద్దకు చేరుకునే వరకు చాలా ఒడిదొడుకులు ఎదుర్కొన్నాను. అంత ఈజీగా నా జీవితం సాగలేదని, ముందు ముందు కూడా నటిగా తనను తాను నిరూపించుకునేందుకు విభిన్నమైన పాత్రల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ బోల్డ్‌గా వ్యాఖ్యలు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536